

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

మే, 2021

సంపుటి - 7 | సంచిక-05 | పేజీలు- 52 | వెల : ₹ 20/-






# 5వ స్నాతకోత్సవం



స్నాతకోత్సవ ఉపన్యాసం చేస్తున్న డా॥ రమేష్ చంద్
మెంబర్, నీతి అయోగ్



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



విశ్వవిద్యాలయ ఐదవ స్నాతకోత్సవం (ఆన్‌లైన్)లో ప్రసంగిస్తున్న గౌ॥ తెలంగాణ రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ మరియు వర్సిటీ కులపతి డా॥ తమిళిసై సౌందరరాజన్



ఫ్యాకల్టీ బోర్డు సమావేశంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు



డా॥ బాబూ జగ్జీవన్‌రామ్ 114 వ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు



వ్యవసాయ విశ్వవిద్యాలయంతో (ఆన్‌లైన్‌లో) ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రతిమ అగ్రి సర్వీసెస్



నువ్వుల పంటలో డ్రోన్‌ను ఉపయోగించి సస్యరక్షణ మందులను పిచికారి చేసే ప్రాజెక్టును ప్రారంభించిన జగిత్యాల జిల్లా జడ్ పి చెర్‌పర్సన్ గౌ॥ శ్రీమతి దావా వసంత, సహ పరిశోధన సంచాలకులు డా॥ పి. జగన్మోహన్ రావు మరియు ఇతర శాస్త్రవేత్తలు




దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశంలో పాల్గొన్న మహబూబ్‌నగర్ అడిషినల్ కలెక్టర్ గౌ॥ శ్రీ శ్రీనివాస రెడ్డి, పరిశోధన సంచాలకులు డా॥ ఆర్. జగదీశ్వర్, విస్తరణ సంచాలకులు డా॥ జి. శామ్యూల్ మరియు ఇతర అధికారులు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

మే, 2021

శ్రీ ప్లవ నామ సం॥ చైత్ర బహుళ పంచమి నుండి వైశాఖ బహుళ పంచమి వరకు


## సంపాదక వర్గం




ప్రధాన సంపాదకులు

డా॥ చెల్లా వేణు గోపాల రెడ్డి

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ జి. శ్రీనివాస్

ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (అగ్రానమి)

డా॥ యన్. రామగోపాల వర్మ

ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

పర్యవేక్షణ

డా॥ కాలిశెట్టి వాణిశ్రీ

శాస్త్రవేత్త



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు. డి. డి. అయితే

Principal Agricultural Information Officer, AI&CC and PJTSAU Press

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



చిరునామా :

ప్రిన్సిపల్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్

వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం

ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.

తెలంగాణ రాష్ట్రం, ఫోన్ నెం. 040-24015380

e-mail : pjtsau.paio@gmail.com

vyavasayam.pjtsau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.................................................... 5
2. ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు............ 6
3. వాతావరణం - పంటల పరిస్థితి - విశ్లేషణ................ 10
4. సాంకేతిక వ్యాసాలు
   - వరి సాగు ఖర్చు నియంత్రణకు వెదజల్లే పద్ధతి........ 11
   - మొక్కజొన్నలో చీడపీడల నివారణకు వేసవిలో చేపట్టవలసిన ముందస్తు సస్యరక్షణ చర్యలు............ 13
   - వేసవి అపరాల్లో చీడపీడల యాజమాన్యం.............. 15
   - వివిధ పంటల్లో విత్తన ఎంపిక మెళకువలు మరియు విత్తన మొలక పరీక్ష ఆవశ్యకత................16
   - చెఱకులో ఫర్టిగేషన్ విధానంలో ఎరువుల వాడకం..... 18
   - విత్తన నిల్వలో శిలీంద్రాల యాజమాన్యం.............. 21
   - కమ్యూనిటీ ఆధారిత విత్తనోత్పత్తి - ముఖ్య ఉద్దేశ్యము మరియు సలహాలు..................................... 23
   - వేసవి దుక్కులు చేయడం వలన ప్రయోజనాలు..........25
   - వ్యవసాయ విశ్వవిద్యాలయ ఐదవ స్నాతకోత్సవం...... 26
   - వేసవిలో పచ్చిగడ్డి మేతకు బదులు - పాతరగడ్డి....... 28
   - నేలల భౌతిక సమస్యలు - యాజమాన్యం.............. 30
   - వర్మికంపోస్ట్ తయారీ..............................................31
   - మే మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.............................................. 32
   - రక్షిత గృహాల్లో ఉద్యానవన పంటల సాగు - మెళకువలు................................................. 34
   - గులాబీలో శారీరక రుగ్మతలు - నివారణ...............37
   - పూల కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు...... 38
   - వడగాలుల సమయంలో వ్యవసాయంలో చేపట్టవలసిన చర్యలు..................................................... 40
   - వ్యవసాయ పదవినోదం..............................41
   - టమాట సాగులో ఎదురయ్యే పోషక లోపాలు మరియు ఇతర సమస్యలు - సవరణ................... 42
   - వేసవిలో కీర దోసకాయ - ప్రయోజనాలు............ 44
5. టి.వి. చానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు........................................................ 46
6. రైతన్నకో ప్రశ్న..........................................................47
7. విశ్వవిద్యాలయ వార్తలు..................................................48
8. రైతు విజయగాథ
   - వ్యాపారాత్మకంగా షేడ్‌నెట్‌లో నర్సరీ పెంపకం-....... 49 సిరులు కురిపిస్తున్న ఆర్యప్రాజెక్టు విజయగాథ

# మే మాసం క్యాలెండర్ - 2021

## శ్రీ ప్లవ నామ సం॥ చైత్ర బహుళ పంచమి నుండి వైశాఖ బహుళ పంచమి వరకు

| SUN ఆది రాహుకాలం సా. 4.30-6.00 | MON సోమ రాహుకాలం సా. 4.30-6.00 | TUE మంగళ రాహుకాలం మ. 3.00-4.30 | WED బుధ రాహుకాలం మ, 12,00-1.30 | THU గురు రాహుకాలం మ. 1.30-3.00 | FRI శుక్ర రాహుకాలం ఉ. 10.30-12.00 | SAT శని రాహుకాలం ఉ. 9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| 30 చవితి ఉ. 8-38, ఉత్తరాషాఢ రా. 9-34, ఉ.వ. 6-09 ల 7-41, రా.వ. 1-28 ల 3-02 | 31 పంచమి ఉ. 7-05, శ్రవణం, రా. 9-01, రా.వ. 1-00 ల 2-35 | | | | | 1 చైత్ర బ. పంచమి రా. 10-17, మూల ప. 3-31, ప.వ. 2-00 ల 3-31, రా.వ. 12-39 ల 2-11 |
| 2 షష్ఠి రా. 8-27, పూర్వాషాఢ ప. 2-22, రా.వ. 10-05 ల 11-37 | 3 సప్తమి రా. 6-57, ఉత్తరాషాఢ ప. 1-31, సా.వ. 5-26 ల 7-00 | 4 అష్టమి సా. 5-52, శ్రవణం ప. 1-05, సా.వ. 5-04 ల 6-40 | 5 నవమి సా. 5-13, ధనిష్ఠ ప. 1-03, రా.వ. 8-24 ల 10-02 | 6 దశమి సా. 5-06, శతభిషంప. 1-33, రా.వ. 8-12 ల 9-52 | 7 ఏకాదశి సా. 5-29, పూర్వాభాద్ర ప. 2-31, రా.వ. 12-42 ల 2-24 | 8 ద్వాదశి సా. 6-21, ఉత్తరాభాద్ర సా. 4-00, తె.వ. 4-57 ల |
| 9 త్రయోదశి రా. 7-39, రేవతి సా. 5-53, ఉ.శే.వ. 6-40 వ | 10 చతుర్దశి రా. 9-21, అశ్విని రా. 8-10, ప.వ. 3-47 ల 5-32 | 11 అమావాస్య రా. 11-18, భరణి రా. 10-42, ఉ.వ. 6-46 ల 8-32 | 12 వైశాఖ శు. పాడ్యమి రా. 1-20, కృత్తిక రా. 1-18, ప.వ. 11-59 ల 1-46 | 13 విదియ తె. 3-17, రోహిణి తె. 3-50, సా.వ. 6-58 ల 8-45 | 14 తదియ తె. 5-00, మృగశిర పూర్తి, ఉ.వ. 9-59 ల 11-44 | 15 చవితి పూర్తి, మృగశిర ఉ. 6-13, ప.వ 3-18 ల 5-01 |
| 16 చవితి ఉ. 6-27, ఆర్ద్ర ఉ. 8-10, రా.వ. 8-54 ల 10-36 | 17 పంచమి ఉ. 7-21, పునర్వసు ఉ. 9-40, సా.వ. 6-00 ల 7-40 | 18 షష్ఠి ఉ. 7-46 పుష్యమి ఉ. 10-41, రా.వ. 11-45 ల 1-23 | 19 సప్తమి ఉ. 7-38, ఆశ్రేష ఉ. 11-11, రా.వ. 11-12 ల 12-48 | 20 అష్టమి ఉ. 7-03, మఘ ఉ. 11-13, రా.వ. 7-05 ల 8-40 | 21 నవమి ఉ. 6-00, దశమి తె. 4-26, పుబ్బ ఉ. 10-50, సా.వ. 5-47 ల 7-20 | 22 ఏకాదశి రా. 2-37, ఉత్తర ఉ. 10-03, సా.వ. 6-03 ల 7-35 |
| 23 ద్వాదశి రా. 12-33, హస్త ఉ. 8-57, సా.వ. 4-29 ల 5-59 | 24 త్రయోదశి రా. 10-16, చిత్ర ఉ. 7-34, ప.వ. 12-48 ల 2-17 | 25 చతుర్దశి రా. 7-51, స్వాతి, ఉ. 6-00, విశాఖ తె. 4-20, ప.వ. 11-12 ల 12-42 | 26 పూర్ణిమ సా. 5-24, అనూరాధ రా. 2-41, ఉ.వ. 8-03 ల 9-32 | 27 వైశాఖ బ. పాడ్యమి ప. 2-58, జ్యేష్ఠ రా. 1-06, ఉ.వ. 7-54 ల 9-24 | 28 విదియ ప. 12-40, మూల రా. 11-40, ఉ.వ. 8-37 ల 10-07, రా.వ. 10-09 ల 11-40 | 29 తదియ ఉ. 10-31, పూర్వాషాఢ రా. 10-27, ఉ.వ. 8-46 ల 10-17 |

14 ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్)
15 రంజాన్ తదుపరి దినం

03 షహదత్ అజత్ అలీ (ఆర్.ఏ)
07 జుమా-అతుల్-వద
10 సాబ్-ఇ-క్వాదర్
14 బసవ జయంతి
26 బుద్ధ పూర్ణిమ

భరణి కార్తె 28.04.2021 నుండి 10.05.2021) వేసవి పనులు

కృత్తిక కార్తె (11.05.2021 నుండి 24.05.2021) వేసవి పనులు

రోహిణి కార్తె (25.05.2021 నుండి 07.06.2021)

# న్యూట్రిగార్డ్ డెన్ - మానవాళి పోషకాహారానికి భరోసా



డా॥ వి. ప్రవీణ్ రావు
ఉపకులపతి

పోషకాహారలోపం ప్రపంచ వ్యాప్తంగా నిర్లక్ష్యం చేయబడిన అతి ప్రధాన సమస్య. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలు మరియు వివిధ రోగాలకు పోషకాహారలోపం అనేది ముఖ్య కారణంగా పేర్కొనబడుతున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఒక బిలియన్, మనదేశంలో 189 మిలియన్ జనాభా పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. 2030కి ఈ సమస్య తీవ్రతరం కానుందని, 2050కి ఇప్పుడు పండించే పంటల ఉత్పత్తి 70 శాతం మేర పెరిగితే తప్ప పెరుగుతున్న జనాభాకు సరిపోదని అంచనా.

పోషకాహారలోపం మానవాభివృద్ధి మరియు దేశ ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన సవాలుగా పరిణమించింది. గ్లోబలైజేషన్ వలన జంక్ ఫుడ్/ఫాస్ట్ ఫుడ్ కల్చర్ త్వరగా వ్యాప్తి చెందింది. దురదృష్టవశాత్తు మన దేశంలో కూడా ఈ సంస్కృతి విపరీతంగా వ్యాప్తి చెందటం జరుగుతున్నది తద్వారా యువత ఊబకాయం, వివిధ పోషకాహార రుగ్మతలకు గురౌతున్నారు. బాలింతలు, గర్భవతులు మరియు చిన్న పిల్లలు కూడా ఈ విషవలయంలో చిక్కుకుంటున్నారు.

పోషకాహారలోపాన్ని అధిగమించి సమతుల ఆహారాన్ని అందించడానికి న్యూట్రిగార్డ్ న్ (పోషకాహారతోట) పెంపకం చాలా సులభమైన మరియు ఉత్తమమైన మార్గం. పెరటితోట పెంపకాన్ని కొద్దిగా మార్చి 'న్యూట్రిగార్డెన్' మోడల్‌ను అభివృద్ధి పరిచారు. న్యూట్రిగార్డెన్ మోడల్ ముఖ్యఉద్దేశ్యం ఒక కుటుంబానికి కావల్సిన రోజు వారి పోషకాలను వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ద్వారా అందించటమే. ప్రతి ఇంటిలో 3 రకాల ఆకుకూరలు, 1-2 రకాల పండ్ల మొక్కలు పెంచటం ద్వారా సంవత్సరం మొత్తం పోషకాహారాన్ని అందించటమే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చవచ్చును. అలానే సంవత్సరం మొత్తం గ్రామంలో ఆకుకూరలు, పండ్లు దొరకడమే కాకుండా అదనపు ఆదాయం చేకూరుతుంది. న్యూట్రిగార్డెన్ మోడల్‌లో రెండు విధాలుగా ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలను పెంచవచ్చును. మొదటిది దీర్ఘచతురస్రాకార ఎత్తుమళ్ళ పద్ధతి బాగా ఆదరణ పొందిన మోడల్. రెండవది వృత్తాకార పద్ధతి. దీనిలో మధ్యలో కంపోస్ట్ గుంతను కూడా ఏర్పాటు చేసుకోవచ్చును. దీర్ఘచతురస్రాకార ఎత్తుమళ్ళ పద్ధతిని సులభంగా ఆచరించవచ్చును. అందుబాటులో ఉన్న స్థలంలో నుండి 1000-1300 చ. అడుగులలో న్యూట్రిగార్డెన్ పెంచుకునే ఔత్సాహికులు కూడా ఉన్నారు. స్థలం లేని వారు గోనె సంచులలో మట్టి నింపి న్యూట్రిగార్డెన్ పెంచుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార వైవిధ్యం అలవర్చటం, ఆహార వైవిధ్య ప్రాముఖ్యతను వివరించటం, పంట కోతకు ముందు, పంట కోతకు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మెళకువలను నేర్పించటం ద్వారా పోషకాహారలోపాల్ని సమర్ధవంతంగా అరికట్టవచ్చును.

న్యూట్రిగార్డెన్ మోడల్‌ను మొదటగా ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ఆచరించి, తదుపరి ఇతర సంస్థలకు కూడా విస్తరించవచ్చును. ఒరిస్సా, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో గిరిజన ప్రాంతాల్లో స్వయం సహాయక బృందాల సహకారంతో ఒక సంవత్సరంలో లక్షకు పైగా న్యూట్రిగార్డెన్స్‌ను ఏర్పాటు చేసి పోషకాహారాన్ని అందుబాటులోకి తీసుకురావటమే కాకుండా ఆర్థిక పరిస్థితిని కూడా మెరుగుపర్చటం జరిగింది. మన తెలంగాణ ప్రభుత్వం కూడా 'న్యూట్రి గ్రామం' పేరుతో గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ఆరు జిల్లాల్లో 29 ఊళ్ళను ఈ కార్యక్రమానికి ఎంపిక చేసి కార్యచరణను ప్రారంభించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా తమ వంతుగా యూనివర్శిటీ అనుబంధ కళాశాలల్లో న్యూట్రిగార్డెన్స్‌ను పెంచటానికి నిర్ణయం తీసుకోవటం జరిగింది. యూనివర్శిటీ విస్తరణ విభాగంలో భాగమైన కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ఆహార వైవిధ్య అవసరం, పోషకాహార అవసరం, వాటి ప్రాముఖ్యతను, ఒనగూరే ప్రయోజనాలను తెలియజెప్పేందుకు కార్యచరణను రూపొందించింది. ప్రస్తుత కోవిడ్ సమయంలో సమతుల పోషకాహారం అత్యవసరం కనుక ఈ పోషకాహార తోటలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

'నేటి విద్యార్థులే - రేపటి పౌరులు' కావున పాఠశాల విద్యలో వ్యవసాయాన్ని పాఠ్యాంశంగా చేర్చి, పిల్లల్లో ఆసక్తి రేకెత్తించటానికి న్యూట్రిగార్డెన్ మోడల్‌ను ఆచరించాల్సిన తరుణం ఆసన్నమైనది. 'న్యూట్రిగార్డెన్' అవశ్యకతను తెలుసుకొని మరియు సమతుల పోషకాహారాన్ని తీసుకొని అందరూ ఆరోగ్యంగా జీవిస్తారని ఆశిస్తూ .......

ఉపకులపతి



## వరి

ఆలస్యంగా నాట్లు వేసిన కొన్ని ప్రాంతాల్లో యాసంగి వరి పంట కోత దశలో ఉంది. యాసంగి పంట నుండి నాణ్యమైన సొంత విత్తనాన్ని సేకరించుకొని ముఖ్యంగా సూటి రకాలను రాబోయే వానాకాలంలో సాగు చేయటానికి పొలం మొత్తంలో ఎంపిక చేసుకొన్న చిన్నమడి నుండి బెరుకులు/కేళీలు/కల్తీలు ఏరివేసి పంటను కోసుకోవాలి. అలాగే కోసిన పనల నుండి గింజలను రాల్చుకొని వేరుగా ఎండబెట్టి విత్తనంగా నిల్వ ఉంచుకోవాలి.

- ఒకవేళ కేళీలు ముందుగా దుబ్బుకట్టే మరియు పూత దశలో తీసివేయని పరిస్థితుల్లో సాగుచేస్తున్న రకం యొక్క గింజ రంగు, ఆకారం మరియు వెన్ను లక్షణాలు గమనించి ఒకే విధంగా ఉన్న మొక్కల నుండి మాత్రమే విత్తనాలను సేకరించుకోవాలి. విత్తనాల్లో రాళ్ళు, మట్టిపెడ్డలు, రంగు మారిన తప్ప మరియు తాలు గింజలు లేకుండా చూడాలి. విత్తనాలను నిల్వ చేసేటప్పుడు అధిక తేమ మరియు ఉష్ణోగ్రతలకు గురి కాని గాలి మరియు వెలుతురు బాగా తగిలే ప్రదేశాల్లో నిల్వ చేయాలి.
- మే మాసంలో బాగా మాగిన పశువుల ఎరువు లేదా గొర్రెల ఎరువు మరియు కోళ్ళ ఎరువు మొదలైన సేంద్రియ ఎరువులను సేకరించి పొలంమంతటా సమానంగా చల్లుకోవాలి.
- చౌడు మరియు జింక్‌ధాతు లోపం ఎక్కువగా ఉండే తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో భూసారం పెంపొందించి, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకోవటానికి వీలుగా పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ మరియు పిల్లిపెసర విత్తనాలను ఈ మాసంలో సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలి.
- మే మాసంలో వర్షం కురిస్తే వేసవిలో లోతైన దుక్కులు చేసుకోవటం వలన కలుపు నివారణతో పాటు నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. అలాగే వేసవిలో లోతైన దుక్కులు చేయటం వలన కోశస్థ దశలోని పురుగులు, భూమిలో నేల ద్వారా సంక్రమించే వ్యాధికారక శిలీంధ్రాల సిద్ధ బీజాలు ఎండకు నశిస్తాయి.
- రాష్ట్రవ్యాప్తంగా నేలల్లో భాస్వరం ఎరువులు మోతాదుకు మించి ఉన్నాయని పరిశోధనల్లో గుర్తించడమైనది. కావున రైతులు మట్టి నమూనాలను మే నెలలో సేకరించి భూసార పరీక్ష చేయించుకోవాలి. అలాగే పరీక్ష ఫలితాల్లో కూడా భాస్వరం ఎరువు మోతాదుకు మించి గమనించినట్లయితే ఈ వానాకాలంలో (25%) భాస్వరం ఎరువును తక్కువగా వేసుకోవాలి.
- తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలిక రకాలు (150 రోజులు) సాగు చేయటం వలన ఎక్కువ నీరు మరియు విద్యుత్తు వాడకమే కాకుండా పచ్చిరొట్ట పంటలు వేసి భూమిలో కలియదున్నడానికి సమయం ఉండదు. అంతేకాకుండా చెరువులు మరియు నీటి పారుదల పాజెక్టుల క్రింద దీర్ఘకాలిక రకాలను ఆలస్యంగా నాట్లు వేయటం వలన పంట చీడపీడలకు గురై దిగుబడులు తగ్గుతాయి. దీర్ఘకాలిక రకాలనే సాగుచేయాల్సిన సందర్భంలో అవకాశం ఉన్న చోట నేరుగా విత్తే పద్ధతులతో విత్తుకోవచ్చు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో మధ్య మరియు స్వల్పకాలిక రకాలను వేసుకోవటం మంచిది.

**డా॥ పి. రఘు రామి రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (వరి)**
వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్,
ఫోన్ నెం. 7337399470

## మొక్కజొన్న

**మొక్కజొన్న:** మొక్కజొన్నను నూర్పిడి చేసి మంచి మార్కెట్ ధర రావాలంటే తప్పనిసరిగా పాటించవలసిన నాణ్యతా ప్రమాణాలు

- దుమ్ము, చెత్త, రాళ్ళు, మట్టి పెళ్ళలు 1.0 శాతం మించరాదు.
- గింజలో తేమ 14 శాతం కంటే ఎక్కువ ఉండరాదు.
- విరిగిన విత్తనాలు 2.0 శాతం మించరాదు.



- పాడైపోయిన విత్తనాలు 6.0 శాతంలోపు ఉండాలి.
- ఇతర రంగు మొక్కజొన్న గింజలు 6.0 శాతం మించకుండా ఉండాలి. గింజలలో అఫ్లాటాక్సిన్ మోతాదు కిలోకి 20 మైక్రో గ్రాములకి మించరాదు.
- మొక్కజొన్నను విత్తనం కొరకు నిల్వచేయదలచినచో డెల్టామెత్రిన్ 4 గ్రా. క్వింటా విత్తనానికి పట్టించి పురుగు ఆశించకుండా భద్రపరచుకోవాలి. గట్లు శుభ్రపరిచి మురుగు నీరు పోవుటకు కాలువలు ఏర్పరుచుకోవాలి. నీటి వసతి కలిగిన రైతులు తొలకరి వర్షాన్ని ఉపయోగించుకొని పిల్లి పెసర, జనుము మరియు జీలుగ లాంటి పంటలను వేసి భూసారాన్ని పెంచుకొనవచ్చు. రాబోయే వానాకాలంలో వేసే మొక్కజొన్న పంటకై వేసవి దుక్కులు దున్నుకొని నేలను తయారు చేసుకోవాలి. ఇలా చేసినచో చీడపీడలు మరియు కలుపు మొక్కలు నివారణయే కాకుండా నేల వర్షపు నీటిని ఎక్కువ మోతాదులో గ్రహించగలుగుతుంది. నాణ్యమైన విత్తనాలను పరిశోధన స్థానములు లేదా గుర్తించబడిన ప్రైవేట్ విత్తన సంస్థల నుండి సేకరించి, మొలకశాతం లెక్కగట్టాలి. మొలకశాతం 90 శాతం పైగా ఉన్నవాటినే విత్తుకోవాలి.

**డా॥ యం. వి. నగేష్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త& హెడ్ (మొక్కజొన్న), మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## చిరుధాన్యాలు

వానాకాలం సాగుకు పొలం తయారు చేసుకోవడం. నేలలో తేమ అనుకూలంగా ఉన్నప్పుడు భూమిని 2-3 సార్లు లోతుగా దున్ని పొలంను తయారు చేసుకోవాలి. ఇలా లోతుగా దున్నడం వలన భూమి గుల్లబారి వర్షాకాలంలో వచ్చే వర్షపునీరు భూమిలోకి బాగా ఇంకుతుంది. భూమిని దున్నటం వలన నేల లోపల ఉండే పురుగులు, రోగకారక శిలీంధ్రాలు ఎండ వేడి వలన భూమి పైకి వచ్చి నశిస్తాయి. కోశస్థ దశలో ఉన్న పురుగులను, గొంగళి పురుగులను పక్షులు తింటాయి. దున్నే ముందు పశువుల ఎరువును పొలంలో వేసి బాగా కలియదున్నాలి. భూమిని బాగా మెత్తగా దున్నటం వలన భూమిలో తేమ శాతం కూడా వృద్ధి చెందుతుంది.

**విత్తనాల సేకరణ:** మన పంట పొలాలకు సరిపోయే అధిక దిగుబడినిచ్చు పంట రకాలను ఎంపిక చేసుకొని, విత్తనాలను సేకరించి పెట్టుకోవాలి.

**సజ్జ రకాలు:** వి.హెచ్.బి.-3, హెచ్.హెచ్.బి.-67, ఐ.సి.ఎమ్.హెచ్.-356, ఐ.సి.టి.పి.-8203.

**రాగి రకాలు:** శ్రీచైతన్య, హిమ, మారుతి.

**డా॥ యం. వి. నగేష్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (చిరు ధాన్యాలు), మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## వేరుశనగ

వానాకాలం వేరుశనగ సాగుకు ఇసుకతో కూడిన గరప నేలలు లేదా నీరు త్వరగా ఇంకే ఎర్ర చల్కా నేలలను మెత్తగా దుక్కి చేసి ముందస్తుగా వాలుకు అడ్డంగా చదును చేసుకోవాలి. మట్టి నమునాను సేకరించి భూసార పరీక్ష చేయించుకోవాలి. అయా ప్రాంతాలకు అనుకూలమైన రకాలను ఎంచుకొని, కాయల నుండి విత్తనాన్ని ఒలిచి పెట్టుకోవాలి. పంటకు కావలసిన విత్తనాలు, ఎరువులు మరియు రసాయన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలి.

## ప్రొద్దుతిరుగుడు

ఫిబ్రవరిలో విత్తిన పంట ఈ మాసంలో కోతకు వస్తుంది. పువ్వు వెనుక భాగం పసుపు రంగుకు మారినప్పుడు పువ్వులను కోసి, 2-3 రోజుల పాటు ఆరబెట్టాలి. నూర్పుడి యంత్రాలను ఉపయోగించి విత్తనాన్ని వేరు చేయాలి. గింజల్లో తేమ 9-10 శాతం వచ్చే వరకు ఎండబెట్టాలి.



## నువ్వులు

నువ్వులను ముందస్తు వానాకాలంలో పండించుటకు మే రెండవ పక్షంలో విత్తుకోవచ్చు. అయా ప్రాంతాలకు అనువైన రకాల విత్తనాలను సేకరించాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ మరియు ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ. చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే తొలి దశలో వచ్చే తెగుళ్ళు మరియు రసం పీల్చే పురుగులను నివారించవచ్చును. విత్తనాన్ని వరుసల మధ్య 30 సెం.మీ. మరియు మొక్కల మధ్య 15 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్ మరియు 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి.

## ఆముదం

వానాకాలం ఆముదం సాగు కోసం దుక్కి ముందస్తుగా తయారు చేసుకోవాలి.

## కుసుమ

ఏక పంటగా లేదా స్వల్పకాలిక అపరాల తర్వాత కుసుమను విత్తుకునే ప్రాంతాల్లో వేసవి దుక్కులు చేసుకోవాలి.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 7207240582**

## అపరాలు

వేసవిలో విత్తన పెసర/మినుము ఎదుగుదల దశ నుండి కాయ తయారగు దశలో ఉన్నవి. పెసర, మినుములో కలుపు నివారణకు పైరు విత్తిన 20-25 రోజుల మధ్యలో ఎకరాకు 250 మి.లీ. ఫెనాక్సిప్రాప్-పి-ఇథైల్ లేదా 400 మి.లీ. క్విజాలోఫాప్ ఇథైల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి ఊదను సమర్థవంతంగా నివారించుకోవచ్చు. ఊదతో పాటు వెడల్పాటి కలుపు జాతి మొక్కలు ఉన్నట్లయితే ఎకరాకు ఇమాజితాఫిర్ 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి కలుపును సమర్థవంతంగా నివారించవచ్చు. పొలంలోను, గట్ల మీద గడ్డి లేకుండా చూడాలి. వేసవిలో ఎక్కువగా తెల్లదోమ ఆశించినప్పుడు మొక్కలు పాలిపోయినట్లు కనబడును. తెల్లదోమ రసం పీల్చడమే గాక పల్లాకు తెగులు కూడా వ్యాపింపజేస్తుంది కావున సకాలంలో దీనిని నివారించాలి. పల్లాకు తెగులు సోకిన మొక్కలను (ఆకులు పసుపు మరియు ఆకుపచ్చ వర్ణం కల్గిఉండును) తీసి కాల్చివేసి తెగులును వ్యాపింపజేసే తెల్లదోమ నివారణకై సమగ్ర చర్యలు చేపట్టాలి. పంట చేనులో పసుపు రంగు జిగురు అట్టలను అమర్చి తెల్లదోమ ఉనికిని పర్యవేక్షించాలి. 5% వేప కషాయం లేదా వేపనూనె 5.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో తెల్లదోమతో పాటు రసం పీల్చే పురుగుల ఉధృతి తగ్గును. తెల్లదోమ నివారణకై ట్రైజోఫాస్ 2.0 మి.లీ. లేదా 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లేదా డైఫెన్‌థయూరన్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. విత్తిన 15-20 రోజుల దశలో ఉన్న పంటలో రసం పీల్చే పురుగులు (తామర పురుగు మరియు పేనుబంక) ఆశించి ఎదుగుదల కుంటిపడి దిగుబడి తగ్గును. నివారణకై లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 2.0 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ అవసరాన్ని బట్టి మందులు మార్చి 4-5 రోజుల వ్యవధిలో ఉధృతిని బట్టి పిచికారి చేయాలి. తామర పురుగుల ఉనికిని గమనించడానికి నీలం రంగు జిగురు అట్టలను అమర్చాలి. మొగ్గ, పూత దశలో ఉన్న పంటలో శనగపచ్చ పురుగు, మారుకామచ్చల పురుగు ఆశించి నష్టం కల్గిస్తాయి. మొగ్గ దశలో 5% వేప కషాయం లేదా వేపనూనె 5.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో వీటి ఉధృతి చాలా వరకు తగ్గును. పూత దశలో 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 2.0 మి.లీ. క్వినాల్‌ఫాస్ లేదా 0.75 మి.లీ. నొవాల్యురాన్‌లను అవసరం మేరకు 5 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి



చేయాలి. వేసవిలో సాగు చేస్తున్న పంట తేమకు సున్నితంగా ఉంటుంది. కావున పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా పంట బెట్టకు గురికాకుండా చూడాలి, లేని యెడల మొగ్గ, పూత, పిందె రాలిపోయి దిగుబడి తగ్గును. అవసరం మేరకు కీలక దశల్లో మొగ్గ, పిందె, గింజ తయారగు దశల్లో తడులు ఇవ్వాలి. అలాగే కీలక దశల్లో ముఖ్యంగా గింజ తయారయ్యే దశలో రెండు శాతం (20 గ్రా. లీటరు నీటికి) యూరియా ద్రావణం లేదా మల్టీ-కె 5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసినచో నాణ్యమైన దిగుబడిని పొందవచ్చును. పూత మరియు కాయ తయారగు దశల్లో రసం పీల్చు పురుగులు ఆశించినచో 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వేసవిలో సాగు చేసిన పంట నీటి ఎద్దడిని తట్టుకోలేదు. కావున బెట్టకు గురికాకుండా చూడాలి. లేని యెడల పిందె రాలిపోయే ప్రమాదం ఉంది. అవసరం మేరకు కీలక దశల్లో ముఖ్యంగా పిందె, గింజ/కాయ తయారగు దశల్లో నీటి తడులు ఇవ్వాలి.

**డా॥ కె. రుక్మిణి దేవి, సీనియర్ శాస్త్రవేత్త & హెడ్ (అపరాలు) వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## చెఱకు

చెఱకు పంట ప్రస్తుతం పిలక దశలో ఉంది. ఈ దశలో నీటి వసతి తక్కువగా ఉండి, పంట నీటి ఎద్దడికి గురయ్యే పరిస్థితులలో 2.5% యూరియా + పొటాష్ ద్రావణాన్ని పిచికారి చేయడం వలన పంట నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు బిందు సేద్యం ద్వారా నీటిని పొదుపుగా వాడుకోవచ్చు. పిలక దశలో ఉన్న చెఱకు తోటకు తేలికపాటి నేలల్లో అయితే వారానికొకసారి, బరువైన నేలల్లో 10-15 రోజులకొకసారి నీటి తడిని పంటకు అందించాలి. మే మాసంలో చెఱకు పిలక దశలో కాటుక తెగులు పంటను ఆశిస్తుంది. తెగులు సోకిన మొక్కలలో మొవ్వు పొడవైన నల్లని కొరడాల మారుతుంది. ఈ తెగులు విత్తనపు ముచ్చెల ద్వారా వ్యాపిస్తుంది. తెగులు సోకిన దుబ్బులను తీసి తగలబెట్టాలి. తెగులు ఆశించిన తోటల్లో నివారణ కొరకు 1.0 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ 18.2% డబ్ల్యు.డబ్ల్యు. + డైఫెన్‌కొనజోల్ 11.4% డబ్ల్యు.డబ్ల్యు పిచికారి చేయాలి. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే చెఱకు దిగుబడి మరియు రస నాణ్యత తగ్గుతుంది. వేసవి కాలంలో చెఱకు తోటల్లో పీక పురుగు ఎక్కువగా నష్టపరుస్తూ ఉంటుంది. వర్షాధారపు చెఱకుపై తాకిడి ఎక్కువగా ఉంటుంది. చెఱకు భూమి ఉపరితలంపై కణుపు వచ్చిన తర్వాత ఈ పురుగులు కాండం తొలచడం ప్రారంభించి మొక్క లోపలికి చొచ్చుకొనిపోయి లోపలి భాగాన్ని తినివేయడం వలన మొవ్వులు ఎండి చనిపోతాయి. చనిపోయిన మొక్కలు పీకినా తేలికగా బయటికి వస్తాయి. కుళ్ళిపోయిన మొవ్వు నుండి దుర్వాసన వస్తుంది. పీక పురుగు నివారణ కొరకు చనిపోయిన మొవ్వులను ఏరి నాశనం చేయాలి. పురుగు ఆశించిన తోటల్లో మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.75 మి.లీ. లేదా క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.75 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి లేదా క్లోరాంట్రానిలిప్రోల్ గుళికలను ఎకరాకు 7.5 కిలోల చొప్పున నేలలో వేసుకోవాలి. ఈ మాసంలో అధిక ఉష్ణోగ్రతలు మరియు వాన జల్లులు పడినప్పుడు, ఆ జల్లుల మధ్య నీటి ఎద్దడి పరిస్థితులు ఉన్నప్పుడు ఎర్రనల్లి / లక్క తెగులు పంటను ఎక్కువగా ఆశిస్తుంది. ఎర్రనల్లి నివారణ కొరకు స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లేదా డైకోపాల్ 5 మి.లీ. లేదా 3 గ్రా. నీటిలో కరిగే గంధకపు పొడి ఆకుల అడుగు భాగం తడిచేలా పిచికారి చేయాలి. పంట నీటి ఎద్దడికి గురైనప్పుడు చెఱకు చెత్తను హెక్టారుకు 3 టన్నుల చొప్పున మొక్క మరియు మోడెం/కార్శి తోటల్లో పరచడం వలన నీటి ఎద్దడిని పంట కొంత వరకు తట్టుకుంటుంది. చెత్తను మందంగా కప్పకూడదు. దీని వలన మొక్క తోటల్లో మొలక శాతం, మోడెం తోటల్లో పిలకల సంఖ్య తగ్గుతుంది.

**డా॥ యం. శ్రీధర్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (చెఱకు), ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్, ఫోన్ నెం. 9949437035**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ జి. శ్రీనివాస్
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలకాలంలో (01.06.2020 నుండి 30.09.2020) సాధారణ వర్షపాతం 720.4 మి.మీ. గాను 1078.3 మి.మీ. అనగా 50 శాతం సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనది. నైరుతి ఋతుపవనాలు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల నుండి అక్టోబర్ 26 నుండి పూర్తిగా నిష్క్రమించాయి.

రాష్ట్రంలో 01.10.2020 నుండి 31.12.2020 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 125.0 మి.మీ. గాను 179.4 మి.మీ. అనగా 44 శాతం సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనది.

రాష్ట్రంలో 01.01.2021 నుండి 28.02.2021 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 11.4 మి.మీ. గాను 4.2 మి.మీ. అనగా -63 శాతం సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదైనది.

రాష్ట్రంలో 01.03.2021 నుండి 30.04.2021 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 20.3 మి.మీ. గాను 21.4 మి.మీ. అనగా 5 శాతం సాధారణ వర్షపాతం నమోదైనది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం ప్రకారం జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ రూరల్, యదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, నల్గొండ, ములుగు మరియు నారాయణపేట జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనది. కొమరంభీమ్ ఆసిఫాబాద్, వరంగల్ అర్బన్, సంగారెడ్డి మరియు నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనది. నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, జనగాం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట మరియు ఖమ్మం జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైనది. ఆదిలాబాద్, మంచిర్యాల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదైనది.

భారత వాతావరణ విభాగం (ఐ.ఎం.డి), న్యూఢిల్లీ వారు అందించిన ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం 2021 సంవత్సరానికి గాను దేశం మొత్తానికి రాబోవు జూన్ నుండి సూచనలున్నాయి.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- వానాకాలంలో ఆశించే కలుపు, చీడపీడలను నివారించడానికి వేసవి లోతు దుక్కులను చేసుకోవాలి.
- కూరగాయ పంటల్లో రసం పీల్చే పురుగుల నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- **వంగలో కొమ్మ మరియు కాయతొలుచు పురుగు నివారణకు** లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు యొక్క ఉధృతిని పర్యవేక్షించుకోవాలి. పురుగు సోకిన కొమ్మలను త్రుంచి నాశనం చేయాలి. 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- కూరగాయ పంటల్లో పొగాకు లద్దెపురుగు నివారణకు 1.25 మి.లీ. నొవాల్యూరాన్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- మిరపలో సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు నివారణకు 2 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మిరపలో బాక్టీరియా ఆకుమచ్చ తెగుళ్ళ నివారణకు 30 గ్రా. కాపర్ఆక్సీక్లోరైడ్ + 1 గ్రా. ప్లాంటామైసిన్ 10 లీటర్ల నీటికి కలిపి వారం వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి. మిరపలో తామర పురుగుల నివారణకు 0.3 మి.లీ. స్పైనోసాడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మామిడిలో తేనె మంచు పురుగు, పిండి నల్లి మరియు పొలుసు పురుగుల నివారణకు 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ + 2.5 మి.లీ వేపనూనెను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- కోళ్ళు వేడి వాతావరణాన్ని తట్టుకొనుటకు షెడ్లల్లో ఫ్యాన్లను మరియు ఫాగర్స్‌ను అమర్చి షెడ్లను వరిగడ్డితో కప్పి స్ప్రింక్లర్లను అమర్చాలి. కోళ్ళు ఎక్కువ మోతాదులో తినుటకు అనుగుణంగా మెత్తటి దాణాను పెట్టి త్రాగుటకు చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి.
- అధిక ఉష్ణోగ్రతల వలన పాలలో వెన్న శాతం తగ్గకుండా ఉండుటకు పాలిచ్చు ఆవులు మరియు గేదెలకు పూత దశలో ఉన్న పశుగ్రాసాలను మేతగా వేయవలెను.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9989625231



# వరి సాగు ఖర్చు నియంత్రణకు వెదజల్లే పద్ధతి


**డా॥ కె.సుమాలిని, డా॥ వి.శ్రీధర్, డా॥ జి.శివ ప్రసాద్ మరియు డా॥ యం.గోవర్ధన్**

వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్, నల్గొండ


తెలంగాణ రాష్ట్రంలో వరి, ప్రత్తి, కంది, సోయాచిక్కుడు ముఖ్యమైన పంటలు కాగా కేవలం వరి పంట ఒక్కటే రాష్ట్రంలో సుమారుగా 55 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వరి తెలంగాణ ప్రజలకు ముఖ్యమైన ఆహార పంట మాత్రమే కాకుండా ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని పొందే పంటగా రైతుల చేత ఆదరించబడుతుంది. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న వరి పంటలో సాగుకు ఎకరానికి 25000/- రూపాయల పైబడి ఖర్చు అవటం నిఖరంగా ఎకరానికి రూ.15,000/- లకు మించి మిగలడం లేదు. కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఇప్పటివరకూ వరిలో కొంత యాంత్రీకరణ జరిగినప్పటికీ నాట్లు, కలుపు తీతకు అయ్యే ఖర్చును తగ్గించాల్సిన అవసరం ఉంది. ప్రాంతాలను బట్టి నాటుకు రూ.4000/- నుంచి రూ. 6000/-, కలుపు తీయుటకు రూ.1600/- నుంచి రూ. 2500/- వరకు ఖర్చు అవుతుంది. వరి నీటిలో పెరిగే ఒక మొండి మొక్క. సరైన పద్ధతిలో/ దూరములో విత్తడం ద్వారా సకాలంలో కలుపును నివారించినట్లయితే ఏ పద్ధతిలో విత్తినప్పటికీ సరిసమానమైన దిగుబడులను పొందవచ్చును. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వరి పైరు శాస్త్రవేత్తలు వివిధ విత్తు పద్ధతులపై పరిశోధించి, వరి సాగు ఖర్చులు నియంత్రించే ఈ క్రింది పద్ధతులను సిఫార్సు చేస్తున్నారు.

1. సీడ్ కం ఫర్టి డ్రిల్ యంత్రం ద్వారా విత్తే పద్ధతి
2. వెదజల్లే పద్ధతి
3. వరి నాటు యంత్రం ద్వారా విత్తే పద్ధతి
4. డ్రమ్ సీడర్ యంత్రం ద్వారా విత్తే పద్ధతి

పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఒక పద్ధతిని ఎంచుకుని సాగు చేసుకోవచ్చును. అన్ని పద్ధతుల కన్నా అతి సులువైన పద్ధతి వెదజల్లే పద్ధతి. ఈ వెదజల్లే పద్ధతి పురాతనమైన పద్ధతి. పూర్వీకులు ఈ పద్ధతిని అనుసరించి గతంలో వరిని సాగు చేశారు. అయితే అప్పటి రకాలు ఎరువులకు స్పందించకపోవడం, కలుపు మొక్కల నివారణకు మందులు లేకపోవడం మూలాన సాగు ఖర్చు పెరగటం వలన ఈ పద్ధతి పై అప్పట్లో స్పందన కరువైంది. ఏది ఏమైనా ఈ మధ్యకాలంలో ఎంతో సమర్థవంతమైన కలుపు మందులు గడ్డి జాతి, వెడల్పాకు మరియు తుంగ కలుపు మొక్కలను అన్నింటిని సమూలంగా నిర్మూలిస్తున్నాయి. అందువలన ఒక్కసారిగా ఔత్సాహిక రైతులందరూ వెదజల్లే పద్ధతి వైపు ఆకర్షితులవుతున్నారు.

**అనువైన రకాలు:** ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సిఫార్సు చేయబడిన అన్ని రకాలను రైతులు వాడుకోవచ్చును.

**నేల తయారీ:** నేల తయారీ అతి ముఖ్యమైన అంశము. వెదజల్లే పద్ధతిలో చిన్న పరిమాణం గల వరి గింజలు నీటిలో గాని, గుంటల్లో గాని పడితే గింజ కుళ్ళి చనిపోతుంది. ఈ కారణం చేత నేలను బాగా చదును చేసుకొని నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దమ్ము చేసి గొర్రుతో చదును చేసిన నేలలో ఒక వ్యక్తి 25 రోజుల్లో 6 ఎకరాల్లో విత్తనాన్ని వెదజల్లుకోవచ్చు. నేలను ప్రతి మూడు పంటలకొకసారి లేజర్ గైడెడ్ లెవెలర్‌తో చదును చేసుకోవడం మేలు.

**విత్తన మోతాదు:** ఎకరాకు దొడ్డు గింజ రకాలైతే 8-10 కిలోలు, సన్న గింజ రకాలైతే 6-8 కిలోల విత్తనం సరిపోతుంది.

**విత్తే పద్ధతి:** నేలను దమ్ము చేసి గొర్రుతో చదును చేసుకున్న పిదప వెంటనే బురదలో విత్తనాన్ని చల్లుకోకూడదు. బురదలో కూరుకుపోయిన విత్తనం సరిగా మొలకెత్తదు. అందుచేత దమ్ము, గొర్రుతో చదును చేసిన పిదప మడిలో 5 సెంటీమీటర్ల నీటిమట్టాన్ని ఉంచి 6 గంటల నుంచి 24 గంటల వరకూ బురదను పేరుకొనేటట్లు చేయాలి. తరువాత అట్టి పొలములో 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టిన, ముక్కులు పగిలిన వరి విత్తనాన్ని పొలమంతా సరిసమానంగా నైపుణ్యంతో వెదజల్లుకోవాలి. వెదజల్లిన పిదప రెండు నుంచి మూడు కిలోల రాయిని ప్లాస్టిక్ సంచిలో ఉంచి మొలక చల్లిన పొలములో ప్రతి మూడు మీటర్లకొకసారి నిలువుగా లాగాలి. ఈ రకంగా తయారు చేసిన కాలువల్లో పొలంలోని నీరు చేరటం ద్వారా మొలక ఎత్తుమడులపై ఉండటం వలన చక్కగా మొలకెత్తుతుంది.

**ఎరువుల యాజమాన్యం:** నాటు పద్ధతిలో లాగా తయారు చేసిన చివరి దుక్కిలో డి.ఎ.పి. 50 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 25 కిలోలు వేసుకోవాలి. అదనంగా యూరియాను విత్తిన 25 రోజులకు, 40 రోజులకు మరియు 60 రోజులకు ఎకరాకు 30 కిలోల చొప్పున వేసుకోవాలి. ఆఖరిగా వేసే నత్రజని మోతాదుతో పాటు 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. జింకు ఎకరాకు 10 కిలోల చొప్పున దుక్కిలో వేసి పైపాటుగా ఎకరానికి 500 గ్రా. జింక్ సల్ఫేట్, వెదజల్లిన 20 నుంచి 25 రోజుల తర్వాత పిచికారి చేసుకోవాలి.

**కలుపు నివారణ:** వెదజల్లిన వరిలో తుంగ, తోడంగ, ఊద వంటి గడ్డిజాతి మొక్కలు మరియు గుంటగలగరాకు, ఇతర వెడల్పాకు కలుపు మొక్కలు ఎక్కువగా మొలుస్తాయి. ఈ కలుపు మొక్కలు 20 రోజుల వయస్సు వరకు చాలా సున్నితంగా ఉంటాయి. కాబట్టి మొలక వచ్చిన 20 రోజులకు లేదా కలుపు మొక్క నాలుగు ఆకులు తొడిగిన సమయంలో వరి మొక్కలను కాపాడుతూ అన్ని రకాల కలుపు మొక్కలపై ప్రభావం చూపి కలుపు మొక్కలను నిర్మూలించగల కలుపు మందులను పిచికారి చేసుకోవాలి. ఫెనాక్సులమ్ 2.7% + బెంజో సల్ఫోనిక్ ఆమ్లం 10% ఒ.డి. 400 మి. లీ. మరియు బిస్పైరి బాక్ సోడియం 10% ఎస్.ఇ. 40 మి. లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి లేదా ఫెనాక్సులమ్ 2.7% + బెంజో సల్ఫోనిక్ ఆమ్లం 10% ఒ.డి.+ సైహలోఫాప్ బుటైల్ 5.1% 800 మి. లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.

ఈ పైమందుల కలయికతో ప్రస్తుతము కలుపు మందులు వివిధ రకాల పేర్లతో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వాటిని నేరుగా వాడుకోవచ్చు. ఒక్కసారి సరైన సమయంలో సరైన మోతాదులో పిచికారి చేసినట్లయితే కూలీలతో కలుపు తీయాల్సిన అవసరం ఉండదు. ఈ పద్ధతులను అవలంబించి ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో లక్ష ఎకరాలకు పైగా సాగుచేస్తున్నారు. ఈ విధానంలో రైతులకు విత్తనానికి, నాటడానికి, కలుపు తీతకు అయ్యే ఖర్చు తగ్గడంతో ఎకరానికి దాదాపు 6000/- నుండి 8000/- రూపాయలు ఆదా అవుతుంది. చాలా మంది రైతుల విజయగాథలు నమోదు చేసినప్పుడు వారి దిగుబడి నాటు పద్ధతికి సమానంగా లేదా అంతకు పైబడిన దిగుమతులను పొందుతున్నారు.

ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు గుర్తించి పాటించడం వలన సకాలంలో సాగు చేయడమే కాకుండా కూలీల అవసరం లేకుండానే వరిని తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా సాగు చేయవచ్చును. ముఖ్యంగా ఆయకట్టు రైతులకు ఇది ఒక వరం. రైతులు ఈ పద్ధతిని అవలంభించటంలో ఆసక్తి చూపించి, సాగుచేసి లబ్ధి పొందుతారని ఆశిద్దాం.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.8121001405





# మొక్కజొన్నలో చీడపీడల నివారణకు వేసవిలో చేపట్టవలసిన ముందస్తు సస్యరక్షణ చర్యలు

డా॥ కె. వాణిశ్రీ, డా॥ బి. మల్లయ్య, డా॥ డి. భద్రు, డా॥ డి. శ్రీలత మరియు డా॥ యం.వి. నగేష్ కుమార్
మొక్కజొన్న పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్



మన రాష్ట్రంలో వర్షాధారంగా పండించే పంటల్లో మొక్కజొన్న ముఖ్యమైనది. వానాకాలంలో సుమారు 4.50 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో దీనిని సాగు చేస్తున్నారు. జాతీయ మరియు అంతర్జాతీయ అవసరాల రీత్యా మొక్కజొన్న పంట ఉత్పత్తులకు మంచి మార్కెట్ ఉండటంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నప్పటికీ వివిధ కారణాలతో రైతులు ఆశించిన స్థాయిలో అధిక దిగుబడులు సాధించలేక పోతున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు చీడపీడలు కూడా జత కావడంతో దిగుబడిలో అధిక నష్టాలను చవిచూస్తున్నారు. ఈ చీడపీడల నివారణకు కేవలం పంటకాలంలో రసాయనిక మందులపైన ఆధారపడకుండా ముందు జాగ్రత్తగా కొన్ని సస్యరక్షణ చర్యలు వేసవిలో చేపట్టినట్లైతే వానాకాలంలో వచ్చే చీడపీడలను కొంతవరకు అదుపులో ఉంచవచ్చును.

**గత సీజనులో సాగుచేసిన పంటల అవశేషాలను తొలగించుట:**

ఇంతకు ముందు సాగుచేసిన మొక్కజొన్న పంట అవశేషాలను పూర్తిగా తొలగించడం వలన కాండం తొలుచు పురుగుల కోశస్థ దశలను నాశనం చేసి తర్వాత సాగు చేసే పంటకు ఈ పురుగులు ఆశించకుండా చేయవచ్చును. అలాగే గత పంట అవశేషాలు మరియు గడ్డిజాతి వివిధ మొక్కలు తెగుళ్ళ శిలీంద్రాలకు (ఫ్యుజేరియం, మాక్రోఫోమినా, రెజోక్టోనియా) నివాసంగా పనిచేసి తెగులు వ్యాప్తికి తోడ్పడుతాయి. కావున పొలంలో మిగిలిన పంట అవశేషాలను మరియు గట్లపై మిగిలిన గడ్డిజాతి మొక్కలను పూర్తిగా నిర్మూలించాలి.

**లోతు దుక్కులు:** పంటను కోసిన తర్వాత మే నెలలో వర్షాలు పడగానే లేదా జూన్‌లో తొలకరి వర్షాలు పడగానే లోతుగా పొలాన్ని దున్నాలి. లోతుగా దుక్కులు చేసుకున్నట్లైతే ముఖ్యంగా

భూమి లోపల ఉండే కత్తెర పురుగు కోశస్థ దశలు బయట పడి ఎండ తాకిడికి లేదా పక్షుల తాకిడికి గుర్తై చనిపోతాయి. అలాగే నేలలో దాగి ఉండే లేదా నిద్రావస్థలో ఉండే తెగుళ్ళు కలుగజేసే శిలీంధ్ర బీజాలతో పాటు నులిపురుగులు మరియు బ్యాక్టీరియా సూర్యరశ్మి తాకిడికి గుర్తై నశిస్తాయి. తెలంగాణ ప్రాంతంలో ఉండే అధిక ఉష్ణోగ్రతలకు ఈ తెగుళ్ళ కారకాలు చాలా వరకు నశించిపోతాయి.

**కలుపు మొక్కలను తొలగించుట:** పొలాన్ని కలుపు మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలి. ముఖ్యంగా మొక్కజొన్న పంట లేనప్పుడు పొలంలో ఉన్న కలుపు మొక్కలపై మొక్కజొన్నను ఆశించే పురుగులు ఆశ్రయం తీసుకొని పంట విత్తుకోగానే వాటిని ఆశించి తీవ్రంగా నష్టం కలిగిస్తాయి. అలాగే వివిధ రకాల గడ్డి జాతి కలుపు మొక్కలు శిలీంధ్రాలకు ఆవాసాలుగా ఉండి తెగుళ్ళ ఉధృతికి దోహదపడతాయి. అందువలన వేసవిలో ముఖ్యంగా పంటను విత్తుకునే ముందు కలుపు మొక్కలు లేకుండా చూడాలి.

**పంట విత్తే సమయం-ప్రణాళిక తయారి:** సమయానికి మొక్కజొన్నను విత్తుకోవాలి. విడతలుగా మొక్కజొన్నను విత్తకూడదు. ఆలస్యంగా వేసిన మొక్కజొన్నను కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. కావున మొక్కజొన్నను నిర్దేశించిన సమయంలోనే విత్తుకునే విధంగా ప్రణాళికను ముందుగానే తయారుచేసుకోవాలి.

**తెగుళ్ళను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకొనుట:** మొక్కజొన్నలో వడలు తెగులు మరియు మసి కాండం కుళ్ళును తట్టుకొనుటకు డి.హెచ్.యం. 117 మరియు కరీంనగర్ మక్క-1 రకాలు అందుబాటులో ఉన్నాయి.

**విత్తనశుద్ధి:** విత్తనశుద్ధి చేయడం ద్వారా మొలకెత్తే విత్తనాలను నేల లేదా విత్తనం ద్వారా సంక్రమించే శిలీంధ్రాల, పురుగుల నుండి కాపాడటంతో పాటు మొలకశాతాన్ని వృద్ధి చేసుకోవచ్చు మరియు అతి తక్కువ ఖర్చుతో చీడపీడలను అదుపులో ఉంచవచ్చు. కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ లేదా థైరమ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ళ బారి నుండి కాపాడవచ్చు. అలాగే కిలో విత్తనానికి 4 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ 600 యఫ్ యస్ లేదా సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సామ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**సాయిల్ సోలరైజేషన్:** ఎండ తీవ్రంగా ఉన్న సమయాల్లో నేలను తడిపి తేమ నేలను 25 మైక్రాన్ల దళసరి పారదర్శక పాలిథీన్ షీట్‌తో కప్పాలి. ఈ పాలిథీన్ షీట్ అంచుల నుండి గాలి చొరబడకుండా సీలింగ్ చేసి షీట్ క్రింద తగినంత వేడి మరియు తేమ నిలిచేలా 4-6 వారాలు కప్పిఉంచాలి. ఈ విధంగా చేయడం ద్వారా నేలలో ఉష్ణోగ్రతలు పెరిగి భూమి పైపొరలలో 30 సెం.మీ. లోతు వరకు ఉన్న శిలీంధ్రాలు, బ్యాక్టీరియా, నులిపురుగులు నశిస్తాయి.

పైన చెప్పిన పద్ధతులను రైతులు ముందస్తు చర్యగా వేసవిలో పాటించినట్లైతే రాబోయే వానాకాలంలో వివిధ చీడపీడల ఉధృతి నష్టపరిమితి స్థాయిలోపు ఉండి, ఉధృతి మరింత పెరగకుండా చేయవచ్చును తద్వారా రసాయన పురుగు మందుల పిచికారి ఖర్చు తగ్గించి అధిక నికరాదాయం పొందటానికి ఆస్కారం ఉంటుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9494407924**





# వేసవి అపరాల్లో చీడపీడల యాజమాన్యం


కె. నాగస్వాతి, డా॥ కె. రుక్మిణిదేవి, డా॥ ఎస్. శ్రీనివాస్ మరియు ఎ. శ్రీరామ్

వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఖమ్మం





వేసవిలో వరి మాగాణుల్లో మార్చి ఆఖరి వరకు విత్తిన పెసర, మినుము మొలక దశ నుండి మొగ్గ దశలో ఉన్నాయి. వేసవిలో క్రమేపి ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గడం వలన తొలిదశ నుండి పూత దశ వరకు రసం పీల్చే పురుగులైన తామర పురుగులు, పేనుబంక, తెల్లదోమ మరియు మొగ్గ, పూత దశలో మారుకా మచ్చల పురుగు ఎక్కువగా ఆశిస్తాయి.

**తామర పురుగులు:** తొలి దశల్లో లేత ఆకులపై వృద్ధి చెంది ఆకుల అడుగు భాగం నుండి రసాన్ని పీలుస్తాయి. ఆకులు దొప్పగా మారుతాయి. మొక్కలు గిడసబారి మాడిపోతాయి. పూత దశలో ఆశించినప్పుడు మొగ్గ, పూత రాలిపోయి పిందెలు గిడసబారి గింజ పరిమాణం తగ్గుతుంది. దీని నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి ఉధృతిని బట్టి వారం వ్యవధిలో మందులు మార్చి పిచికారి చేయాలి. పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలి. పురుగు ఉధృతిని అదుపులో ఉంచడానికి ఎకరానికి 8-12 నీలం రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి.

**తెల్లదోమ:** ఆకుల అడుగు భాగం నుండి రసం పీల్చడం వల్ల మొక్కలు పాలిపోయినట్లు కనబడతాయి. అంతేగాక ఎల్లో మొజాయిక్ (పల్లాకు తెగులు) అనే వైరస్ వ్యాధిని కూడా వ్యాపింపజేస్తాయి. కావున సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి. పల్లాకు తెగులు సోకిన మొక్కలను తొలిదశలోనే గుర్తించి వెంటనే తీసి కాల్చి వేయాలి. తెల్లదోమ నివారణకు పొలంలో పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి. 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా డైఫెన్థయూరాన్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక:** ఆకుల అడుగు భాగం నుండి రసం పీల్చడం వలన మొక్కలు గిడసబారిపోతాయి. అయితే రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి, చల్లని వాతావరణం కలిగి పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు పేనుబంక ఎక్కువగా ఆశిస్తుంది. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగు:** మొగ్గ, పూత దశలో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తుంది. పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది. కాయలు తయారయ్యేటప్పుడు కాయలను దగ్గరకు చేర్చి గూడుగా కట్టి, కాయలను రంధ్రం చేసి లోపలి గింజలను తినటం వలన పంటకు ఎక్కువ నష్టం కలుగుతుంది. నివారణకు మొగ్గ నుండి తొలి పూత దశలో 5 శాతం వేప గింజల కషాయం లేదా వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పూత నుండి పిందె దశలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా నొవాల్యూరాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి పురుగు ఉధృతిని నివారించవచ్చును. పురుగు ఉధృతి అధికంగా గమనించినప్పుడు స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలి. పూత, కాయ తయారయ్యే దశలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి. పైన తెలిపిన ఏదో ఒక మందుతో పాటు మల్టీ-కె 5 గ్రా. లేదా 19-19-19 5 గ్రా. కలిపి పిచికారి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి రైతులు సకాలంలో వివిధ చీడపీడలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టినట్లయితే వేసవిలో అపరాల పంటల్లో అధిక దిగుబడులను సాధించడానికి అస్కారముంటుంది.


ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9652204006



# వివిధ పంటల్లో విత్తన ఎంపిక మెళకువలు మరియు విత్తన మొలక పరీక్ష ఆవశ్యకత

డా॥ యం. పల్లవి, డా॥ వై. భారతి, డా॥ పి. సుజాత, డా॥ యం. రమేష్ మరియు డా॥ టి. ప్రదీప్
విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్

పంట సాగులో విత్తన ఎంపిక చాలా కీలకమైనది. ఎందుకంటే అధిక దిగుబడిని సాధించాలంటే మంచి రకం, యాజమాన్య పద్ధతులతో పాటు నాణ్యమైన విత్తనం ఎంతో అవసరం. విత్తనం నాసిరకంగా ఉంటే మనం పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితి. అందువల్ల అధిక దిగుబడులకు నాణ్యమైన విత్తనం కీలకమైన పెట్టుబడి. అధిక జన్యుస్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత, మొలక శాతం, మొలక సామర్ధ్యం, నిర్దేశించిన తేమ శాతం మరియు ఆరోగ్యమైన విత్తనాన్ని నాణ్యమైన విత్తనంగా పరిగణిస్తాము. విత్తనం జన్యుస్వచ్ఛత పంట దిగుబడులపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపిస్తుంది. కనిష్ఠ జన్యుస్వచ్ఛత వివిధ విత్తన తరగతులకు, పంటలకు మరియు రకాలకు వేరువేరుగా ఉంటుంది. భౌతిక స్వచ్ఛత ఎక్కువగా ఉన్న విత్తనాలలో నాణ్యమైన విత్తనం ఎక్కువగా ఉండి, జడపదార్థాలు, తాలుగింజలు మొదలగునవి తక్కువగా ఉంటాయి. విత్తన నాణ్యతా ప్రమాణాల ప్రకారం భౌతిక స్వచ్ఛత చాలా పంటల్లో ధృవీకరణ విత్తనానికి 98%గా నిర్ణయించారు. విత్తన మొలకశాతం క్షేత్రస్థాయిలో మొక్కల సాంద్రతను నిర్ణయిస్తుంది. నిర్దేశించిన మొలకశాతం కలిగిన విత్తనాలను నాటడం వలన సరైన మొక్కల సాంద్రతను పొందవచ్చు. మొలక సామర్థ్యం అనగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ విత్తనం మొలకెత్తడం, ఉదాహరణకు నీటి ఎద్దడిలోను, చీడపీడల ప్రభావం గల క్షేత్రాల్లోను మొలకెత్తి మొక్కల సాంద్రతను పెంపొందించి దిగుబడులను పెంచుతాయి. విత్తనంలో తేమ శాతం ఎంత తక్కువగా ఉంటే అంత ఎక్కువ కాలం విత్తనం ఆరోగ్యవంతంగా ఉండి, చీడపీడలు ఆశించకుండా ఉంటుంది. విత్తనంలో చీడపీడలు సోకిన విత్తనాలు ఉంటే అవి విత్తనం ద్వారా మొక్కలకు వ్యాప్తి చెంది పంట తొలిదశలో అపార నష్టం కలుగజేస్తాయి.

సాధారణంగా మంచి పరిమాణం, బరువు మరియు రంగు కలిగిన విత్తనాలను నాణ్యమైన విత్తనంగా పరిగణిస్తాము. కాని తాలు విత్తనాలు, రంగు మారిన లేదా ముడతలు ఉన్న విత్తనాలు తక్కువ మొలక శాతాన్ని మరియు నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. కావున రైతులు విత్తన నాణ్యత లక్షణాలను పరిగణలోకి తీసుకుంటూ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవి ఏవనగా

- విత్తనాన్ని వ్యవసాయశాఖ అనుమతి పొందిన అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి.
- తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి.
- అలానే విత్తన సంచులపై లేబుల్ నిర్ధారణ పట్టిక, బ్యాచ్, లాట్ సంఖ్యలు, ధర, విత్తనం గడువు తేదీ, కంపెనీ హాలోగ్రాములు ఉన్నాయో లేదో గమనించాలి.
- విత్తన ప్యాకెట్‌పై పంట/రకం యొక్క సమాచారం, నాణ్యత ప్రమాణాలను సరిచూసుకోవాలి.
- విత్తన సంచి సీలు సరిగా ఉందో లేదో గమనించాలి.
- ఇంటి వద్దనే విత్తన మొలక శాతం పరీక్షించుకొని సంతృప్తికరంగా ఉంటేనే పొలంలో విత్తుకొవాలి.

విత్తన మొలకెత్తుట అంటే విత్తనాలకు అనుకూలమైన పరిస్థితులు కల్పించినప్పుడు అవి నీటిని గ్రహించి మొలక బయటకు రావలసిన జీవక్రియలను పూర్తి చేసుకొని పిండం ఎదుగుతూ బీజకవచం నుండి బయటకు రావటం, విత్తనం మొలకెత్తడానికి నీరు, ఆక్సిజన్ మరియు యుక్తతమ ఉష్ణోగ్రత ఎంతో అవసరం. రైతులు విత్తన మొలక పరీక్షను పేపర్‌పై లేదా ఇసుకలో లేదా మట్టిలో చేసుకోవచ్చు. మొలక పరీక్ష పేపర్‌పై చేసినప్పుడు మొలక కోసం ఉపయోగించే పేపర్‌ను ముందుగా

నీటిలో తడిపి, బల్లపై పరచాలి. తర్వాత ముందుగా లెక్కించి పెట్టుకున్న 100 విత్తనాలను సమాన దూరంలో పేర్చుకోవాలి. తర్వాత దానిపై తడిపిన రెండో పేపర్‌ను కప్పాలి. ఈ రెండింటిని చాప లాగా చుట్టి రబ్బర్‌బ్యాండ్‌తో కట్టి ఏటవాలుగా ఒక డబ్బాలో నిలబెట్టి ఏడు రోజుల పాటు అలాగే ఉంచాలి. మధ్య మధ్యలో పేపర్ ఎండిపోకుండా నీళ్ళు చిలకరించాలి. వారం తర్వాత పేపర్‌ను తెరచి మొలకెత్తిన సాధారణ విత్తనాలను లెక్కించాలి. ఇసుకలో మొలక పరీక్ష చేయదలచినపుడు ఎత్తు అంచులు గల ప్లాస్టిక్ ట్రేను తీసుకుని ఇసుకలో నింపి, తగు మోతాదులో నీరు పోసి లెక్కించిన విత్తనాలను ఒక అంగుళం లోపలికి నాటాలి. అవసరాన్ని బట్టి నీటితో తడపాలి. 7-10 రోజులలో మొలకశాతం లెక్కించాలి. మట్టిని కనుక మొలక పరీక్షకు వాడినట్లయితే ముందుగా మట్టిని మెత్తగా గుల్లబారేటట్లుగా చేసి వాటిలో 100 విత్తనాలు లెక్కించి మట్టిలో నాటాలి. అవసరాన్ని బట్టి నీటితో తడపాలి. కాని మట్టి గట్టి పడకుండా జాగ్రత్త వహించాలి. ఇలా గమనించిన మొలక శాతం కనిష్ఠ విత్తన ప్రమాణాలకన్నా తక్కువగా ఉంటే ఆ విత్తనాన్ని విత్తుటకు ఉపయోగించరాదు. అనివార్య పరిస్థితుల్లో ఉపయోగించదలచినప్పుడు విత్తన మోతాదును పెంచి ఉపయోగించుకోవచ్చు. వీటితో పాటు మొలక పరీక్షకు వాడే పేపర్, మట్టి, ఇసుకలో ఎటువంటి హానికారిక రసాయనాలు లేదా క్రిమికీటకాలు, బాక్టీరియా, శిలీంద్రాలు, వైరస్ వ్యాధి కారకాలు లేకుండా చూసుకోవాలి మరియు అవి నీటిని బాగా పీల్చుకుని, ఎక్కువ కాలం నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం కలిగి ఉండాలి. మొలక పరీక్షకు వాడే పేపర్ పటిష్ఠంగా ఉండి త్వరగా చినిగిపోకుండా ఉండాలి. కావున రైతులు విత్తన కొనుగోలులో చెప్పిన సూచనలు దృష్టిలో పెట్టుకొని, లేబుల్‌పై ఉన్న విత్తన నాణ్యత సమాచారం, గడువు తేది మరియు ఇతర సమాచారాన్ని జాగ్రత్తగా పరిశీలించిన పిదప విత్తుటకు ముందు మొలక పరీక్ష నిర్వహించి, విత్తన మొలకశాతం కనిష్ఠ ప్రమాణాల కన్నా ఎక్కువగా ఉంటేనే విత్తుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9491870544**









# చెఱకులో ఫర్టిగేషన్ విధానంలో ఎరువుల వాడకం

జి. రాకేష్, డా॥ జి. ఈశ్వర్ రెడ్డి, యన్. స్వప్న, ఎ. దినేష్, పి. జలంధర్ నాయక్, యం. సాయి చరణ్ మరియు డా॥ యం. శ్రీధర్
ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్, నిజామాబాద్



తెలంగాణ రాష్ట్రంలో కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల మరియు జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఎక్కువగా చెఱకు సాగుచేయబడుతుంది. ఎక్కువ మంది రైతులు చెఱకును బిందు సేద్యం ఉపయోగించి సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో నీటితో పాటుగా మొక్కకు కావలసిన ఎరువులను కూడా డ్రిప్ ద్వారా అందించవచ్చును. దీనినే ఫర్టిగేషన్ అంటారు. బిందు సేద్య పద్ధతిలో ఎరువుల వాడకం (ఫర్టిగేషన్) వలన రసాయన ఎరువుల మోతాదు 15 నుండి 40 శాతం వరకు, కూలీల అవసరం 10 నుండి 15 శాతం వరకు మరియు యాంత్రిక శక్తి ఖర్చులు 20 నుండి 25 శాతం వరకు తగ్గించుకోవడమే గాక పంట దిగుబడులు 30 నుండి 70 శాతం వరకు, చక్కెర దిగుబడి 10-11 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ పద్ధతిలో పంట యొక్క పోషకాల అవసరాలను మరియు వాతావరణ పద్ధతులను పరిగణలోనికి తీసుకొని ఖచ్చితత్వంతో పోషకాలను అందించడం వలన ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. డ్రిప్ ఫర్టిగేషన్ ద్వారా ఎకరాకు 60-70 టన్నుల దిగుబడి పొందవచ్చు. ఫర్టిగేషన్ వలన పోషకాలు నేరుగా వేరు వ్యవస్థకు అందడం వలన పోషకాల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. ఎరువులు పంట మొత్తానికి ఏకరీతిలో అందుతుంది. అంతేగాకుండా ఫర్టిగేషన్ ద్వారా ద్రవరూప జీవన ఎరువులను కూడా అందించవచ్చు.

**ఫర్టిగేషన్‌కు పనికి వచ్చే ఎరువుల వివరాలు:** ఫర్టిగేషన్ పద్ధతిలో ఉపయోగించే ఎరువులు నీటిలో పూర్తిగా కరిగే స్వభావాన్ని కలిగి ఉండాలి. పంట యొక్క పోషకాల అవసరాల దృష్ట్యా సరైన ఎరువులను ఎంపిక చేసుకోవాలి. సాధారణంగా దొరికే యూరియా తెల్లరకం, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు నీటిలో కరిగే కాంప్లెక్స్ ఎరువుతో కలపడం వలన పంట యొక్క నత్రజని, భాస్వరం మరియు పొటాష్ అవసరాలను తీర్చుకోవచ్చు. ఫర్టిగేషన్ ప్రక్రియ ప్రారంభించే ముందు తర్వాత వ్యవస్థను కొద్దిసేపు నడిపించాలి.

**నీటిలో కరిగే రసాయన ఎరువులు**

| పోషకం | ఎరువు పేరు | ఎన్.పి.కె. శాతం |
|---|---|---|
| నత్రజని | యూరియా | 46-0-0 |
| | అమ్మోనియం నైట్రేట్ | 23-0-0 |
| | అమ్మోనియం సల్ఫేట్ | 21-0-0 |
| భాస్వరం | మోనో అమ్మోనియం | 12-61-0 |
| | ఫాస్ఫేట్‌ఫాస్ఫోరిక్ ఆసిడ్ | 0-61-0 |
| | డై అమ్మోనియం ఫాస్ఫేట్ | 18-46-0 |
| పొటాషియం | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ | 0-0-60 |
| | పొటాషియం నైట్రేట్ | 13-0-46 |
| | సల్ఫేట్ ఆఫ్ పొటాష్ | 0-0-50 |

చెఱకు పంటకు ప్రతి రోజు లెక్కించిన మోతాదులో ఫర్టిగేషన్ ద్వారా ఎరువులను అందించడం అత్యంత శ్రేయస్కరం. వీలు కాకపోతే వారానికొకసారి లేదా 15 రోజులకొకసారైన ఫర్టిగేషన్ పెట్టుకోవాలి.

**ప్రతి రోజు ఫర్టిగేషన్ అందించే విధానం:** చెఱకు పంటకు సిఫారసు చేయబడిన మొత్తం పోషకాలను పూర్తి పంట కాలంలో అందించే విధంగా రోజు వారి మోతాదును లెక్కగట్టాలి. ఎరువులను అందించేటప్పుడు పంట దశలను దృష్టిలో ఉంచుకొని, పెరుగుదల దశలకు అనుగుణంగా మోతాదును పెంచుకోవాలి. సాధారణ పరిస్థితుల్లో ఎకరా మొక్క తోటకు 100 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాషియంను సిఫారసు చేయబడింది. రసాయనిక ఎరువుల రూపంలో చూసుకున్నట్లయితే ఎకరాకు సిఫారసు చేయబడిన 220 కిలోల యూరియా, 250 కిలోల సూపర్ ఫాస్ఫేట్ మరియు 80 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను పంటకు పూర్తికాలం అందించే విధంగా మోతాదును లెక్కకట్టి క్రింద ఇవ్వబడినది. మొత్తం

భాస్వరం సూపర్ ఫాస్ఫేట్ రూపంలో బోదెలలో వేసుకోవాలి. ఈ ఫర్టిగేషన్ ప్రణాళిక భూసార మధ్యస్థం గల నేలలకు అనుకూలంగా లెక్కించబడింది. భూసార పరీక్షలు చేయించుకొని దాని ఆధారంగా ఎరువుల పరిమాణాన్ని లెక్కగట్టాలి.

| పంట వయస్సు | రోజులు | యూరియా (రోజు వారి మోతాదు) | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (రోజు వారి మోతాదు) | యూరియా మొత్తం మోతాదు | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మొత్తం మోతాదు |
|---|---|---|---|---|---|
| నాటిన 20-60 రోజులు | 40 రోజులు | 1.0 కిలో | 0.25 కిలో | 40 కిలోలు | 10 కిలోలు |
| నాటిన 60-120 రోజులు | 60 రోజులు | 2.0 కిలోలు | 0.55 కిలో | 120 కిలోలు | 33 కిలోలు |
| నాటిన 120-160 రోజులు | 40 రోజులు | 1.0 కిలో | 0.5 కిలో | 40 కిలోలు | 20 కిలోలు |
| నాటిన 160-210 రోజులు | 50 రోజులు | 0.5 కిలో | 0.5 కిలో | 25 కిలోలు | 25 కిలోలు |
| మొత్తం | 190 రోజులు | - | - | 225 కిలోలు | 88 కిలోలు |

**వారానికొకసారి ఫర్టిగేషన్ అందించే విధానం:** చెఱకు పంటకు వారానికొకసారి ఫర్టిగేషన్ ఇవ్వాలనుకున్న రైతులు నాటిన 30 రోజుల నుండి 210 రోజుల వరకు మొత్తం 24 వారాలు అంటే 24 సార్లు క్రింద లెక్కించిన మోతాదులో సిఫారసు చేయబడిన ఎరువులను పెరుగుదల దశలను బట్టి అందించాలి.

| పంట వయస్సు | వారాలు | యూరియా (వారానికి మోతాదు) | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (వారానికి మోతాదు) | యూరియా మొత్తం మోతాదు | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మొత్తం మోతాదు |
|---|---|---|---|---|---|
| నాటిన 30-120 రోజులు | 12 వారాలు | 12 కిలోలు | 3 కిలోలు | 144 కిలోలు | 36 కిలోలు |
| నాటిన 120-210 రోజులు | 12 వారాలు | 6 కిలోలు | 3.5 కిలోలు | 72 కిలోలు | 42 కిలోలు |
| మొత్తం | - | - | - | 216 కిలోలు | 78 కిలోలు |

**పదిహేను రోజులకొకసారి ఫర్టిగేషన్ అందించే విధానం:** చెఱకు నాటిన 15 రోజుల నుండి 210 రోజుల వరకు ప్రతి పదిహేను రోజుల విరామం తర్వాత ఒకసారి అంటే మొత్తం 14 సార్లు ఫర్టిగేషన్ ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది.

| సంఖ్య | పంట వయస్సు | యూరియా (మోతాదు) | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (మోతాదు) |
|---|---|---|---|
| 1. | నాటిన 15 రోజులకు | 25 కిలోలు | 4 కిలోలు |
| 2. | నాటిన 30 రోజులకు | 25 కిలోలు | 4 కిలోలు |
| 3. | నాటిన 45 రోజులకు | 30 కిలోలు | 4 కిలోలు |
| 4. | నాటిన 60 రోజులకు | 30 కిలోలు | 4 కిలోలు |
| 5. | నాటిన 75 రోజులకు | 30 కిలోలు | 4 కిలోలు |
| 6. | నాటిన 90 రోజులకు | 30 కిలోలు | 4 కిలోలు |
| 7. | నాటిన 105 రోజులకు | 10 కిలోలు | 5 కిలోలు |

| సంఖ్య | పంట వయస్సు | యూరియా (మోతాదు) | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (మోతాదు) |
|---|---|---|---|
| 8. | నాటిన 120 రోజులకు | 10 కిలోలు | 5 కిలోలు |
| 9. | నాటిన 135 రోజులకు | 5 కిలోలు | 5 కిలోలు |
| 10. | నాటిన 150 రోజులకు | 5 కిలోలు | 5 కిలోల |
| 11. | నాటిన 165 రోజులకు | 5 కిలోలు | 5 కిలోలు |
| 12. | నాటిన 180 రోజులకు | 5 కిలోలు | 10 కిలోలు |
| 13. | నాటిన 195 రోజులకు | 5 కిలోలు | 10 కిలోలు |
| 14. | నాటిన 210 రోజులకు | 5 కిలోలు | 10 కిలోలు |
| | మొత్తం మోతాదు | 220 కిలోలు | 79 కిలోలు |

**గమనిక:** కార్శి తోటలకు ఎకరా మొక్క తోటల కన్నా 45 కిలోల నత్రజని అధికంగా వాడాలి అంటే 320 కిలోల యూరియాను తదనుగుణంగా లెక్కగట్టుకొని డ్రిప్ ద్వారా ఇవ్వాలి. సిఫారసు చేయబడిన నత్రజని మరియు పొటాషియం మాత్రమే కాకుండా భాస్వరంను కూడా ఫర్టిగేషన్ విధానంలో అందించాలనుకుంటే నీటిలో కరిగే కాంప్లెక్స్ ఎరువులను ఎంచుకోవాలి. కాంప్లెక్స్ ఎరువుల వాడకం వలన ఖర్చు పెరిగే అవకాశం ఉంది. కాని అన్ని పోషకాలను ఫర్టిగేషన్ ద్వారా అందించడం వలన దిగుబడులు పెరుగుతాయి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8501059411**

## మే మాసంలో ప్రసారమయ్యే వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల రేడియో కార్యక్రమం - చేనుకబుర్లు

పి.జె.టి.యస్.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.

| తేది | అంశం |
|---|---|
| **05-05-2021** | మొక్కజొన్నలో కత్తెర పురుగు, భాస్వరం లోపం, ఆకు ఎండు తెగులు నివారణ (వ్యవసాయం) |
| | కరోనా వ్యాక్సిన్ రోజుల్లో తీసుకోవలసిన ఆహారం (గృహ విజ్ఞానం) |
| **12-05-2021** | వ్యవసాయంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత (వ్యవసాయం) |
| | రోగనిరోధకశక్తిని పెంపొందించే ఆహారం ఏమిటి..? (గృహ విజ్ఞానం) |
| **19-05-2021** | పసుపు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు వాటి ఆరోగ్య ప్రయోజనాలు (వ్యవసాయం) |
| | మునగాకు మన ఆరోగ్యానికి ఎంత మేలు..? (గృహ విజ్ఞానం) |
| **26-05-2021** | భూసారం, సాగునీరు, పంట మొక్కల పరీక్షల విధానం (వ్యవసాయం) |
| | రక్తహీనతను అధిగమించడం ఎలా..? (గృహ విజ్ఞానం) |



# విత్తన నిల్వలో శిలీంధ్రాల యాజమాన్యం

బి. పుష్పావతి, యం. మాధవి మరియు టి. ప్రదీప్
విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్

రైతులు విత్తనాన్ని ఎంతో కష్టపడి, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని పండిస్తారు. అట్టి విత్తనాన్ని మరుసటి సంవత్సరానికి దాచుకునేటప్పుడు దాని యొక్క మొలకశాతం మరియు మొలక దారుఢ్యం పడిపోకుండా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది.

నిల్వ సమయంలో విత్తన నష్టాన్ని అంచనా వేసేందుకు జరిగిన పలు పరిశోధనల్లో విత్తనాలను పురుగులు మరియు శిలీంధ్రాలు ఆశించడం వలన కలిగే నష్టం సుమారుగా 15-25% వరకు ఉంటుందని తేలింది. ఇంత గరిష్టంగా రైతులు నిల్వ సమయంలో విత్తనాన్ని నష్టపోకుండా ఉండాలంటే కొన్ని మెళకువలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది.

సాధారణంగా నిల్వ ఉంచిన విత్తనానికి పురుగు పట్టడం జరుగుతుంది. కానీ కొన్నిసార్లు నిల్వ ఉంచిన విత్తనాన్ని శిలీంధ్రాలు కూడ ఆశిస్తుంటాయి. ఈ విధంగా నిల్వ సమయంలో విత్తనాలను శిలీంధ్రాలు ఆశించడం వలన గింజలు రంగుమారడం, బూజుపట్టడం, ముక్కిన వాసన రావడం, ఉండలు కట్టడం వంటివి జరుగుతాయి.

నిల్వలో ఉన్నటువంటి విత్తనాలను ఆశించే శిలీంధ్రాలు ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటాయి. అవి

1. పంట పొలంలో ఉన్నప్పుడే విత్తనాన్ని ఆశించే శిలీంధ్రాలు ఉదా॥ ఫ్యుజేరియం, ఆల్టర్నేరియా, కర్వులేరియా, హెల్మింథోస్పోరియం మొదలగునవి.
2. నిల్వ సమయంలో విత్తనాన్ని ఆశించే శిలీంధ్రాలు ఉదా॥ ఆస్పర్జిల్లస్ మరియు పెనిసీలియం

ఈ రెండు రకాల శిలీంధ్రాల వల్ల నిల్వ సమయంలో విత్తనం మొలకెత్తే సామర్థ్యాన్ని కోల్పోతూ ఉంటుంది. అంతేగాక విత్తనాన్ని సరైన పద్ధతిలో నిల్వ చేయనట్లయితే ఈ తెగులు కారక శిలీంధ్రాలు వృద్ధిచెంది తరువాత కాలంలో పొలంలో విత్తనాన్ని విత్తినప్పుడు వాటి నుండి వచ్చే మొలకల్లో కూడ తెగుళ్ళను కలుగజేస్తాయి. తద్వారా పొలంలో మొక్కల సాంద్రత తగ్గి దిగుబడులు తగ్గేందుకు ఆస్కారం ఉంటుంది.

**నిల్వ సమయంలో విత్తనాన్ని శిలీంధ్రాలు ఆశించడానికి గల ప్రధాన కారణాలు:**

1. విత్తనాలలో తేమశాతం ఉండవలసిన దానికన్నా ఎక్కువగా ఉండటం
2. విత్తనాన్ని అననుకూల పరిస్థితులలో అనగా గాలిలో అధిక తేమ, అధిక ఉష్ణోగ్రతలు ఉన్న ప్రదేశంలో నిల్వ ఉంచడం
3. విత్తనాలలో పగిలిన మరియు పొట్టు ఊడిన గింజలు కలిసి ఉండటం
4. విత్తనాలలో పంట యొక్క అవశేషాలు ఉండటం
5. తెగులు సోకిన పొలం నుండి విత్తనాన్ని సేకరించడం
6. నిల్వకు ముందే విత్తనాన్ని శిలీంధ్రాలు ఆశించి ఉండటం
7. విత్తనాలను ఎక్కువ కాలం వరకు నిల్వ చేసి ఉంచడం

**నిల్వ సమయంలో విత్తనాన్ని ఆశించే శిలీంధ్రాలను అరికట్టే యాజమాన్య చర్యలు:**

1. పొలంలో గింజ పూర్తిగా తయారై, తగు మాత్రంగా గట్టి పడిన తరువాత మాత్రమే పంట కోతను చేపట్టాలి.
2. పగిలిన లేక పొట్టు ఊడిన గింజలను శిలీంధ్రాలు త్వరగా ఆశిస్తాయి. కనుక పంటకోత మరియు నూర్పిడి సమయంలో గింజలు దెబ్బతినకుండా జాగ్రత్త వహించాలి.
3. విత్తనాలలో తేమ శాతం ఆయా పంటలకై నిర్ధారించబడిన దానికన్నా మించి ఉండరాదు. ఉదాహరణకు వరిలో 12% జొన్న, మొక్కజొన్న వంటి ధాన్యపు పంటల్లో 13%, అపరాలలో 8-10% మరియు నూనె గింజల పంటల్లో 7-8% వరకు ఉండవచ్చు.
4. విత్తనాలను గాలి చొరబడని సంచులు లేదా డబ్బాలలో నిల్వ ఉంచడం మంచిది.
5. వీలైనంతవరకు విత్తనాలను కొత్త సంచుల్లో నిల్వ చేసుకోవాలి.

6. నిల్వ సమయంలో వృద్ధి చెందే శిలీంధ్రాలను నివారించేందుకు తగు శిలీంధ్రనాశనిలతో విత్తనశుద్ధి చేసి నిల్వ చేసుకోవాలి.

7. విత్తనాలను నిల్వ చేసే గదిలో/గోదాములలో గాలిలో తేమ 45% కి మించి ఉండరాదు. అదే విధంగా ఉష్ణోగ్రతలు $10^{0}$ సెం.గ్రే. లేదా అంతకన్నా తక్కువగా ఉంటే మంచిది.

8. విత్తనాన్ని నిల్వ చేసే గదులు/గోదాములకు వెంటిలేటర్లు అమర్చుకోవాలి.

9. విత్తనాన్ని నిల్వ చేసే గదుల్లో పగుళ్ళు లేదా కన్నాలు లేకుండా పూడ్చి సున్నం వేసుకోవాలి.

10. గది గోడలు లేదా నేలపైన తేమ లేకుండా పూర్తిగా పొడిగా ఉండే విధంగా చూసుకోవాలి.

11. విత్తనపు సంచులను నేరుగా నేలపైన పెట్టకుండా, నేల నుండి కొద్ది ఎత్తులో గది గోడల నుండి దూరంగా చెక్క బల్లలు లేదా దిమ్మెలు లేదా ఇనుప కమ్మెల పైన పెట్టుకోవాలి.

ఈ విధమైన జాగ్రత్త చర్యలు చేపట్టడం వలన విత్తనం ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళను నివారించుకోవడమే కాక, విత్తనం యొక్క నాణ్యతా ప్రమాణాలను కాపాడుకుంటూ నిల్వ సామర్థ్యాన్ని కూడ పెంపొందించుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 6300956148**







## ☞ మీకు తెలుసా?

**మన మెదడు కొత్త విషయం నేర్చుకున్న ప్రతిసారి దాని ఆకృతి మారుస్తూ ఉంటుంది...**





# కమ్యూనిటీ ఆధారిత విత్తనోత్పత్తి - ముఖ్య ఉద్దేశ్యము మరియు సలహాలు

**అముల్ వారిస్, బి. నిర్మల మరియు కె. శృతి**
భారతీయ వరి పరిశోధనా సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రతి సీజన్ ప్రారంభంలో చిన్న కారు రైతులకు విత్తనాలను ఎన్నుకోవడం మరియు సాగు మూలవిత్తన లభ్యత అనేది ఒక పెద్ద సమస్య. ఇప్పుడున్న వాతావరణ మార్పులతో ఇది గతంలో కంటే చాలా పెద్ద సమస్యగా తయారైంది. విత్తనాలు పోసే సమయంలో విత్తనాల కొరత గురించి రైతులు ఆందోళన చెందుతున్నందున అనేక కమ్యూనిటీ ఆధారిత విత్తనోత్పత్తి పథకాలు ప్రారంభించబడ్డాయి. రైతులు శతాబ్దాలుగా ధాన్యాన్ని విత్తనంగా రీసైక్లింగ్ చేస్తున్నారు, కాబట్టి "విత్తన కొరత" అంటే ఏమిటో మొదటగా మనం అర్థం చేసుకోవాలి. విత్తన కొరతను అర్థం చేసుకోవడానికి ఇక్కడ రెండు ఉదాహరణలు ఇవ్వబడ్డాయి.

1. పర్యావరణ కారకాలు (ఉదా॥ కరువు) లేదా పౌర అవాంతరాలు కారణంగా విత్తనం అందుబాటులో ఉండకపోవచ్చు, ఇవి తీవ్రమైన కొరతను కలిగిస్తాయి. పంట ఉత్పత్తికి నష్టం కలిగించే సమస్యలను ముందుగా పరిష్కరించకపోతే కమ్యూనిటీ ఆధారిత విత్తనోత్పత్తిలో రైతులకు శిక్షణ ఇవ్వడం అనేది పెద్దగా ప్రభావాన్ని చూపదు. ధాన్యం ఉత్పత్తిని తగ్గించే పర్యావరణ లేదా పౌర అవాంతరాలు కూడా విత్తనోత్పత్తిని తగ్గిస్తాయి. రిస్క్ తగ్గించే వ్యూహాలలో విత్తనాలు తక్షణమే అందుబాటులో లేని పంటలు చేర్చవచ్చు. ఇలాంటి సందర్భాలలో కమ్యూనిటీ ఆధారిత విత్తనోత్పత్తి పథకాలు రైతులకు విత్తనాన్ని అందుబాటులోకి తేవడంలో దోహద పడతాయి.

2. అధికారిక రంగం నుండి విత్తనం అందుబాటులో ఉండకపోవచ్చు లేదా చాలా ఎక్కువ ధర అని భావించవచ్చు. ఈ సందర్భంలో రైతులు ధాన్యం కంటే విత్తనానికి ఉన్న అదనపు విలువను గ్రహిస్తారు మరియు విత్తనానికి అధిక ధర చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. విత్తనం విలువ అనేది, విత్తనం యొక్క జన్యు పరమైన లక్షణాలు మరియు మొలక శాతం మీద ఆధారపడి ఉంటుంది. కమ్యూనిటీ ఆధారిత విత్తనోత్పత్తిలో రైతులకు శిక్షణ ఇవ్వడం వలన రైతులకు విత్తనం అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, విత్తనోత్పత్తి ఖర్చులు ప్రస్తుత విత్తన రంగం ధర కంటే తక్కువగా ఉంచవచ్చు మరియు విత్తనాల నాణ్యత రైతుల అంచనాలకు తగట్టుగా ఉంటుంది.

**విత్తనోత్పత్తి ప్రత్యేకత :** స్థానిక విత్తనోత్పత్తి విజయవంతం అయినప్పుడు రైతులను సహకార సంస్థలు, చిన్న సంస్థలు లేదా సాగుదారుల సంఘాలుగా ఏర్పరచడం అనేది మంచి ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

**రైతు నుండి రైతు విత్తన మార్పిడి :** 90% పైగా చిన్న, సన్న కారు రైతులు ఈ పద్ధతి ద్వారా అవసరమగు విత్తనాలను పొందుతారు. అందువల్ల తక్కువ ఖర్చుతో కూడిన రైతు నుండి రైతు విత్తన మార్పిడి పద్ధతికి తగిన గుర్తింపు ఇవ్వడం చాలా ముఖ్యం మరియు వనరులు లేని పేద రైతులకు ఆధునిక రకాలైన విత్తనాలను సరసమైన ధరలకు అందించడానికి ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది.

**సీడ్ కిట్స్ :** పెద్ద సంఖ్యలో మెరుగైన నాణ్యమైన కొత్త రకాలను, విత్తన మరియు ఎరువులు వాడే మోతాదుల సమాచారాన్ని పొందుపరుస్తూ రైతులకు చిన్న విత్తన నమూనాలను అందించడం ద్వారా నాణ్యమైన కొత్త రకాలు స్థానిక విత్తనోత్పత్తి విధానంలోకి చొప్పించబడడమే కాకుండా కొత్త రకాలు రైతులకు విస్తరించి రైతు నుండి రైతు విత్తన మార్పిడి ద్వారా రైతులకు విత్తనం తక్కువ ధరకు అందుబాటులోకి వస్తుంది.

**కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు :** విత్తనాన్ని నిల్వ చేయడానికి విత్తన బ్యాంకులు సహాయపడతాయి. అదే సమయంలో మెరుగైన ఉత్పత్తి మరియు ఎంపిక పద్ధతులకు దోహదం చేస్తాయి. కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు పేద రైతుల విత్తన లభ్యతను మెరుగుపరుస్తాయి

మరియు రైతుల సంస్థల అభివృద్ధికి మరియు సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఒక ప్రవేశ కేంద్రంగా ఉంటాయి. విత్తన బ్యాంకులను స్థానిక జన్యుసంపద సేకరణ కేంద్రాలుగా నిర్వహించవచ్చు, ఇది రైతులకు జన్యు వైవిధ్య లభ్యతను మెరుగుపరుస్తుంది. రైతులను కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు స్థాపించేలా ప్రోత్సహించాలి.

**విత్తన ఉత్సవాలు (సీడ్ మేళా) మరియు విత్తన వైవిధ్య పోటీలు :** స్థానిక విత్తనాల ఉత్సవాలు స్థానిక విత్తనాల మార్పిడిని ఉత్తేజపరిచేందుకు మరియు పంట జన్యు వైవిధ్యం గురించి రైతులలో అవగాహన పెంచడానికి ముఖ్యమైన కార్యకలాపాలుగా మారాయి. రైతులు స్థానిక విత్తనాల ఉత్సవాలలో పోగొట్టుకున్న లేదా భర్తీ చేయాల్సిన రకాల విత్తనాలను కనుగొనవచ్చు. రైతులకు ప్రత్యక్షంగా మద్దతు ఇచ్చే కార్యకలాపాలు సాధారణంగా బలమైన స్థానిక దృష్టిని కలిగి ఉంటాయి మరియు పాల్గొనే పద్ధతులను ఉపయోగించుకుంటాయి. ఈ కార్యకలాపాలన్నీ మొక్కల జన్యు వనరుల నిర్వహణ యొక్క స్థానిక వ్యవస్థను బలోపేతం చేయడానికి దోహదం చేస్తాయి.

**సాధ్యమైన విత్తన వ్యవస్థ - మద్ధతు జోక్యం:**

విత్తన వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకోవలసిన చర్యలు

- పంపిణీ/మార్పిడి నెట్వర్కింగ్‌ను ప్రోత్సహించడానికి సామాజిక మూలధన నమ్మకాన్ని పెంచుతుంది.
- రైతు నుండి రైతుకి విత్తన మార్పిడి చేసుకోవడానికి రైతులను ప్రోత్సహించాలి.
- రైతులకు విత్తన లభ్యతను పెంచడానికి మరియు రకాల వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి మార్కెట్లు అభివృద్ధి చేయాలి.
- నైపుణ్యత పెంచే శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చాలా అవసరం.

1. విత్తన మరియు రకాల అంశాలపై శిక్షణా కార్యక్రమాలు
2 విత్తన మల్టిప్లికేషన్ పై విస్తృత శిక్షణ
3 విత్తన నాణ్యత ఎంచుకోవడంపై విస్తృత శిక్షణ

- విత్తన ధరల నిర్ణయించడంలో పాటించాల్సిన అంశాలు
- పనికి లాంటి స్కీమ్స్, సీడ్ ఒచర్లు పంపిణీ చేయడం
- స్థానిక జ్ఞానాన్ని ప్రోత్సహించడం
- సీడ్ బ్యాంకు, రివాల్వింగ్ సీడ్ ఫండ్స్ ఏర్పాటు చేయడం (కరువులో విత్తనం లభించే ఉపాయము)
- ఆహారం మరియు ధాన్యపు బ్యాంకింగ్ (అందువల్ల ప్రజలు విత్తనాలను ఆదా చేస్తారు)
- రైతు ప్రకటించిన విత్తనం వంటి వాటికి రైతు ఆధారిత విత్తన ఉత్పత్తి / పంపిణీ వ్యవస్థలను సంస్థాగతంగా బలోపేతం చేయడం,
- విత్తన సంస్థలు బలోపేతం చేయాలి.
- అసురక్షిత పరిస్థితులలో విత్తన వ్యవస్థలు "సాధారణంగా" పని చేయడానికి వీలుగా రాజకీయ భద్రతను పునరుద్ధరించడం.
- విత్తన ఉత్సవాలను నిర్వహించడం ద్వారా
  - విత్తన మార్పిడిని ఉత్తేజపరుస్తుంది.
  - పంట / రకాల వైవిధ్యాన్ని ప్రేరేపిస్తుంది.
  - స్థానికంగా లభించే విత్తనం / రకం / పంట ఎంపికల గురించి అవగాహన పెంచుతుంది.
- మార్కెటింగ్ వ్యూహాలలో పరీక్ష / మార్పులను ప్రోత్సహిస్తుంది (ఉదా।। చిన్న విత్తనాల ప్యాకెట్లు కొద్దిపాటి వనరులు ఉన్న రైతులకు లేదా 'పరీక్ష' పరిమాణాలను మాత్రమే కోరుకునేవారికి)
- ఉచిత విత్తనం మరియు సాధనాలను పంపిణీ చేయడం
- సీడ్-ఫర్-ఫుడ్ ప్రోగ్రామింగ్ మార్పిడులు
- కొత్త రకాలను పరీక్షించడానికి పొడిగింపు ప్రోగ్రామ్‌లను ప్రోత్సహించడం
- విత్తిన శ్రమ / విత్తనాల మోతాదును తగ్గించే పరికరాలను అభివృద్ధి చేయడం
- పంట నష్టాన్ని తగ్గించడానికి సీడ్ డ్రెస్సింగ్ టెక్నాలజీలను విస్తరించడం
- సమర్థవంతమైన / కొత్త విత్తనాల నిల్వ పద్ధతులను అభివృద్ధి

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7893386227





# వేసవి దుక్కులు చేయడం వలన ప్రయోజనాలు

డా॥ ఎస్. మాలతి, బి. క్రాంతి కుమార్, ఎన్. కిషోర్ కుమార్,
ఎ. రాములమ్మ, ఇ. రాంబాబు మరియు డి. ఉషశ్రీ
కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల

ప్రస్తుతం సాగు దశలో ఉన్న యాసంగి పంటల కోతానంతరం, వేసవిలో ముందస్తుగా కొన్ని చర్యలు చేపట్టినట్లయితే వానాకాలం సాగు చేసే పంటల్లో కొన్ని రకాల చీడపీడలు తక్కువగా ఉండి, సాగు పరిస్థితులు, భూ పరిస్థితులు మెరుగవుతాయి. వేసవిలో "లోతు దుక్కులు" చేయడం అనేది ఎన్నో లాభాలున్న యాజమాన్య పద్ధతి. ముఖ్యంగా రెండు రెక్కల నాగలితో గాని, చిజిల్ నాగలితో గాని, రెండు పళ్ళెపు నాగలితో గాని వేసవి దుక్కులు చేయాలి.

**కలుపు నివారణ:** పంటకాలంలో మొలిచి మలిదశకి వచ్చిన కలుపు మొక్కల విత్తనాలు భూమిలో పడిపోతాయి. వేసవిలో అడపాదడపా పడే వర్షాలకు అవి మొలుస్తాయి. వేసవి దుక్కులు చేయడం వలన మొలిచిన మొక్కలు కదిలించబడి, వడలిపోయి చనిపోతాయి. దీని వలన కలుపు సమస్య వానాకాలంలో తగ్గుతుంది.

**పురుగుల నియంత్రణ:** వివిధ పంటల నాశించే కొన్ని రకాల పురుగులు పంట అవశేషాలలో గాని, భూమిలో గాని కోశస్థ దశలో ఉంటాయి. అనుకూల పరిస్థితులలో ఈ దశ నుండి పెద్ద పురుగు దశకు వస్తాయి. వేసవిలో లోతు దుక్కు చేయడం వలన భూమిలో ఉన్న కోశస్థ దశ పురుగులు బయటపడి, ఎండ వేడిమికి చనిపోతాయి లేదా దున్నుతున్నప్పుడు బయటపడిన పురుగులను పక్షులకు ఆహారంగా మారుతాయి. తద్వారా వాటి సంఖ్య తగ్గి తరువాతి పంటలో ఉధృతి కొంతవరకు తగ్గుతుంది. ఉదా: లద్దె పురుగు, శనగపచ్చ పురుగు

**తెగుళ్ళ నివారణ:** వివిధ పంటల్లో తెగుళ్ళను కలుగజేసే శిలీంధ్ర బీజాలు, బ్యాక్టీరియా సిద్ధ బీజాలు భూమిలో ఉంటాయి. ఉదా: వడలు తెగులు, ఎండు తెగులు. వేసవిలో లోతుదుక్కి చేసినపుడు ఈ బీజాలు బయటపడి వేడి వాతావరణానికి నశిస్తాయి. తెగులును కలుగజేసే శక్తి నశిస్తుంది.

**గట్టి పొరలను చీల్చడం:** పంట సాగు ముందు అలాగే అంతరకృషి చేసే సమయంలో ఒకే లోతుకు చాలాసార్లు దున్నడం వలన, భారీ యంత్రాలు వాడినప్పుడు క్రమేపి క్రింది పొరలు గట్టిపడతాయి. భూమిలో లోపలి పొరలు గట్టిగా ఉండడం వలన వేరు వ్యవస్థ పొడవుగా ఉన్న పంటలు సాగు చేస్తే భూమి లోపలి పోషక పదార్థాలు, నీరు తీసుకోలేక ఎదుగుదల సరిగ్గా ఉండదు. ఇదే కాకుండా భూమిలోపల పొరలకి నీరు ఇంకదు. లోతు దుక్కి చేయడం వలన లోపలి పొరలు గుల్లబారుతాయి.

**నీరు నిలిపే శక్తి పెరుగుదల :** వాలుకు అడ్డంగా లోతు దుక్కి చేయడం వలన లోపలి పొరలు గుల్లబారుతాయి. తద్వారా వర్షాలు పడినపుడు దుక్కిలో నీరు ఆగి, మట్టి నీటిని పీల్చుకునేటట్లు అవుతుంది. దుక్కి అంతా గట్టిగా ఉంటే వాలును అనుసరించి నీరు ప్రవహించి వృధాగా వెళ్ళిపోతాయి. లోతు దుక్కి చేయడం వలన భూమి ఎక్కువ నీళ్ళను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటుంది. పంటకాలంలో బెట్ట పరిస్థితులు వచ్చినా మొక్కలు ఈ లోపలి పొరల్లోని తేమను సంగ్రహించి బెట్టను సమర్థవంతంగా తట్టుకుంటాయి.

**నేలను కోత నుండి కాపాడడం:** ఎండాకాలం మరియు తొలకరిలో అధిక వర్షం పడినపుడు వాలును అనుసరించి పారే నీరుతో పాటు మట్టి పొరలు కూడా నీటితో కొట్టుకుపోతాయి. వాలుకి అడ్డంగా దుక్కి చేయడం వల్ల ఎక్కడ వర్షపు నీరు అక్కడే ఇంకుతుంది. భూమి కోత నివారించబడుతుంది.

**తేమ సంరక్షణ:** లోతు దుక్కి చేయడం వలన పైన ఉన్న మట్టి పొరలు భూమిలో క్రింద ఉన్న తేమను సూర్యరశ్మి వేడికి తేమ ఆవిరి అవ్వకుండా నిరోధిస్తుంది.

**నేల క్షారత్వం తగ్గుదల:** లోతు దుక్కి చేసిన భూమిలో వర్షాలు పడినపుడు క్షారత్వ గుణాన్నిచ్చే లవణాలు పైపొరల నుండి కిందికి జారిపోతాయి. దీనితో మొక్కలపై క్షారత్వ ప్రభావం తగ్గుతుంది.

**సమయం ఆదా:** ఏప్రిల్, మే మాసాల్లో పడే వర్షాలకి లోతు దుక్కి చేసి పెట్టుకుంటే, తొలకరిలో వర్షాలు పడిన వెంటనే మిగతా వ్యవసాయ పనులు అదునులో పూర్తి చేసుకుని సరైన సమయానికి వానాకాలం పంటలు విత్తుకోవడానికి వీలుంటుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9848481818

# వ్యవసాయ విశ్వవిద్యాలయ ఐదవ స్నాతకోత్సవం









ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఐదవ స్నాతకోత్సవం 17.04.2021న విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా జరిగింది. కోవిడ్ నేపధ్యంలో వ్యక్తిగత ప్రమాణాలు పాటిస్తూ రెండవ ఏడాది ఆన్‌లైన్ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ స్నాతకోత్సవంలో విశ్వవిద్యాలయ గౌ॥ కులపతి, రాష్ట్ర గవర్నర్ మరియు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ డా॥ తమిళిసై సౌందరరాజన్ మరియు నీతి ఆయోగ్ సభ్యుడు గౌ॥ ప్రొఫెసర్ రమేష్ చంద్, ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు, రిజిస్ట్రార్ డా॥ యస్. సుధీర్ కుమార్, పాలక మండలి సభ్యులు, వర్సిటీ ఉన్నతాధికారులు మరియు బంగారు పతక విజేతలు పాల్గొన్నారు. మిగిలిన విద్యార్థిని, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది యూట్యూబ్‌లో లైవ్ ప్రోగ్రాంను వీక్షించారు.

గౌ॥ డా॥ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అనేక రంగాల్లో విప్లవాత్మక పథకాలను అమలుచేస్తూ దేశానికి మార్గదర్శిగా నిలుస్తోందని మరియు గౌ॥ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం పైనా, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం పైనా ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుభీమా, మిషన్ భగీరథ వంటి పథకాల వల్ల రాష్ట్రం అన్నపూర్ణగా మారిందని గవర్నర్ అభినందించారు. కోవిడ్ లోనూ రాష్ట్రం ఆహారధాన్యాలు, నూనెగింజలు, ప్రత్తిలో రికార్డుస్థాయిలో ఉత్పత్తులు సాధించిందన్నారు. విశ్వవిద్యాలయం బోధన, పరిశోధనల్లో నిరంతరం కొత్త విధానాలతో ముందుకు వెళ్తుందని మరియు ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకనుగుణంగా విద్యార్థుల్లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ని ప్రోత్సహించే విధంగా పాఠ్యాంశాలను అమలు చేయడం అభినందనీయం అని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని గిరిజనులకు భూమి ఉన్నప్పటికీ వ్యవసాయంలో వారు వెనకబడ్డారని, వారిపై ప్రత్యేక శ్రద్ద పెట్టి కొత్త వంగడాలు, ఆధునిక సాంకేతికతను వారికి అందుబాటులోకి తెచ్చి గిరిజనులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని విశ్వవిద్యాలయానికి సూచించారు.

ముఖ్య అతిధిగా పాల్గొన్న గౌ॥ ప్రొఫెసర్ రమేష్ చంద్ స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఏర్పాటైన అనతికాలంలోనే

ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్‌రావు నేతృత్వంలో వర్సిటీ మంచి పని తీరు కనబరుస్తోందని కితాబునిచ్చారు. వరస కరవులు ఎదుర్కొన్న తెలంగాణ వ్యవసాయరంగం ఇప్పుడిప్పుడే నిలదొక్కు కుంటున్నదని, కరువును తట్టుకునే వంగడాలను రూపొందించాలని, పంటల సరళి మారాలని, నీటి సమర్ధ యాజమాన్య పద్ధతుల్ని అనుసరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతూ నీటి సౌకర్యాలు కల్పిస్తోందని అయితే వరిసాగు పెరగడం సరికాదని, వరికి ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మరియు వైవిధ్య పంటల వైపు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పండ్లు, కూరగాయల సాగు విస్తీర్ణం ఇంకా పెరగాలి అని అభిప్రాయ పడ్డారు. రోజురోజుకి వ్యవసాయం ఆధునికత వైపు, వాణిజ్య సరళివైపు మరలుతుందని, కొత్తగా ఈ విద్యనభ్యసించిన వారు ఐటి, డిజిటల్ టెక్నాలజీల వంటి వాటిని ఉపయోగించుకొని అగ్రిబిజినెస్‌లో ప్రవేశించాలని మరియు వర్సిటీ కూడా ప్రైవేటు రంగ సహకారం, బోధన, పరిశోధన టెక్నాలజీల్లో కొత్త వ్యూహాలు అమలు పరచాలని సూచించారు.

ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ 2019-20 వార్షిక ప్రగతిని వివరించారు. విద్యార్థులకి ఎటువంటి అంతరాయం లేకుండా ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాదికాలంలో వర్సిటీకి చెందిన 25 మంది విద్యార్థులు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ను, 9 మంది విద్యార్థులు సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ను సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో వివిధ పంటలకి చెందిన 7 వెరైటీలను విడుదల చేశామని, మరో ఏడు వెరైటీలు జాతీయ స్థాయిలో ఆమోదం పొందాయన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని తాండూర్, పాలెం, జగిత్యాల్లో కోల్డ్‌ప్రెస్‌డ్ యూనిట్స్‌ని ఏర్పాటు చేసి నువ్వులు, కుసుమ మరియు గ్రౌండ్‌నట్ ఆయిల్‌ను, సేంద్రియ కందిపప్పుని తయారు చేస్తున్నట్లు డా॥ వి. ప్రవీణ్ రావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధనలపై వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 578 రీసర్చ్ పేపర్స్‌ని ప్రచురించినట్లు తెలిపారు.

ఐదవ స్నాతకోత్సవం ద్వారా 558 వ్యవసాయ, బిటెక్ అగ్రి ఇంజనీరింగ్, బిటెక్ ఫుడ్ టెక్నాలజీ, బిఎస్సీ కమ్యూనిటీ సైన్స్ విద్యార్థులు పట్టభద్రులయ్యారు. అదేవిధంగా 197 పిజి మరియు పిహెచ్‌డి విద్యార్థులు పట్టాలను అందుకున్నారు. వీరి ద్వారా సమాజానికి మేలు కలుగుతుందని ఆశించారు. ముఖ్య అతిధి ప్రొఫెసర్ రమేష్ చంద్‌కి డాక్టర్ ఆఫ్ సైన్స్‌ను ప్రధానం చేశారు. అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు 29 బంగారు పతకాలను డా॥ వి. ప్రవీణ్ రావు ప్రధానం చేసి అభినందించారు.









# వేసవిలో పచ్చిగడ్డి మేతకు బదులు - పాతరగడ్డి

డా॥ టి. సుకృత్‌కుమార్, డా॥ ఆర్.వి.టి. బాలాజీ నాయక్ మరియు డా॥ టి. శశికళ
అఖిల భారత సమన్వయ పశుగ్రాసాల పరిశోధనా విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్







పాతరగడ్డి అనునది పాడి రైతులకు చిరపరిచితమే. సాధారణంగా వర్ష మరియు శీతాకాలంలో పచ్చిమేత లభ్యత అధికంగా ఉంటుంది. కాని తరువాత తరువాత దీని లభ్య పరిమాణము తగ్గుతుంది. వేసవి కాలంలో దీని లభ్యత పూర్తిగా లేకుండా పోతుంది. పశువులు పచ్చిమేతను ఇష్టంగా తింటాయి. అధిక పాల మరియు మాంస ఉత్పత్తుల కొరకు పచ్చిమేత అత్యవసరం. కాబట్టి పచ్చిమేత లభ్యం కాని మార్చి నుండి జూన్ మాసం వరకు పాతరగడ్డిని ప్రత్యామ్నాయంగా వినియోగించవచ్చు.

అధికంగా పచ్చిగడ్డి లభ్యమయ్యే సమయంలో దీనిని చిన్న, చిన్న ముక్కలుగా కత్తిరించి, ప్రత్యేకమైన యాజమాన్య పద్ధతిలో గడ్డి పచ్చదనాన్ని కోల్పోకుండా, రుచికరమైన మరియు సువాసనతో కూడిన గడ్డిని పాతరగడ్డి అంటారు. దీనినే సైలేజ్ అనికూడ వ్యవహరిస్తారు. పాతరగడ్డి తయారీకి వాడే పంటలు కొన్ని లక్షణాలు కల్గియుండాలి. అవి ఏమనగా వాటిలో తేమశాతం 65-75% వరకు ఉండాలి. తక్కువ మొత్తంలో ముడి మాంసకృత్తులు కల్గియుండి, ఎక్కువ మొత్తంలో పులిసే చెక్కరలు కల్గిఉండాలి. పి.హెచ్.లో జరిగే మార్పులను తట్టుకొనే స్వభావం కల్గియుండవలెయును. దీనికి సాధారణంగా మొక్కజొన్న, ఓట్స్, జొన్న, బాజ్రా నేపియర్ సజ్జ, గినీ మరియు పారగడ్డి వంటి వాటిని వినియోగిస్తారు. అయితే గింజ పంటలైతే గింజ పాలు పోసుకొనే దశలో కోసి పాతరగడ్డి తయారు చేసుకోవాలి. గడ్డిజాతి పంటలైతే పూతదశలో కోసి పాతరగడ్డిని తయారుచేసుకోవచ్చు.

**పాతరగడ్డిని తయారుచేయు విధానం:** సాధారణంగా గాలి లేకుండా ఉండే వాతావరణ పరిస్థితుల్లో, చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించిన పంటను ప్రత్యేక విధానంలో నిల్వచేస్తారు. దీని వలన వాయురహిత శ్వాసక్రియ జరిగే బాక్టీరియాలు వృద్ధిచెంది, లాక్టో బాసిల్లస్ పరిమాణం పెరిగి, లాక్రికామ్లం దీనిలో చేరడం వలన, ఆమ్ల స్వభావం ఏర్పడి, మంచి వాసన మరియు రుచితో కూడిన పాతరగడ్డి తయారవుతుంది. దీని తయారికీ సుమారు రెండున్నర నెలల సమయం పడుతుంది. ఈ గడ్డిని పశువులు ఇష్టంగా తింటాయి. పాతరగడ్డి తయారుచేయునప్పుడు పంటలో నీటిశాతం/తేమశాతం గురించి ప్రత్యేకశ్రద్ద వహించాలి. తేమశాతం ఎక్కువగా ఉన్నట్లయితే ఆరనిచ్చి తరువాత పాతరగడ్డి

తయారుచేసుకోవాలి. పాతరగడ్డిని గుంతల్లో, కుండీల్లో లేదా పాలిథీన్ సంచుల్లో కాని తయారు చేస్తారు. గుంతల్లో తయారు చేయునప్పుడు గుంతకు అన్ని వైపులా సిమెంటుపూత పూయబడి ఉండవలెను. దీని ద్వారా గుంతలోని తేమ బయటకు పోవడం కాని, బయటి తేమ లోపలికి రావడం గాని జరుగదు. నీరు అనేది నిల్వ ఉండకూడదు. పాతరగడ్డి తయారీకి ఎంచుకున్న పంటను చిన్న చిన్న ముక్కలుగా ఒక అంగుళం పొడవు కన్నా తక్కువగా ఉండునట్లు కత్తిరించుకోవాలి. దీనికి చాఫ్ కట్టర్‌ను ఉపయోగించవచ్చు. ఈ ముక్కలను గుంత/కుండీల్లో గాలి చొరబడకుండా అధిక పీడనంతో పొడవుగా నింపాలి. ఇది అతిముఖ్యమైన ప్రక్రియ. గాలి చొరబడేటట్లైతే పాతరగడ్డి నాణ్యత తగ్గిపోయి, పశువులకు వినియోగపడదు. కావున ఈ గడ్డి పొరలపైన ట్రాక్టర్ లాంటి బరువైన వాహనంను తిప్పినట్లయితే గాలి బయటకు పోవును. నాణ్యమైన పాతరగడ్డి పొందుటకు ఒక టన్ను పాతరగడ్డికి 2–3 కిలోల బెల్లపు మడ్డి మరియు 1 కిలో రాతి ఉప్పును పొరల మధ్య చల్లాలి. దీనిని పూర్తిగా గాలి చొరబడకుండా మూసివేయాలి. మందమైన పొరలను గాని మట్టిని గాని పూతగా పూసివేయాలి. దీనిని పాలిథీన్ సంచుల్లో తయారు చేయునప్పుడు పాలిథీన్ సంచి మందము 40 మైక్రాన్‌ల కంటే ఎక్కువగా ఉండునట్లు చూసుకోవాలి. అందులో ఈ గడ్డిని ప్యాక్ చేసి ఉంచినా పాతరగడ్డి తయారగును. రెండు మాసముల వ్యవధిలో వివిధ రసాయనిక చర్యల మూలంగా నాణ్యమైన పాతరగడ్డి తయారవుతుంది. దీనిని మన అవసరాన్ని బట్టి వినియోగించు కోవచ్చు. ఒకసారి పాతరగడ్డి గుంతను తెరిచినట్లయితే పాతరగడ్డి మొత్తంను నెలరోజుల లోపల వాడుకోవాలి. పాతరగడ్డిని ఒకవైపు నుంచి మాత్రమే తీయాలి. గాలి చొరబడకుండా చూసుకోవాలి. అనగా నిలువు పొరలుగా పాతరగడ్డిని తీసుకోవాలి. పాలిథీన్ సంచుల్లో పాతరగడ్డి తయారుచేసినట్లయితే తీసిన రోజునే మొత్తం గడ్డిని వినియోగించుకోవాలి. వాణిజ్యపరంగా సైలేజ్ తయారీ సంచులు మార్కెట్‌లో లభ్యమవుచున్నాయి. పశువులకు సాధారణంగా 2:1 నిష్పత్తిలో పచ్చి మరియు ఎండు గ్రాసాలను వినియోగిస్తారు. పశువు అవసరాన్ని బట్టి సైలేజ్ పరిమాణం ఆధారపడి ఉంటుంది. అనగా 10 కిలోల ఎండుగడ్డికి 20 కిలోల సైలేజ్‌ను కలిపి వినియోగించుకోవాలి. 1 కిలో పాతరగడ్డి తయారీకి 1.25 కిలోల పచ్చి పంట అవసరమవుతుంది. అనగా ఒక టన్ను సైలేజ్ తయారు చేయవలెనంటే 1.25 టన్నుల పంటను ముక్కలుగా కత్తిరించి నిల్వ చేసుకోవాలి. తయారైన సైలేజ్‌ని తెరవకుండా 4–5 నెలల వరకు ఉంచుకోవచ్చు. కాని తెరిచిన తర్వాత త్వరగా వినియోగించుకోవాలి. ఒక ఘనపు అడుగు విస్తీర్ణంలో 20–25 కిలోల పాతరగడ్డి తయారవుతుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9491402702





# నేలల భౌతిక సమస్యలు - యాజమాన్యం

డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, యమ్. రాజశేఖర్, యల్. శ్రావిక, కె. రామకృష్ణ, డా॥ ఎ. శంకర్, బి. రాజశేఖర్
మరియు డా॥ అఫీఫా జహాన్
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్‌కర్నూల్

తెలంగాణలో ప్రధానంగా మూడు రకాల నేలలు ఉన్నాయి. వీటిలో 48% నేలలు ఎర్రనేలలు కాగా 25% నేలలు నల్లరేగడి నేలలు, 20% శాతం నేలలు ఒండ్రునేలలు మరియు మిగిలిన 7% నేలలు రాళ్ళు మరియు గుట్టలతో విస్తరించి ఉన్నాయి. ఈ నేలల్లోని భౌతిక సమస్యలు గుర్తించి వాటిని అధిగమించడానికి చేయవలసిన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే నేల యొక్క ఉత్పాదకత, సామర్థ్యం పెరుగుతుంది.

**ఎర్రనేలలు:** తెలంగాణలోని ఎర్రనేలల్లో గణనీయమైన విస్తీర్ణంలో వివిధ పంటల సాగు చేపట్టబడుతుంది. ఈ నేలల్లో భూభౌతిక సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఎర్రనేలల్లో ఇసుక పాలు ఎక్కువగా ఉండడం వలన తేలిక స్వభావం కలిగి తేమను మరియు పోషక పదార్థాలను నిలిపి ఉంచుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ఈ సమస్యను అధిగమించడానికి దగ్గరలో అందుబాటులో ఉంటే బరువైన నల్లరేగడి నేలల నుండి మట్టిని తెచ్చివేసి కలియ దున్నితే ఈ నేలల భౌతిక పరిస్థితిని మెరుగు పరచవచ్చు లేదా పశువుల ఎరువుగాని, కంపోస్ట్ ఎరువును గాని పెద్ద ఎత్తున వేయడం ద్వారా కూడా దాన్ని మెరుగుపరచవచ్చు. బాగా మెరకగా ఉన్న ప్రాంతాల్లో ఈ నేలలు సాధారణంగా గట్టిగా ఉంటాయి. వేర్ల పెరుగుదలకు అనువుగాని పరిస్థితి ఏర్పడుతుంది. నీరు కూడా నిలిచి ఉండదు. లోతు దుక్కి ద్వారా ఈ పరిస్థితిని మెరుగుపరచవచ్చు. ఎర్రగరప నేలలు కొన్నింటిలో భూమి బండబారి పోవడం చూస్తుంటాం. అలాంటి పరిస్థితి వలన విత్తనం మొలకెత్తడానికి, వేర్లు వృద్ధి చెందడానికి ఆటంకంగా ఉంటుంది. నేలలో సన్నని ఇసుక ఎక్కువగా ఉండి తటస్థించినప్పుడు నేల ఆ విధంగా బండబారుతుంది. ఈ పరిస్థితి మెరుగు పరచాలంటే నీరు అందుబాటులో ఉంటే పదేపదే తేలిక తడులు పెడుతుండాలి. హెక్టారుకు మూడు టన్నుల చొప్పున వరి ఊక గాని, వేరుశనగ తొక్కలు గాని వేసి నేలలో కలియదున్నడం వలన కూడా పరిస్థితి మెరుగవుతుంది. ఎర్రనేలల్లో సేంద్రియ పదార్థం, నత్రజని తక్కువగాను మరియు భాస్వరం, పొటాషియం మధ్యస్థంగాను ఉంటుంది. నత్రజని ఎరువులను తప్పనిసరిగా నిర్ణీత సమయంలో వేయాలి. భాస్వరం మరియు పొటాష్ ఎరువులను భూసార పరీక్షా ఫలితాల ప్రాతిపదికపై నిర్ణయించుకోవాలి.

**నల్లరేగడి నేలలు:** ఈ నేలల్లో బంకమట్టి పాలు ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా వర్షకాలంలో మురుగునీటి పారుదల సమస్యలెదురవుతుంటాయి. మొక్కల వేర్లకు గాలి తగినంతగా అందకపోవడం, నీరు అవసరానికి మించి ఉండడం కారణంగా వేర్లను నేల పైభాగానికే పరిమితం చేస్తాయి. పోషక పదార్థాలను స్వీకరించే శక్తి కూడా సన్నగిల్లుతుంది. తగిన మోతాదులో ఎరువులు వేసినప్పటికీ పైరు పెరుగుదల కుంటుపడుతుంది. పంట దిగుబడులు సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉంటాయి. నేలను సిద్ధం చేసే తరుణంలో ఇలాంటి నేలల్లో లోతైన డ్రైనేజి కాలువలను ఏర్పరచడానికి ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలి. మురుగు నీటి పారుదల సహజ సిద్ధంగా జరగని సందర్భంలో నిల్వ నీటిని తోడి వేయడం ప్రయోజనకరం కాగలదు. నీటి ముంపును తట్టుకొనే రకాలను నాటుకోవాలి.

బరువు నేలలు కొన్నింటిలో ప్రత్యేకించి వరి పైరు పండించే భూముల్లో నేల బండబారడం జరుగుతుంది. వేర్లు అభివృద్ధి చెందడానికి, నీరు ఇంకడానికి ఆటంకం ఏర్పడుతుంది. అలాంటి నేలలను మెరుగుపరచడానికి నేలలను తయారు చేసేటప్పుడు లోతుదుక్కి పెట్టాలి. ఈ నేలల్లో క్షారగుణం లక్షణాలు ఉండటం వలన పొటాషియం లభ్యత తగ్గుతుంది. పొటాషియం ఎరువును వేసి ఆ లోటును భర్తీ చేసుకోవలసి ఉంటుంది. ఈ నేలల్లో పచ్చిరొట్ట ఎరువులు వేసి కలియదున్నుతూ ఉంటే సేంద్రీయ పదార్థం మరియు లభ్య నత్రజని ఎక్కువగా అందుతుంది. నత్రజని ఎరువులను నిర్ణీత మోతాదులో వేసుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9848774820



# వర్మికంపోస్ట్ తయారీ


బి. సంతోష్ మరియు ఎస్. భావన

ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫామ్, గుంటూరు


వానపాములు వెన్నుముక లేని జీవులు. వర్మికంపోస్ట్ తయారీకి నాన్ బర్రోయింగ్ అనగా బొరియలు చేయని రకములు వాడతారు. వానపాము లేదా ఎర్రల సంతతిని వృద్ధి చేయడాన్ని "వర్మికల్చర్" అని అంటారు. వానపాముల ద్వారా విచ్చిన్నం అయిన సేంద్రియ పదార్ధం యొక్క తుది ఉత్పత్తిని "వర్మి కాస్టింగ్స్" అని, అలాగే వీటి ద్వారా తయారైన కంపోస్టును "వర్మికంపోస్టు" అని అంటారు.

ఉదా : ఐసీనియా ఫోటిడా

**తయారీ విధానం:** వానపాములు భూమి పైపొరలలో ఉంటాయి. కనుక వాటిని నేరుగా పడే వర్షము, సూర్యరశ్మి నుండి రక్షించడానికి పాక లేదా చవకగా లభించే తాటాకులు ఉపయోగించి షెడ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

3 అడుగుల వెడల్పు, 1.5 అడుగుల లోతు అవసరమైనంత పొడవుతో బెడ్స్ తయారు చేసుకోవాలి. బెడ్-బెడ్ కు మధ్య కనీసం 2 అడుగుల ఖాళీ ఉంచినట్లయితే నీరు చల్లేందుకు మరియు వానపాములకు గాలి సోకేందుకు వీలుగా ఉంటుంది. తరువాత 2-4 అడుగుల మందం వరకు బెడ్డింగ్ మెటీరియల్‌గా కుళ్ళిన కొబ్బరి పీచు, కొబ్బరి ఆకులు, వరి గడ్డి, కలుపు మొక్కలను కూడా వేయవచ్చు. దీని పైన 2-4 అంగుళాల మందం కుళ్ళిన పశువుల ఎరువును వేయాలి. ఇలా సుమారు 12 అంగుళాల మందం వరకు పొరలు పొరలుగా వేసుకొని నీరు చల్లుకోవాలి.

48 గంటల తరువాత 1 చదరపు మీటరుకు 1000 వానపాముల చొప్పున బెడ్స్ పైన వదిలి వాటి పైన 6 అంగుళాల వరకు వ్యర్ధ పదార్ధాలను వేసి చివరగా బెడ్స్‌పై గోనె సంచులతో కప్పి ఉంచాలి. ఇలా ఉంచిన బెడ్స్ పైన ప్రతి రోజు ఉదయం అలాగే మధ్యాహ్నం నీరు చిలకరిస్తూ ఉన్నట్లయితే సుమారుగా 6-8 వారాల్లో నాణ్యమైన వర్మికంపోస్టు తయారవుతుంది.

**కంపోస్టు తయారైయినట్లు తెలుసుకోవడం ఎలా:** పూర్తిగా తయారైయిన కంపోస్టు నల్లగా ఉంటుంది. ఎక్కువ వానపాములు గోనె పట్టాలకు అంటుకొని ఉన్నట్లయితే ఎరువు తయారైనది అని తెలుసుకోవచ్చు.

**కంపోస్టు నుంచి ఎరువును వేరు చేయు ప్రక్రియ:** కంపోస్టు తయారైయిన తరువాత 2-3 రోజులు నీటిని చల్లడం ఆపి వేయాలి. అప్పుడు వానపాములు తేమని వెతుక్కుంటూ బెడ్స్ అడుగు భాగం చేరుకుంటాయి. తయారైన కంపోస్టును గోపురాలుగా చేసి 2-3 గంటలు ఉంచిన తరువాత 3 మి.మీ. జల్లెడతో జల్లించి సంచుల్లో నింపి చల్లని ప్రదేశంలో నిల్వ ఉంచుకోవచ్చు.

**వర్మికంపోస్టు ప్రయోజనాలు:** వర్మికంపోస్ట్ నీటిలో కరిగే పోషకాలను కలిగి ఉంటుంది మరియు ఇది అద్భుతమైన, పోషకాలు అధికంగా ఉండే సేంద్రియ ఎరువు మరియు మట్టి కండీషనర్. ఇది వ్యవసాయం మరియు చిన్న తరహా స్థిరమైన, సేంద్రీయ వ్యవసాయంలో ఉపయోగించబడుతుంది. మొక్కలకు కావాల్సిన పలు రకాల ఎంజైములు, హార్మోనులు, రోగ నిరోధక శక్తిని పెంచే ఆక్సినోమైటులను సమ పాళ్ళలో ఉంచుతుంది. మొక్కలను ఆరోగ్యంగా ఉంచి పురుగు మందుల ఆవశ్యకతను పరోక్షంగా తగ్గిస్తుంది. నేలను సారవంతం చేసే సూక్ష్మజీవుల పెరుగుదలకు దోహదపడుతుంది. నేలను గుల్ల బారేటట్లు చేస్తాయి. వీటిని "జీవ నాగలి" అని అంటారు. ఇవి నీటి పరిగ్రాహక శక్తిని పెంచుతాయి. అంతే కాకుండా నాణ్యత, రంగుకల పంట ఉత్పత్తిని పెంచి వ్యవసాయ మార్కెట్‌లో మంచి ధర పలికేలా చేస్తుంది. ఈ కారణాల వలన "వానపాములను రైతుమిత్రులు" అంటారు.


ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 7396524587



# మే మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా|| ఐ.వి. శ్రీనివాస రెడ్డి
**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**

**మామిడి:** కోతానంతరం కాయ కుళ్ళును నివారించడానికి కాయకోతకు 15 రోజుల ముందు కార్బండాజిమ్ 1 గ్రా. లేదా కాపర్ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. ఆలస్యంగా కోతకు వచ్చే బంగులోరా, నీలం, రుమానీ రకాల్లో పండు ఈగ బెడద నివారణకు 2 మి.లీ. మలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పక్వానికి వచ్చిన (3 వంతులు తయారైన) కాయలను కోసి రైపనింగ్ చాంబర్‌లో ఉంచి 100 పి.పి.యం. ఇథీలీన్ వాయువును ప్రవేశపెట్టి 24 గంటలు చాంబర్ తలుపులు తెరవకుండా ఉంచాలి. తరువాత బయటకు తీస్తే 4-5 రోజుల్లో మంచి రంగును సంతరించుకొని పక్వానికి వస్తాయి.

**జామ:** మంచి నాణ్యతతో చలి కాలంలో వచ్చే పంట (మృగ్ బహర్) కోసం ఈ మాసం మొత్తం నీటిని ఇవ్వడం ఆపాలి. పిండినల్లి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఈ మాసంలో మెగ్నీషియం లోపం వల్ల ఆకులు ఎరుపు రంగుకు మారతాయి. నివారణకు 2 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**అరటి:** సగం లేక ఆపైన తయారైన గెలలకు ఎండు ఆకు చుట్టి ఎండ నుండి రక్షించుకోవాలి. లీటరు నీటికి 5 గ్రా. పొటాషియం నైట్రేట్ మరియు సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లను మార్చి మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధితో 3-4 సార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిచే విధంగా పిచికారి చేసుకోవడం ద్వారా అధిక ఎండల నుండి అరటి చెట్లను, గెలలను కాపాడుకోవచ్చు. ఈ మాసంలో తేలిక నేలల్లో ప్రతి రెండు రోజులకొకసారి, బరువు నేలల్లో 4 రోజులకొకసారి నీటి తడులు ఇవ్వాలి.

**బత్తాయి, నిమ్మ:** వడగళ్ళ వానకు దెబ్బతిన్న మొదళ్ళు, కొమ్మల మీద బోర్డోపేస్టును రాస్తే శిలీంధ్రాల నుండి రక్షణ లభిస్తుంది. జూన్ మాసంలో పూతకి రావాలంటే మే మాసంలో నీటి తడులు ఆపివేయాలి. కొత్తగా బత్తాయి, నిమ్మ తోటలను పెట్టదలుచుకొన్న రైతులు ముందుగా ఈ మాసంలో 1 మీ. పొడవు, వెడల్పు, లోతు గల గుంతలను 6×6 మీ. దూరంలో తీసుకొని బాగా ఎండనివ్వాలి.

**ద్రాక్ష:** వేసవి కత్తిరింపుల తర్వాత 9వ ఆకు ఏర్పడిన దశలో కొమ్మల కొనలను గిల్లడం ద్వారా పిల్ల కొమ్మల అభివృద్ధి జరుగుతుంది. కత్తిరించిన 30-60 రోజుల్లో 50 పి.పి.యం. యురాసిల్ పిచికారి చేయడం వల్ల పూమొగ్గలు ఏర్పడతాయి. కొత్త చిగురుల్లో పక్షి కన్ను తెగులు సోకకుండా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**బొప్పాయి:** ఈ మాసంలో పెద్ద మొక్కలకు ప్రతిరోజూ 20 లీ. నీటిని అందేటట్లు చూడాలి. వైరస్ తెగుళ్ళ







ఆశించిన మొక్కలపై సూక్ష్మపోషక మిశ్రమం 5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసినచో ఆకులు విప్పారి దిగుబడులు పెరుగును.

**జీడిమామిడి:** తామర పురుగులు ఎదుగుతున్న కాయలను, పండ్లను గీకి రసం పీల్చడం వల్ల గరుకు మచ్చలు ఏర్పడి దిగుబడి, నాణ్యత తగ్గుతుంది. ఇంకా ఈ మాసంలోనే కాయ, గింజ తినే పురుగులు కాయ, గింజ మధ్య గల ప్రదేశం ద్వారా లోపలికి ప్రవేశించి పండులోని గుజ్జును, గింజలోని పప్పును తింటాయి. వీటి నివారణకు లీటరు నీటికి లామ్డా సైహాలోత్రిన్ 0.6 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. మార్చి మార్చి వేపనూనె 5 మి.లీ.లతో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**కూరగాయలు:**

**బెండ:** పంట చివరి దశలో చిన్న, సన్నటి ఎర్ర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి ఎక్కువ సంఖ్యలో రసం పీల్చి వేయడం వల్ల ఆకులు తెల్లగా పాలిపోయి పండు బారతాయి. దీని నివారణకు లీటరు నీటికి 5 మి.లీ. డైకోఫాల్ లేదా 1 మి.లీ. ప్రొపర్గైట్ కలిపి పిచికారి చేయాలి.

**టమాట:** ఈ మాసంలో పూత దశలో ఉన్నట్లయితే ఎకరాకు 400 మి.గ్రా. 2,4-డి మందును 200 లీటర్ల నీటికి కలిపి లేదా 1 మి.లీ. ప్లానోఫిక్స్ 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేస్తే పూత, పిందె నిలిచి మంచి దిగుబడి వస్తుంది. కాయ తొలుచు పురుగు నివారణకు సైపర్‌మిత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి కాయలు కోసిన తరువాత పిచికారి చేయాలి. పందిరి కూరగాయల్లో పండు ఈగను నివారించుటకు పూత, పిందె దశల్లో మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. 100 మి.లీ. మలాథియాన్ + 100 గ్రా. చక్కెర / బెల్లంను లీటరు నీటిలో కలిపి మట్టి ప్రమీదల్లో పోసి పొలంలో అక్కడక్కడా ఎరగా పెట్టాలి.

**బీర:** బీరలో పాముపొడ తెగులు ఆశించడం వల్ల తెల్ల చారలు ఆకుల మీద కన్పిస్తాయి. నివారణకు 3 మి.లీ. వేపనూనె లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పుచ్చ:** కాయలు పక్వానికి వచ్చినప్పుడు ఎక్కువ నీరు ఇవ్వకూడదు. ఎక్కువ నీరు కడితే కాయలు పగిలి నాణ్యత తగ్గుతుంది. కోతకు 15 రోజుల ముందు 2 గ్రా. బోరాక్సు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవడం ద్వారా కాయ పగుళ్ళను అరికట్టవచ్చు.

**కాప్సికమ్:** పాలీహౌస్‌ల్లో పెరిగే కాప్సికమ్‌పై ఈ మాసంలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటివల్ల ఆకుల అంచులు పైకి ముడుచుకొంటాయి. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. + 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. పాలీహౌస్‌ల్లో ఉష్ణోగ్రతలను తగ్గించుటకు మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు ప్రతి గంటకొకసారి ఫాగర్లను ఆడించాలి.

**కరివేపాకు:** పొలుసు పురుగులు కాండంపై చేరి రసాన్ని పీల్చివేస్తాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి

**అల్లం:** అల్లం విత్తుటకు అనువైన సమయం ఈ మాసం. ఎత్తుమడులు, జంట కాల్వల పద్ధతిలో అల్లం విత్తితే అధిక దిగుబడులు వస్తాయి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441168156**









# రక్షిత గృహాల్లో ఉద్యానవన పంటల సాగు – మెళకువలు

యల్. సుహాసిని, యం. హారిక, డా॥ ఎ. వెంకట్రాం, డా॥ సి.హెచ్. అనూష, డా॥ ఎ. వెంకట్ రెడ్డి మరియు డా॥ టి. రమేష్
వ్యవసాయ కళాశాల, వరంగల్

వాతావరణాన్ని కొద్దిగా లేదా పూర్తిగా గాని నియంత్రించి మొక్కలకు అనుకూల పరిస్థితులను ఏర్పాటు చేయడానికి నిర్మించిన గృహాలను 'హరితగృహాలు' అని అంటారు. సంవత్సరం పొడవునా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడినప్పటికీ వాతావరణాన్ని నియంత్రించి సులువుగా పంటలను హరితగృహాల క్రింద సాగు చేయవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో 1150 హెక్టార్లలో ఉద్యాన పంటలు హరితగృహాల్లో సాగు చేయబడుతున్నాయి.

టమాట, రంగుల క్యాప్సికం, గెర్కిన్స్, చెర్రీ టమాట, కార్నేషన్, జెర్బెరా, చామంతి, గులాబీ, ఆర్కిడ్స్, స్ట్రాబెర్రీ, లెట్యూస్ మరియు ఆకుకూరలను రక్షిత గృహాలైనటువంటి హరితగృహాలు, షేడ్‌నెట్స్‌ల్లో పెంచుతున్నారు. ఇతర రక్షిత గృహాలైనటువంటి లో టన్నెల్స్, వాక్ ఇన్ టన్నెల్స్ మరియు రోకవర్స్‌లలో ఆకుకూరలు, క్యారెట్, క్యాబేజి, కీరదోస, పుచ్చకాయ, ఖర్బూజ, వేసవి ఆకుకూరలను పెంచవచ్చును.

**రక్షిత గృహాల అమరిక/నిర్మాణం:** ఒంటరిగా నిర్మించే హరిత గృహాలను తూర్పు-పడమర దిక్కుల్లో నిర్మించుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువగా నిర్మించేటప్పుడు గట్టర్ సహాయంతో ఒకదానికొకటి కలిపి ఉత్తర-దక్షిణ దిక్కుల్లో ఉండేటట్టు నిర్మించుకోవాలి.

**మట్టి ఎంపిక, బెడ్ల తయారీ:** హరితగృహాల్లో నాణ్యమైన అధిక దిగుబడులను పొందటానికి మట్టి ఎంపిక, మడుల తయారీ మరియు శుద్ధీకరణ చాలా కీలకం. మట్టి మిశ్రమాన్ని తయారు చేసుకునేటప్పుడు 7:2:1 నిష్పత్తిలో ఎర్రమట్టి, పశువుల ఎరువు, ఇసుక లేదా వరిపొట్టును కలుపుకోవాలి. వీటితో పాటుగా వేపచెక్క, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను పంటను బట్టి మట్టి మిశ్రమంలో కలుపుకొని బెడ్లను తయారు చేసుకోవాలి. ఎంపిక చేసిన మట్టి మిశ్రమంలో లేదా నేలలో అనేక రకాలైన శిలీంధ్రాలు, సంబంధిత హానికర సూక్ష్మజీవులు, కీటకాలు వాటి గ్రుడ్లు, లార్వాలు మొదలైనవి ఉంటాయి. కనుక వాటిని నిర్మూలించడం ఎంతో అవసరం. సాధారణంగా దీనికొరకు ఫ్యూమిగేషన్ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఈ పద్ధతిలో 5 లీటర్ల ఫార్మాల్డిహైడ్ మందును 200 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని తయారు చేసుకొని, ముందుగా మట్టి మిశ్రమాన్ని నీటితో తడిపి తరువాత మందు ద్రావణాన్ని మట్టిపై పిచికారి చేయాలి లేదా బెసామిడ్ గుళికలను 30 నుండి 40 గ్రాముల చొప్పున ఒక చదరపు మీటరుకు వేసుకొని ఆ తరువాత నల్లని పాలిఫిల్మ్ కాగితాన్ని బెడ్‌లపై కప్పి 4 నుండి 7 రోజులు పాలిహౌజ్‌లను మూసి ఉంచాలి. ఈ విధంగా చేసిన తరువాత ఒక చదరపు మీటరుకు 100 లీటర్ల నీటితో బెడ్లను తడిపి వారం నుంచి పదిహేను రోజుల తరువాత మొక్కలను నాటుకోవాలి. ఇలా శుద్ధీకరించిన మట్టిని 30-45 సెం.మీ. ఎత్తు, 80-100 సెం.మీ. వెడల్పు కలిగిన బెడ్లుగా తయారు చేసుకొని పాలిహౌజ్ సైజును బట్టి పొడవును నిర్ణయించుకోవాలి. రెండు బెడ్ల మధ్య 50 సెం.మీ. దారిని వదులుకోవాలి.

**నేల ఉదజని సూచిక:** పాలిహౌజ్‌లలో సాగు చేసే పంటల్లో నేల ఉదజని సూచిక (పిహెచ్) ఒక్కో పంటకు ఒక్కోలా ఉంటుంది.



| క్రమ సంఖ్య | ఉదజని సూచిక | పంట |
|---|---|---|
| 1. | 5.5-6.5 | కార్నేషన్ |
| 2. | 5.5-7.5 | జెర్బెరా |
| 3. | 6.0-6.5 | గులాబీ |
| 4. | 6.0-7.0 | టమాట, కీరదోస, రంగుల క్యాప్సికం |

నేలల్లో విద్యుత్తువాహకత 1 మిల్లి సిమెన్స్/సెం.మీ. కంటే ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. అలాగే పాలిహౌస్‌ల్లో తేమశాతం 60-65 ఉండేలా చూసుకోవాలి.

**డ్రిప్‌ని పరుచుట:** ముందుగా తయారు చేసుకున్న బెడ్లపై 16 మి.మీ. ఉన్న ఇన్‌లైన్ డ్రిప్ లేటరల్ పైపులను బెడ్లపై పరచుకోవాలి. డ్రిప్పర్ల మధ్య దూరంను బట్టి మొక్కల మధ్య దూరం మారుతుంది. సాధారణంగా డ్రిప్పర్ల మధ్య 40 సెం.మీ. దూరం ఉండేట్టు చూసుకోవాలి. ఈ బిందుసేద్య పద్ధతిలో నీటితో పాటుగా ఎరువులను మరియు సూక్ష్మ పోషకాలను అందించే పద్ధతినే "ఫర్టిగేషన్" అంటాము. ఈ పద్ధతి పాటించటం వలన నీటిని ఆదా చేయుటవే కాకుండా ఎరువులను కూడా సమర్ధవంతంగా ఉపయోగించుకొని నాణ్యమైన అధిక దిగుబడులను పొందవచ్చు.

**మల్చింగ్ షీటు ఎంపిక:** ఎంపిక చేసుకున్న పంట, పంటకాలాన్ని బట్టి బెడ్లపై మల్చింగ్ షీటును పరచుకోవాలి. అన్ని రకాల కూరగాయలు, స్ట్రాబెర్రీ, బీట్‌రూట్ లాంటి స్వల్పకాలిక పంటలకు 25 మైక్రాన్లు గల షీటును, పూలు మరియు ఇతర 10-12 నెలలు వ్యవధి కల్గిన పంటలకు 50 మైక్రాన్ల షీటును, 12 నెలల కన్నా ఎక్కువ వ్యవధి కల్గిన ధీర్ఘకాలపు పంటలకు 100 మైక్రాన్ల షీటును ఉపయోగించాలి. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవడానికి "తెలుపు రంగు" షీటును శీతాకాలంలో మొక్కల పెరుగుదలకు కావల్సిన ఉష్ణోగ్రతలను అందించుటకు "నలుపు రంగు షీటును వాడాలి.

**వివిధ పంటల్లో అవలంభించాల్సిన దూరం:**

| క్రమ సంఖ్య | పంట | దూరం |
|---|---|---|
| 1. | కార్నేషన్ | 15×15 సెం.మీ. |
| 2. | జెర్బెరా | 37.5-40×30 సెం.మీ. |
| 3. | గులాబీ | 40×20 సెం.మీ. |
| 4. | క్యాప్సికం | 45×30 సెం.మీ. (త్రికోణ పద్ధతి) |
| 5. | టమాట | 60×45 సెం.మీ. (త్రికోణ పద్ధతి) |
| 6. | కీరదోస | 60×60 సెం.మీ. (త్రికోణ పద్ధతి) |

పాలిహౌస్‌లో జంటసాళ్ళ పద్ధతిలో టమాటలో 50×40 సెం.మీ. దూరాన్ని మరియు క్యాప్సికంలో 60×60 సెం.మీ. లేదా 60×45 సెం.మీ. దూరాన్ని పాటించాలి.

**వివిధ పంటల్లో చేపట్టవలసిన ముఖ్యమైన యాజమాన్య పద్ధతులు:**

పాలిహౌస్‌లలో సాగుచేసే పంటల్లో వివిధ రకాల యాజమాన్య పద్ధతులను పాటిస్తే నాణ్యమైన దిగుబడులను పొందవచ్చు.

**క్యాప్సికం:** క్యాప్సికంలో 2 ప్రధాన కాండాలను ఎదగనిచ్చి మిగతావి తీసివేయాలి. ప్రతి ప్రధాన కాండం కొనభాగం నుండి 2 కొమ్మలను ఎదగనివ్వాలి. అందులో బలమైన కొమ్మను ఎదగనిచ్చి, బలహీనమైన కొమ్మను తీసివేయాలి. అనగా 2 ప్రధాన కాండాలకి 2 కొమ్మలు ఉంచాలి. ఇలా వారానికొకసారి కొమ్మలను కత్తిరించాలి. 4వ నెల నుండి కొమ్మల కత్తిరింపులను పది రోజులకొకసారి చేయాలి. సాధారణంగా క్యాప్సికంలో కొమ్మల కత్తిరింపులను ప్రధాన పొలంలో నాటుకున్న 15-20 రోజుల తర్వాత ప్రతి వారానికొకసారి చేయాలి. ఎదుగుతున్న ప్రక్క కొమ్మలను ప్లాస్టిక్ దారం లేదా ఏదైనా తాడు సహాయంతో ఊతం ఇవ్వాలి. దారంని మొక్క మొదలు వద్ద వదులుగా కట్టి దారం కొన భాగాన్ని హరితగృహం పైకప్పు క్రింది భాగంలో కట్టినటువంటి జి.ఐ. వైరుకు ఊతం ఇవ్వాలి.

**టమాట:** పొడవు రకం టమాటలో ప్రధాన కాండాన్ని ఎదగనిచ్చి ప్రక్క కొమ్మలను తీసివేయాలి. ప్రధాన కాండంపై కూడా కేవలం 2 నుండి 4 కణుపులను మాత్రమే ఎదగనిచ్చి మిగతా కొమ్మలను తీసివేయాలి. క్యాప్సికంలో చేసిన విధంగానే కొమ్మలకు ప్లాస్టిక్ దారం సహాయంతో ఊతం ఇవ్వాలి. ఇలా చేయుటం వలన కాయలు నేలకు తగలవు కనుక కాయకుళ్ళు ఆశించే అవకాశం చాలా వరకు తగ్గించవచ్చును.

**కీరదోస:** కీరదోసలో ప్రధాన కాండం నుండి 2 బలమైన కొమ్మలను మాత్రమే ఎదగనిచ్చి మిగతావి తీసివేయాలి. కీరదోసలో తీగను 25 సెం.మీ. వరకు ఎదగనిచ్చి తరువాత త్రుంచి వేయగా, కొమ్మలు వస్తాయి. ఈ బలమైన కొమ్మలను దారం సహాయంతో ఊతం ఇవ్వాలి. అలాగే మంచి నాణ్యమైన కాయల కోసం కొన్ని కాయలను కూడా త్రుంచి వేయాలి. కీరదోసలో ఎక్కువగా 'అంబరెల్ల' అనే పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ పద్ధతిలో ప్రధాన కాండంని ఎదగనిచ్చి కొనభాగంని త్రుంచి వేయగా 2 ప్రక్క కొమ్మలు ఏర్పడతాయి. వీటిని మాత్రమే ఊతం ఇచ్చి క్రిందికి వేలాడేలాగా ఎదగనివ్వాలి.

**కార్నేషన్:** కార్నేషన్ లాంటి పూల మొక్కలలో పూకాడకు వంగే లక్షణం ఎక్కువగా ఉంటుంది. ఇందుకోసం మొక్కలకి ఊతం కల్పించటం ఎంతో అవసరం. ఇందుకుగాను 4-5 వరుసల జి.ఐ. వైరును లేదా నైలాన్ జాలిని ఉపయోగించాలి. మొక్కలను నాటుకునే ముందే నేల నుంచి 12 సెం.మీ. ఎత్తులో మొదటి వరుస జి.ఐ. వైరును 7.5×7.5 చ.సెం.మీ. కోణాలు కలిగి ఉండేలా జాలీని తయారు చేసుకొని, ఆ తరువాత ఈ చతురస్రం మధ్యలో కార్నేషన్ కట్టింగ్స్‌ను నాటుకోవాలి. మొక్క ఎదుగుతున్న కొద్ది జాలీని 10×10 సెం.మీ. కోణాలు ఉండేలా చూసుకొని రెండవ వరుసను అమర్చుకోవాలి. ఇదే విధంగా 3-5 వరుసల జాలీలను 12.5×12.5 సెం.మీ. కోణాలు మరియు 15×15 సెం.మీ. కోణాలుండేలా జాలీని తయారు చేసుకొని అమర్చుకోవాలి. రెండవ జాలీ నుంచి 5వ వరుస జాలీల మధ్య 15 సెం.మీ. దూరం ఎత్తు ఉండేలా చూసుకోవాలి. కార్నేషన్ మొక్కలు నాటిన 4-5 వారాల తర్వాత 15 సెం.మీ. పెరిగినప్పుడు నిటారుగా పెరుగుతున్న కాండం 6 జతల ఆకులు వదిలి ఆపైన తుంచి వేయాలి. ఇలా చేయడం ద్వారా 5-6 ప్రక్క కొమ్మలు ఏర్పడతాయి. పూల సంఖ్య పెరుగుతుంది. కొమ్మకు ఇరువైపుల చిన్న చిన్న కొమ్మలు మరియు ముఖ్యమైన పూ మొగ్గకు ఆనుకొని ఉన్న చిన్న చిన్న మొగ్గలను ఎప్పటికప్పుడు త్రుంచి వేయాలి.

**గులాబీ:** గులాబీలో ఊతం కోసం బొంగు కర్రలు లేదా జి.ఐ. పైపులను ఉపయోగించి ప్రతి 10 మీటర్ల దూరంలో అమర్చుకోవాలి. ఇలా అమర్చిన పైపులకు 14 గేజీల జి.ఐ. వైర్లను 3 వరుసలుగా 20 సెం.మీ. దూరంలో అమర్చుకోవాలి. గులాబీలో కొమ్మలను జూన్, జూలై మాసాల్లో కత్తిరించుకోవాలి. కత్తిరింపుల తర్వాత వచ్చిన చిగుర్లపై పూ మొగ్గలు ఏర్పడతాయి. కట్‌ఫ్లవర్స్ కోసం గులాబీని సాగుచేస్తున్నప్పుడు ప్రధానమైన మొగ్గను ఉండనిచ్చి, ప్రక్క నుంచి వచ్చినటువంటి పూ మొగ్గలను తుంచివేస్తే ప్రధాన మొగ్గకు కావల్సిన పిండి పదార్థాలు అంది పూ మొగ్గ మంచి పరిమాణంతో వృద్ధి చెందుతుంది.

**చామంతి:** చామంతిలో ప్రధాన కాండాన్ని 3 లేదా 5 ఆకుల దశలో లేదా నాటిన 7 లేదా 8 రోజుల తర్వాత త్రుంచి వేయగా చాలా ప్రక్క కొమ్మలు ఏర్పడతాయి. వీటిలో 2 లేదా 3 బలమైన కొమ్మలను ఉంచి మిగతావి తీసేయాలి. పెద్ద పువ్వుల కోసం ప్రధాన కాండాన్ని మాత్రమే ఎదగనిచ్చి, ప్రక్క కొమ్మలను త్రుంచి వేయాలి. చిన్న పువ్వుల కోసం అయితే ప్రధాన కాండాన్ని త్రుంచి ప్రక్క కొమ్మలను ఎదగనివ్వాలి. దీని వలన పువ్వులలో సమానత ఉంటుంది. దీనికి గాను 10-14 రోజుల సమయం పడుతుంది.

**పాలీహౌస్‌లలో చీడపీడల యాజమాన్యం:** పాలీహౌస్‌లలో చీడపీడల యాజమాన్యం కీలకమైనది. ఎందుకంటే పాలీహౌస్ మొత్తం మూసివేయబడి ఉండటం వలన యాజమాన్యం క్లిష్టంగా మారుతుంది. అందుకనే ముందుగానే నిరోధక చర్యలు చేపట్టాలి. ఇందుకోసం నేలశుద్ధితో పాటుగా పసుపు రంగు జిగురు అట్టలను అమర్చాలి. దీని వలన రసం పీల్చే పురుగులను నివారించవచ్చును. రసం పీల్చే పురుగులైనటువంటి ఎర్రనల్లి నివారణకు డైకోఫాల్ 5 మి.లీ. లేదా అబామెక్టిన్ 0.4 మి.లీ. లేదా డైపెన్‌థయురాన్ 1.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

- తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పేనుబంక నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నులిపురుగుల నివారణకు మొక్కలు నాటడానికి ముందే నేల శుద్ధీకరణ తప్పనిసరిగా చేయాలి.
- బెడ్స్‌ను తయారుచేసుకోవటానికి ముందే 20 టన్నుల పశువుల ఎరువును కలపాలి.
- కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను ఒక చదరపు మీటరుకి 50 గ్రా. మరియు 200 గ్రా. వేపపిండి లేదా పోంగామియా కేకులను కలిపి బెడ్లపై చల్లాలి
- 2 కిలోల సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మరియు ట్రైకోడెర్మా హార్జియానమ్‌లను 1 టన్ను పశువుల ఎరువుతో కలిపి బెడ్లపై మల్చ్‌లాగా కప్పాలి. 15 రోజుల వరకు 25-30 శాతం తేమ ఉండేట్లు చూసుకోవాలి.
- నులిపురుగుల నివారణకు ఆరోగ్యవంతమైన నర్సరీల నుండి మాత్రమే నారుని ఎంచుకోవాలి. బాగా చివికిన పశువుల ఎరువులను మాత్రమే వాడాలి.
- వేసవి కాలంలో బెడ్లపై మల్చింగ్ షీటుని పరిచి $45^0$ ఉష్ణోగ్రత మట్టిపై ఉండేట్లు చేయగల్గితే నులిపురుగులను నివారించవచ్చును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 9160760095**






# గులాబీలో శారీరక రుగ్మతలు - నివారణ

టి. నవ్యశ్వేత
ఉద్యాన కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్



ఆధునిక పూలు ఎన్ని వచ్చినా సంప్రదాయ పూల ఆదరణ వన్నె తరగనిది. ముఖ్యంగా గులాబీ, బంతి, కనకాంబరం, మల్లె వంటి పూలసాగులో విస్తీర్ణం నానాటికి పెరుగుతుంది. వ్యవసాయంలో రోజురోజుకి పెరుగుతున్న ఒడిదుడుకులను అధిగమించేందుకు రైతులు తమకున్న కమతంలోనే కొంత పూల సాగును చేపడుతున్నారు. ముల్లున్న, ముద్దొచ్చే గులాబీని పూలలో రారాణిగా చెపుతారు. రైతుకు సంవత్సరంలో 10 నెలలు కాసులు పండిస్తున్న పూలకు మార్కెట్ గిరాకీ ఎప్పటికీ పదిలం. ఇటీవల కాలంలో వాణిజ్యపరంగా హరితగృహాలలో పూయిస్తూ విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు.

- అభ్యుదయ రైతులు గులాబీలో సాధారణంగా వచ్చే శారీరక రుగ్మతల వల్ల కొంతవరకు నష్టపోతున్నారు. కావున గులాబీలో శారీరక రుగ్మతలు, నివారణ గురించి తెలుసుకుందాం.

**1. గుడ్డి రెమ్మలు :** పుష్పించని కాండాలను గుడ్డి రెమ్మలు అంటారు. దీనికి కారణం తక్కువ కిరణజన్య సంయోగ క్రియ రేటు మరియు రోజు వారి ఉష్ణోగ్రత ప్రభావం అంటే $15^{0}$ డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే తక్కువగా ఉండటం వలన గుడ్డి రెమ్మలు వస్తాయి.

**నివారణ:**

- గుడ్డి రెమ్మలను నవంబర్‌లో 1 లేదా 2 నోడ్‌లను తిరిగి తుంచడం ద్వారా పుష్పించే కాండం ఉత్పత్తి అవుతుంది.
- సోడియం దీపంను మొక్కల దగ్గర అమర్చాలి.
- నవంబర్ నుండి ఫిబ్రవరి వరకు కార్బన్‌డైఆక్సైడ్ 1000 పి.పి.యం. (1 గ్రా. లీటరు నీళ్ళలో కరిగించడం)ను సుసంపన్నం చేయడం వల్ల గుడ్డి రెమ్మలను తగ్గించడంలో సహాయపడుతుంది.
- ఆస్కార్బిక్ ఆమ్లం 1000 పి.పి.యం. (1 గ్రా. ఆస్కార్బిక్ ఆమ్లంని లీటరు నీటిలో కరిగించడం)ను ఆకులపై పిచికారి చేయాలి.

**2. వంగిన మెడ :** కోత కోసిన తరువాత గులాబీ పువ్వుల కాండలు ఒంపుగా అవ్వడం జరుగుతుంది. దీన్ని వంగిన మెడగా వర్ణించవచ్చు. దీనికి కారణం మృధువైన కాండం యొక్క పెరుగుదల, పరిపక్వ మొగ్గలను కోయటం వలన, కోత నిర్వహణ సమయంలో అధిక ఉష్ణోగ్రత, తక్కువ తేమ మరియు సూక్ష్మజీవుల పెరుగుదలకు గురికావడం వలన గులాబీలో వంగిన మెడ వస్తుంది.

**నివారణ:**

- ఒంపుగా ప్రదర్శించే పువ్వుల కాండాల క్రిందిభాగాన్ని కత్తిరించి, 2 గంటల పాటు వెచ్చని నీటిలో మునగనివ్వాలి.
- పి.హెచ్. 6.0 వద్ద పూల సంరక్షణలో 10 శాతం సుక్రోజ్‌తో పాటు 2000 పి.పి.యం. (2 గ్రా. ద్రావణాన్ని లీటరు నీటిలో కరిగించడం) కోబాల్ట్ క్లోరైడ్ వాడకం ప్రభావవంతంగా ఉంటుంది.
- 50 డిగ్రీల సెల్సియస్ వద్ద మిథైల్ బ్రోమైడ్‌తో కోత కోసిన గులాబీలకు ధూపనం వేయడం.

**3. ఎద్దుతల :** పువ్వు పరిమాణం పెరుగుదల, పువ్వుల యొక్క రూపాంతరము చదునైన శిఖరముగా మారడం వంటివి ఎద్దుతల లక్షణాలు. రాత్రి సమయంలో తక్కువ ఉష్ణోగ్రతల వలన, సైటోకైనిన్స్ మరియు జిబ్బరిల్ల అసాధారణ ఉత్పత్తి వలన గులాబీలో ఎద్దుతల వస్తుంది.

**నివారణ:** 250 పి.పి.యం. సైటోకైనిన్స్ మరియు జిబ్బరిల్ల ద్రావణాన్ని వారానికొకసారి ఆకులపై పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9908062527



# పూల కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా॥ ఐ.వి. శ్రీనివాసరెడ్డి
వ్యవసాయ కళాశాల
ఆశ్వారావు పేట, భద్రాద్రి కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్రంలో 10,033 ఎకరాల్లో పూల సాగు చేపడుతున్నప్పటికీ అందులో సింహభాగం చామంతి 2978 ఎకరాల్లో, బంతిని 2364 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇంకా కనకాంబరం, చైనా ఆస్టరులను కూడా సాగు చేస్తున్నారు. పూల సాగులో మొక్కలు నాటిన దగ్గరి నుండి మొగ్గలు వచ్చే వరకు అన్ని జాగ్రత్తలు తీసుకొన్నప్పటికీ కోతల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకొకపోవడం వల్ల పూల దిగుబడి, నాణ్యత తగ్గి మార్కెట్‌లో సరైన ధరను రైతులు పొందలేకపోతున్నారు. కాబట్టి రైతులు పూలకోత సమయంలో ఈ జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులు, నాణ్యమైన పూలు పొందవచ్చు.

**1. పూలకోత దశ**

- సరైన దశలో పూలు కోసినట్లయితే వాటికి స్థానిక, జాతీయ మార్కెట్‌లల్లో మంచి విలువ పలుకుతుంది.
- పూలను పూర్తిగా విచ్చుకొన్న తరువాత కాకుండా మొగ్గదశలో ఉన్నప్పుడు కోసినట్లయితే ఎక్కువ కాలం నిల్వ ఉంచటానికి ఆస్కారం ఉంటుంది.
- స్థానిక మార్కెట్ కోసం అయితే పూర్తిగా విచ్చుకొన్నాక, దూరపు మార్కెట్‌కి పంపించాలంటే పూల మొగ్గలు అప్పుడే విచ్చుకొంటున్న దశలో కోసి రవాణా చేయాలి.

### 2. పూల కోత సమయం

- పూలకోత సమయం అనేది రైతు ఎన్నుకొన్న మొక్కల రకం పైన, వాతావరణ పరిస్థితులపైన ఆధారపడి ఉంటుంది.
- పూలను ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న సమయంలో కోయాలి. ఎందుకంటే ఎక్కువ ఉష్ణోగ్రతల వల్ల పూలలోని నీటిశాతం ఆవిరి రూపంలో వృధా అవుతుంది. తద్వారా పూలు వడలిపోయే అవకాశాలున్నాయి.
- దాదాపు పూలను ఉదయం లేదా సాయంత్రపు వేళల్లో కోయాలి.

### 3. పూల కోత పద్ధతులు

- పూలను కోసేటప్పుడు తుంచకుండా కత్తిరించాలి.
- కోయడానికి పదునైన కత్తెరలను ఉపయోగించాలి.

#### చామంతి

- పూలు, పూరెక్కలు బాగా వికసించిన తరువాత చిన్న కాడతో విడిపూలు కోయాలి.
- విడిపూలను ఉల్లిపాయ రవాణాకు ఉపయోగించే సంచులలో మార్కెట్‌కు తరలించాలి.
- అదే కట్‌ప్లవర్‌గానైతే పొడవాటి కాడతో పూలను కోసుకొని వెంటనే బకెట్‌లో ఉన్న సుక్రోజు నీటిలో ఉంచాలి.
- పూలను సూర్యరశ్మి తక్కువగా ఉన్న సమయంలో కోయాలి.
- 10-15 సార్లు పంటకాలంలో మనం పూలను కోయడానికి అవకాశం ఉంటుంది.

#### బంతి

- బంతి నాటిన 40 నుండి 65 రోజుల తరువాత పూత పూసి కోతకు వస్తుంది.
- బంతి పూలను బాగా విచ్చుకొన్న తరువాత కోయాలి.
- పూలను కోయడానికి ఒక రోజు ముందు నీటి తడి ఇవ్వడం వల్ల పూలు కోసిన తరువాత కూడా ఎక్కువకాలం నిల్వ ఉండేందుకు ఆస్కారం ఉంటుంది.
- పూల తొడిమలను ఒకటిన్నర అంగుళాల పొడవుతో కోసినట్లయితే పూల నాణ్యత చెడిపోకుండా తాజాగా ఉంటాయి.
- చాలా మంది రైతులు పూలను కోసిన తర్వాత వాటిపై నీరు చల్లుతారు. తద్వారా బరువు పెరుగుతుందనుకొంటారు. కానీ కోతానంతరం పూలపై నీరు చల్లరాదు.
- కోసిన పూలను సకాలంలో ఉల్లిపాయ సంచుల్లో నింపి బాగా గాలి సోకే విధంగా ఉంచి దగ్గరగా ఉన్న మార్కెట్‌కి రవాణా చేయాలి.

#### చైనా ఆస్టరు

- వీటి ఆకర్షణీయమైన రంగుల వల్ల మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది.
- ఈ మొక్కలు వాతావరణ పరిస్థితులను బట్టి పంట నాటిన 60-80 రోజులకు కోతకు వస్తాయి.
- పూలను సాయంత్రపు వేళల్లో గాని, ఉదయపు వేళల్లో గానీ కోయాలి.
- వీటిని రెండు రకాలుగా కోయవచ్చు. పూలను కాడతో కోసినట్లయితే కట్‌ప్లవర్‌గా అమ్మడానికి వీలుంటుంది. పూలను విడివిడిగా కొసినట్లయితే గృహాలంకరణకు, పూజా కార్యక్రమాల్లో ఉపయోగించేందుకు వీలుంటుంది.
- విడి పూలను గోనె సంచులలో ప్యాక్ చేసి జాగ్రత్తగా మార్కెట్‌కి తరలించాలి.

#### కనకాంబరం

- కనకాంబరం నాటిన 2-4 నెలలకు పూత మొదలై దాదాపు సంవత్సరం పొడవునా పూలు కోయడానికి అవకాశం ఉంటుంది.
- ఈ పూలు ఒక క్రమంలో వెన్ను క్రింద భాగం నుండి విచ్చుకొంటాయి. పువ్వు పూర్తిగా విచ్చుకోవడానికి రెండు రోజులు పడుతుంది. కావున రోజు మార్చి రోజు ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో పూలు కోయాలి.
- వెన్ను పొడవును బట్టి అందులో అన్ని పూలు విచ్చుకోవడానికి 15-25 రోజులు పడుతుంది.
- కనకాంబరం పూలు చాలా తేలికగా ఉంటాయి. కాబట్టి ఒక కిలోకు 15000 పూలు తూగుతాయి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.9441168156**





# వడగాలుల సమయంలో వ్యవసాయంలో చేపట్టవలసిన చర్యలు

డా॥ కె . ఇందుధర్ రెడ్డి, డా॥ బి. బాలాజీ నాయక్ మరియు డా॥ జి. శ్రీనివాస్
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

వాతావరణ పరిస్థితులు వ్యవసాయంపై భారీ ప్రభావాన్ని చూపుతాయి. తుఫానులు, కరువులు మరియు వడగాలులు వంటి తీవ్ర వాతావరణ సంఘటనల యొక్క తీవ్రత ఈ మధ్యకాలంలో పెరిగింది. ఈ వాతావరణ మార్పులన్నీ వ్యవసాయ ఉత్పత్తిపై ముఖ్యంగా భారతదేశంలోని సహా ఉష్ణమండలం మరియు ఉప-ఉష్ణమండల ప్రాంతాలలో తీవ్రమైన ప్రభావాలను కలిగి ఉంటాయి. పంట వ్యవధి తగ్గడం మరియు మొక్కలలో శ్వాసకోశ నష్టాలు పెరగడం వల్ల, ఉష్ణోగ్రత పెరుగుదల పంట ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

ప్రపంచ వాతావరణ సంస్థ (WMO) వారి నిర్వచనం ప్రకారం, వరుసగా ఐదు లేదా అంతకంటే ఎక్కువ రోజులు రోజువారీ గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ గరిష్ట ఉష్ణోగ్రతలకంటే $5^0$ సెల్సియస్ ఎక్కువగా నమోదైనప్పుడు లేదా ఏదైనా ప్రదేశం యొక్క గరిష్ట ఉష్ణోగ్రత వరుసగా రెండు రోజులు $45^0$ సెల్సియస్ కంటే ఎక్కువ ఉంటే వాటిని వడగాలులు (ఎమ్ ఖుఙవ) అంటారు.

**వ్యవసాయంలో వడగాలుల యొక్క ప్రభావాలు:** వ్యవసాయంపై వడగాలుల యొక్క ప్రభావం ప్రత్యక్షంగా (తీవ్రమైన జల-వాతావరణ సంఘటనల ద్వారా పంటలకు లేదా చెట్లకు భౌతిక నష్టం) మరియు పరోక్షంగా (వస్తువులు మరియు సేవల సంభావ్య ఉత్పత్తిని కోల్పోవడం, ఉత్పత్తి సామర్థ్యాలు కోల్పోవడం మరియు ఉత్పత్తి వ్యయం పెరగడం) ఉంటుంది. మట్టిలోని తేమ తీసుకునే స్థాయి, వేరు మరియు కాండం వృద్ధి స్థాయి, కిరణజన్య సంయోగక్రియ స్థాయి, శ్వాసక్రియ స్థాయి, మొక్కలు నీటిని తీసుకునే స్థాయి మరియు తుది దిగుబడి వంటి వివిధ స్థాయిలలో పంట పెరుగుదల మరియు అభివృద్ధిని వడగాలులు ప్రభావితం చేస్తాయి. బాష్పీభవనాన్ని (Evaporation) వేగవంతం చేయడం ద్వారా వడగాలుల వలన నేలలోని తేమ మొక్కలకు అందకుండా అయిపోతుంది. వడగాలులు పర్యావరణ క్షీణతకు కారణమవుతుంది. ఇది వ్యవసాయం యొక్క దుర్బలత్వానికి దోహదం చేస్తుంది.

ముఖ్యంగా యాసంగి మరియు వేసవి పంటలు వడగాలుల వల్ల తీవ్రంగా దెబ్బతింటాయి. ఉష్ణోగ్రతల్లో ఏదైనా తీవ్రమైన మార్పు పంటల ఉత్పాదకతను ప్రభావితం చేస్తుంది. వడగాలులు ఆలస్యంగా విత్తిన యాసంగి పంటలకు నష్టం కలిగిస్తాయి. అధిక ఉష్ణోగ్రతలు పంటల యొక్క పరాగసంపర్క దశను ప్రభావితం చేస్తుంది మరియు పుష్పించే దశ అధిక ఉష్ణోగ్రతలకు అత్యంత సున్నితమైన కాలం. ముఖ్యంగా వేడి తట్టుకోలేని రకాలలో, వడగాలులు నాణ్యత పరంగా మరియు పంట ఉత్పత్తిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. పంట నష్టం ప్రధానంగా పూత రాలిపోవడం మరియు పుప్పొడి నశించటం వల్ల సంభవిస్తుంది.

**వడగాలుల సమయంలో ప్రతికూల పరిస్థితుల ప్రభావాలను అధిగమించడానికి చర్యలు:** స్వల్పకాలిక రకాలు మరియు అధిక ఉష్ణోగ్రత తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. వడగాలుల సంభావ్యత అధికంగా వున్న ప్రాంతాలలో యాసంగి పంటలను ముందుగానే విత్తుకోవాలి. సూక్ష్మ సేద్యం (బిందు సేద్యం మరియు స్ప్రింక్లర్ పద్ధతి) వాడకాన్ని సూచించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే పంటలకు నీరు అందించాలి. పంటలకు తరచుగా తేలికపాటి తడులను అందించాలి. పంటల యొక్క క్లిష్టమైన వృద్ధి దశలలో తరచుగా నీటి తడులను అందించాలి. పంటలను విత్తడానికి ముందు కొబ్బరి పీచు లేదా సేంద్రియ ఎరువులను వినియోగించి నేల యొక్క నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. నేలలోని తేమను సంరక్షించుకోవడానికి గడ్డి లేదా పాలిథీన్ షీట్ తో కప్పుకొని మల్చింగ్ చేసుకోవాలి. పశువులు/మేకలు మేత కోసం ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకి వెళ్ళాలి. మధ్యాహ్నం సమయంలో బయటకి వెళ్ళకూడదు. పశువులను నీడలో ఉంచండి మరియు వాటికి తాగడానికి శుభ్రమైన మరియు చల్లటి నీరు పుష్కలంగా ఇవ్వండి. షెడ్ పైకప్పును గడ్డితో కప్పండి, ఉష్ణోగ్రత తగ్గించడానికి తెల్లగా పెయింట్ చేయండి లేదా పేడ మరియు మట్టిని కలిపి పూయండి. షెడ్‌లో ఫ్యాన్లు, వాటర్ స్ప్రే మరియు ఫాగర్‌లను ఉపయోగించండి. విపరీతమైన వేడి సమయంలో, పశువులపై నీటిని పిచికారి చేయండి. పశువులను చెరువు దగ్గరికి తీసుకెళ్లండి. పశువులకు పచ్చని గడ్డి, అధిక పోషకాలున్న ఖనిజ మిశ్రమం మరియు ఉప్పును అందించండి. కోళ్ళ షెడ్డులో సరిగా గాలి మరియు వెలుతురు వచ్చేలాగా పరదాలను ఏర్పాటు చేసుకోవాలి. కోళ్ళ షెడ్డులో ఫాగర్‌లను అమర్చి, షెడ్లను వరి గడ్డితో కప్పి మరియు స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసి తద్వారా పౌల్ట్రీ పక్షులను రక్షించుకోవచ్చును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.8328302074

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ కె. వాణిశ్రీ



**నిలువు**

1. గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండి అగ్గి తెగులును తట్టుకునే స్వల్పకాలిక మిక్కిలి సన్న గింజ వరి రకం పేరు? (6)
2. మధ్యస్థ నేలలు, తక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో సాగుకు అనుకూలమై, ఎండు తెగులును కొంత వరకు తట్టుకునే కంది రకం? (6)
3. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ప్రచురితమయ్యే తెలుగు మాస పత్రిక? (4)
4. త్వరగా పాడయ్యే వస్తువులను (పాలు, మాంసం మొ॥) దూర ప్రాంతాలకు చేరవేసేందుకు భారత ప్రభుత్వం ద్వారా 2020-21లో ప్రవేశపెట్టిన పథకం పేరు? (5)
5. నీటి ఎద్దడిని తట్టుకొని తక్కువ కాల పరిమితి గల యాసంగికి అనువైన వేరుశనగ రకం? (4)
6. వివిధ పంటల్లో సూక్ష్మపోషక లోపాలను నివారించడానికి వాడే సూక్ష్మధాతువుల వ్యాపారనామం ఏంటి? (4)
7. శ్వేత, హిమ, రాజేశ్వరి, చందన అను రకాలు ఏ పంటకు సంబంధించినవి? (3)

**అడ్డం**

1. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ప్రతి సంవత్సరం ప్రచురితమయ్యే వ్యవసాయ పంచాంగం నూతన పేరు? (11)
2. పంటను విత్తిన తొలిదశల్లో వివిధ చీడపీడల నుండి కాపాడుకోవటానికి ఉపయోగించే పద్ధతి? (5)
3. వానపాముల ఎరువును ఏమంటారు? (5)
4. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల రేడియో కార్యక్రమం? (5)
5. వేసవికాలంలో పంటలను ఆశించే వివిధ పురుగుల కోశస్థ దశలను నివారించటానికి పాటించే పద్ధతి ఏది? (5)

సమాధానాలు 50వ పేజీలో





# టమాట సాగులో ఎదురయ్యే పోషక లోపాలు మరియు ఇతర సమస్యలు - సవరణ

డా॥ వి. చైతన్య, డా॥ జె. హేమంత్ కుమార్, డా॥ కె. రవి కుమార్, పి.ఎస్.ఎమ్.ఫణిశ్రీ మరియు డా॥ జెస్సీ సునీత డబ్ల్యు
కృషి విజ్ఞాన కేంద్రం, వైరా



భారతదేశంలో పండించే ప్రధానమైన కూరగాయ పంటల్లో టమాట ఒకటి. ప్రపంచంలో టమాట ఉత్పత్తిలో మన దేశం రెండవ స్థానంలో ఉన్నది. కానీ ప్రపంచ సగటు ఉత్పాదకత (37.02 ట/హె) కన్నా కూడా మన దేశ టమాట ఉత్పాదకత (24.21 ట/హె) తక్కువగా ఉన్నది. పోషకాలు తగిన మోతాదులో అందించకపోవటం సమతుల్యత లేకపోవడంతో పాటు వాతావరణ పరిస్థితులు ప్రభావం కూడా ఉత్పాదకత తగ్గుటకు ప్రధాన కారణం. సిఫారసు చేసిన ఎరువులు వేసినప్పటికీ కొన్ని ప్రత్యేక సమస్యలు ఎదురుకావడం వల్ల దిగుబడితో పాటు నాణ్యత కూడా లోపిస్తుంది. ముఖ్యంగా వేసవిలో పండించే టమాటలో పోషక లోప మరియు ఇతర సమస్యలు అధికంగా ఉంటాయి. కావున ఈ సమస్యలపై అవగాహన ఉంటే తగిన చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

### పోషక లోపాలు

**కాల్షియం:** కాయల్లో, పూతవైపు కుళ్ళు, లేత ఆకుల చివరలు పసుపు రంగుకు, ఆకు అడుగు భాగం ఊదారంగు లోకి మారి ముడుచుకుపోతాయి. ఆకు చివర, వేరు కొనలు ఎండిపోయి పెరుగుదల ఆగి కాండం మందంగా గట్టిగా ఉంటుంది.

**నివారణ:** 0.75-1.0 శాతం కాల్షియం నైట్రేట్ లేదా 0.4 శాతం కాల్షియం క్లోరైడ్ పైరుపై పిచికారి చేయాలి.

**బోరాన్:** మొక్క చివరి భాగం వడలి చనిపోతుంది. ఆకుల్లో ఈనెల మధ్య పసుపు రంగుకు మారి పెళుసుగా ఉంటాయి. బోరాన్ లోపం కాల్షియం లోపానికి దారితీస్తుంది.

**నివారణ:** 0.1-0.25 శాతం బోరాక్స్ ద్రావణాన్ని పైరు మీద పిచికారి చేయాలి.

**జింక్:** కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. ఆకులు చిన్నగా ఒక్కోసారి పొడవుగా ఉంటాయి. తొడిమలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి.

**నివారణ:** పైరుపై 0.1-0.5 శాతం జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి.

**పొటాషియం:** ముదురాకులు పసుపు రంగులోకి మారి కాయలు ఒకే మాదిరి పండవు.

**నివారణ:** 0.2 శాతం పొటాషియం సల్ఫేట్ ద్రావణాన్ని పైరుపై పిచికారి చేయాలి.

**ఇతర సమస్యలు**

**పూత చివర కుళ్ళు/కాయ కింద కుళ్ళు :** ఈ సమస్య పెరిగే కాయల్లో కాల్షియం లోపం వల్ల కలుగుతుంది. నీటి మచ్చలుగా మొదలై పరిమాణం పెరిగి నల్లగా, తోలు మాదిరి కనిపిస్తుంది. కాయ, పూత చివరి వైపు ఈ సమస్య వస్తుంది.

**కారణాలు:** మొక్కకు నీటి సరఫరా లోపం వల్ల కాల్షియం లోపిస్తుంది. అంతేకాకుండా నేలలో కరిగే లవణాలు ఎక్కువగా ఉండటం, తక్కువ కాల్షియం, నత్రజని ఎరువులు తక్కువగా వాడటం, నేలలో కరిగే పొటాషియం, మెగ్నీషియం ఎక్కువ మోతాదులో ఉండడం.

**నివారణ:** నేలలో తగినంత కాల్షియం ఉండేలా చూడాలి. భాస్వరపు ఎరువును సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేస్తే కాల్షియం లభిస్తుంది. నేలల్లో తేమ ఒడిదుడుకులు లేకుండా చూడాలి. 0.75-1 శాతం కాల్షియం నైట్రేట్ లేదా 0.4 శాతం కాల్షియం క్లోరైడ్ ద్రావణాన్ని పైరుపై పిచికారి చేయాలి.

**కాయ పగులుట:** టమాటలో కాయ పగులు రెండు రకాలుగా కనిపిస్తుంది.

**నిలువుగా పగులుట:** ఇది కాయ తొడిమ వైపు మొదలై పూత చివరి వైపుకు వెళ్తుంది.

**రింగులుగా పగులుట:** కాయపై తొడిమ చుట్టూ ఒకటి లేదా ఎక్కువ రింగులుగా కనిపిస్తుంది.

**కారణాలు:** పై చర్మంలోని కణజాలం కంటే లోపలి కణజాలం ఎక్కువ వ్యాకోచం చెందడం వల్ల కాయ పగులుతుంది. కాయ త్వరితగతిన పెరగడం, నీటి లభ్యతలో ఎక్కువ ఒడిదుడుకులు వల్ల కూడా కాయ పగులుతుంది. కాయ పక్వానికి వచ్చే దశలో పొడి వాతావరణం తర్వాత ఎక్కువ వర్షాలు, అధిక ఉష్ణోగ్రత ఉంటే కాయ పగులు వస్తుంది. పోషకాల్లో బోరాన్ లోపం వల్ల కూడా కాయ పగులుతుంది.

**నివారణ:** మల్చింగ్ వేస్తూ ఎక్కువ నత్రజనిని వాడరాదు. 0.3 శాతం బోరాక్స్ ద్రావణాన్ని పూత, పిందె దశలో పిచికారి చేయాలి.

**కాయ ఆకృతి కోల్పోవడం:** ఇది ఎక్కువగా కాయలో పూత చివరి వైపు కనిపిస్తుంది. పిందె కట్టే దశలో చల్లని వాతావరణం వల్ల కొంత కణజాలం చనిపోయి, పెరిగే కాయ ఆకృతి కోల్పోతుంది. ఎక్కువ పరిమాణం గల కాయల్లో ఈ సమస్య సాధారణంగా ఉంటుంది.

**నివారణ చర్యలు:** కలుపు మందుల వంటి రసాయనాలు పిచికారి చేసేటప్పుడు, కాయలపై పడకుండా చూడాలి. టమాటను నీరు నిల్వ ఉండే నేలల్లో పండించరాదు.

**ఎండు మాడు:** (సన్ స్కాల్డ్) సూర్యరశ్మి నేరుగా వచ్చి టమాట కాయలపై పడడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. మొదట తెల్లని మెరిసే బొబ్బలాగా కనిపించి పక్వానికి వచ్చే దశలో రంగు కోల్పోయిన కణజాలం చనిపోయి, లేత పసుపు రంగుకు మారి లోపలకు నొక్కుకు పోయి ముడుతలు పడుతుంది. చనిపోయిన కణజాలంపై ఇతర సూక్ష్మజీవులు త్వరగా ఆశించి కుళ్ళిపోతాయి.

నివారణ: కాయలను కప్పి ఉంచే రకాలను సాగుచేయాలి. ఆకులపై వచ్చు తెగుళ్ళను నివారించాలి.

**కాయ సరిగా పండకపోవడం:** కాయ ఉపరితలంపై కొన్ని ప్రాంతాల్లో ఎరుపు రంగు లేకపోవడం వల్ల ఈ విధంగా జరుగుతుంది. మొక్కల్లో పొటాష్ మోతాదు తక్కువగా ఉండడం, నేలల్లో గాలిలో ఎక్కువ తేమ, తక్కువ ఉష్ణోగ్రత, నేల గట్టిపడడం, ఎక్కువ మోతాదులో ఎరువులు వేయడం వల్ల పోషకలోపం లేదా ఇతర అసమానతల వల్ల ఎరుపు రంగు వృద్ధి చెందక పోవడానికి దోహదపడతాయి.

**నివారణ చర్యలు:** మొక్క ఎదుగుదలకు సరైన యాజమాన్య పద్ధతులు, పోషక సమతుల్యత కొరకు కావల్సిన ఎరువులు వాడాలి.

**కాయ గుల్లబారడం:** కాయ మూడింట రెండు వంతులు పెరిగాక లోపలి కణజాలం పెరుగుదల ఆగిపోయి, బయటి కణజాలం మాత్రం సాధారణంగా పెరుగుతుంది. ఇటువంటి కాయలు తేలికగా ఉండి పూర్తిగా పెరగవు. ఈ సమస్య ఎక్కువగా శీతాకాలంలో వస్తుంది. ఫలదీకరణ లోపం వల్ల అధిక ఉష్ణోగ్రత, అధిక తేమ వల్ల అధిక మోతాదులో నత్రజనిని మొక్కకు అందించడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది.

**నివారణ:** ఈ సమస్యను తట్టుకొనే రకాలను పెంచుకోవడంతో పాటు ఎక్కువ నీటిని మొక్కకు అందించరాదు. సరైన మోతాదులో నత్రజని ఎరువులను వాడాలి.

కావున టమాట సాగులో ఎదురయ్యే పోషకలోపాలను, ఇతర సమస్యలను గుర్తించి సరైన పోషక యాజమాన్యంతో పాటు అనువైన రకాలను ఎంపికచేసి సాగుచేస్తే నాణ్యమైన అధిక దిగుబడులను సాధించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9441632227



# వేసవిలో కీర దోసకాయ - ప్రయోజనాలు


డా॥ టి. కమలజ, డా॥ ఆర్. నీలారాణి, జి. సాయిభవాని మరియు డా॥ శ్వేత కొడాలి

అఖిల భారత సమన్వయ పరిశోధనా పథకము – గృహ విజ్ఞాన విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్


- కీర దోసకాయ కుకుర్బిటేసి కుటుంబానికి చెందినది. కీర దోసకాయలు మంచి రుచి మరియు అధిక నీటి శాతం కలిగి ఉంటాయి. ఇవి నిర్జలీకరణం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి మరియు వేడి వాతావరణంలో తినడానికి ఆహ్లాదకరంగా ఉంటాయి.
- వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. శరీర ఉష్ణోగ్రతను తగ్గించుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. ఎందుకంటే కీర దోసకాయలో 95 శాతం నీరు ఉంది. ఈ అధిక నీటి శాతం వలన సాధారణ ప్రేగు కదలికలకు మద్దతు ఇవ్వడమే కాక, జీర్ణ వ్యర్థాలను బయటకు తీస్తుంది. కాబట్టి భోజనంలో వాటిని ఆస్వాదించడమే కాకుండా, నీటిలో ఈ ముక్కలు జోడించడం ద్వారా లేదా కీర దోసకాయ రసం తాగడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.
- కీర దోసకాయ మరియు వేసవి కలిసి వస్తాయి. కీర దోసకాయలో అనేక పోషకాలు ఉన్నాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో అవసరం. కీర దోసకాయను ఖనిజ, విటమిన్లు మరియు ఎలక్ట్రోలైట్ల పవర్ హౌస్ అంటారు. శాండ్‌విచ్‌లు, సలాడ్‌లలో రైతులు దీనిని ప్రముఖంగా వాడుతారు. వేసవిలో మనం కీర దోసకాయను ఏదో ఒక రూపంలో తీసుకుంటాము. మరీ ముఖ్యంగా వేసవిలో కలిగే విరేచనాలు మరియు ఫుడ్ పాయిజనింగ్ సమస్యలను దూరం చేసుకోవచ్చు.
- వేడి వాతావరణంలో లేదా వ్యాయామం తర్వాత నిర్జలీకరణాన్ని నివారించడానికి కీర దోసకాయలు సహాయపడతాయి. కీర దోసకాయ మరియు పుదీనా జోడించిన రసం తాగడం వలన మలబద్ధకాన్ని నివారించడానికి, మూత్రపిండాల్లో రాళ్ళను నివారించడానికి మరియు హైడ్రేటెడ్‌గా ఉంచడానికి ఉపయోగపడుతుంది.
- కీర దోసకాయలు ఫైటోన్యూట్రియెంట్స్ యొక్క మంచి వనరులు. అంతేకాక వీటిలో ఉండే ఫ్లావనాయిడ్లు, లిగ్నిన్లు మరియు ట్రైటెర్పిన్స్ అనే యాంటీఆక్సిడెంట్స్, రోగ నిరోధక మరియు క్యాన్సర్ నిరోధక ప్రయోజనాలను కలిగి ఉంటాయి. అంతే కాక దీనిలో ఉండే అధిక నీటి శాతం వలన అధిక బరువును తగ్గించుకోవడానికి ఉపయోగించవచ్చు. కీర దోసకాయలో విటమిన్ సి, విటమిన్ ఎ, కాపర్, మెగ్నీషియం, పొటాషియం, మాంగనీస్ మరియు సిలికా వంటి చాలా ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి.
- రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో కీర దోసకాయ కూడా ముఖ్యం. కీర దోసకాయలలో విటమిన్ సి, బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి తద్వారా రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది.
- ఆరోగ్యకరమైన హృదయాన్ని కాపాడుకోవడంలో కీర దోసకాయలోని పోషకాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ కూరగాయలో పొటాషియం మరియు మెగ్నీషియం ఉన్నాయి. అవి శరీరం యొక్క నాడి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతాయి మరియు రక్తపోటును స్థిరమైన రేటులో ఉంచుతాయి. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. ఇది శరీరానికి గురయ్యే ఏదైనా వ్యాధుల నుండి కాపాడుతుంది.

- కీర దోసకాయలో 95% నీరు ఉన్నందున ఇది కళ్ళను హైడ్రేట్‌గా ఉంచుతుంది. అంతేకాక దీనిలో ఉండే విటమిన్ ఇ చర్మాన్ని మెరుగుపర్చడానికి దోహదపడుతుంది అనగా చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడుతుంది. అంతేకాక దీని శోధ నిరోధక లక్షణాలు మంచి దృష్టికి మరియు కంటి శుక్లాలను నివారిస్తాయి మరియు దీనిలో ఉన్న విటమిన్ సి చర్మంను ప్రకాశవంతంగా ఉంచుతుంది.
- కీర దోసకాయలో లుటీన్ మరియు కుకుర్బిటాసిన్లు ఉంటాయి. ఇది శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, దీనిని మనం ప్రతిరోజు తినే ఆహారంలో చేర్చుకోవడం వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్, ఉపిరితిత్తుల క్యాన్సర్ మరియు గర్భాశయ క్యాన్సర్ నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. వీటి ప్రయోజనాలను పరిశోధనలు కూడా రుజువు చేశాయి.
- దీనిలో ఉండే విటమిన్ బి6, విటమిన్ బి5, విటమిన్ సి, విటమిన్ కె మరియు సిలికాన్ ఎముకల ఆరోగ్యానికి దోహదపడతాయి. కీర దోసకాయలను రోజువారిగా తీసుకోవడం దీర్ఘకాలిక మలబద్ధకానికి నివారణగా పరిగణించవచ్చు.
- కీర దోసకాయలలో పొటాషియం, మెగ్నీషియం మరియు ఫైబర్ చాలా ఉన్నాయి. రక్తపోటును నియంత్రించడానికి ఇవి సమర్ధవంతంగా పనిచేస్తాయి. చర్మంపై ముఖ్యంగా ఓదార్పు ప్రభావాన్ని కలిగి ఉంటాయి. చికాకు, వాపు, వడదెబ్బ, మొటిమలు మరియు పొడిబారడం తగ్గించడానికి కీర దోసకాయ ముక్కలు లేదా కీర దోసకాయ రసాన్ని సమయోచిత ఔషధంగా వాడవచ్చును. కళ్ళ మీద చల్లని కీర దోసకాయ ముక్కలను 10-20 నిమిషాలు విశ్రాంతి తీసుకునేటప్పుడు ఉంచడం ద్వారా కళ్ళ చుట్టూ చర్మాన్ని తేమగా ఉంచడానికి మరియు కళ్ళ క్రింద నల్లటి వలయాలు తగ్గించడానికి సహాయపడుతుంది.

**100 గ్రాముల కీర దోసకాయలోని పోషక విలువలు**

| పోషకాలు | పోషక విలువలు |
|---|---|
| శక్తి (కి.క్యాలరీలు) | 19.6 |
| ప్రోటీన్ (గ్రా.) | 0.71 |
| కొవ్వు (గ్రా) | 0.16 |
| ఫైబర్ (గ్రా.) | 2.14 |
| కార్బోహైడ్రేట్స్ (గ్రా.) | 3.48 |
| విటమిన్ బి1 (మి.గ్రా.) | 0.02 |
| విటమిన్ బి2 (మి.గ్రా.) | 0.01 |
| విటమిన్ బి3 (మి.గ్రా.) | 0.35 |
| విటమిన్ బి5 (మి.గ్రా.) | 0.45 |
| విటమిన్ బి6 (మి.గ్రా.) | 0.06 |
| విటమిన్ బి7 (మి.గ్రా.) | 2.82 |
| విటమిన్ బి9 (మైక్రో.గ్రా.) | 16.84 |

| పోషకాలు | పోషక విలువలు |
|---|---|
| విటమిన్ సి (మైక్రో.గ్రా.) | 6.11 |
| కెరోటినాయిడ్స్ (మైక్రో.గ్రా.) | 171 |
| విటమిన్ డి2 (మైక్రో.గ్రా.) | 1.26 |
| ఇనుము (మి.గ్రా.) | 0.46 |
| జింక్ (మి.గ్రా.) | 0.17 |
| పొటాషియం (మి.గ్రా.) | 183 |
| సోడియం (మి.గ్రా.) | 6.33 |
| కాల్షియం (మి.గ్రా.) | 16.39 |
| మెగ్నీషియం (మి.గ్రా.) | 20.38 |
| ఫాస్ఫరస్ (మి.గ్రా.) | 28.34 |
| సంతృప్త కొవ్వు (గ్రా.) | 0.06 |

(మూలం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, హైదరాబాద్)



**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9985892124**

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు, జె.ఎస్. సుధారాణి మరియు డా॥ పి. ప్రశాంత్
ఎలక్ట్రానిక్ మీడియా వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | | | |
| 1. | 03.05.2021 | మొండిజాతి కలుపు మొక్కల నివారణకు వేసవిలో చేపట్టవలసిన పనులు | డా॥ ఆర్. శ్రీనివాస్ రావు, యస్.యమ్.యస్ (క్రాప్ ప్రొడక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, కొత్తగూడెం, 7893034800 |
| 2. | 05.05.2021 | వేసవి కూరగాయలలో సస్యరక్షణ | డా॥ యన్. నరేంద్ర రెడ్డి, అసోసియేట్ డీన్ వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్, 9849692058 |
| 3. | 07.05.2021 | వేసవిలో ఉద్యాన పంటల యాజమాన్యం | డా॥ ఐ.వి.యస్ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ (ఉద్యాన విభాగం) వ్యవసాయ కళాశాల, అశ్వరావుపేట, 9441168156 |
| 4. | 11.05.2021 | వేసవిలో నేల సంబంధ చర్యలు - సూచనలు | డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, 7702366110 |
| 5. | 17.05.2021 | వానాకాలంకు అనువైన వరి రకాలు - విత్తనోత్పత్తిలో మెళకువలు | డా॥ బి. లక్ష్మి ప్రసన్న, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, 9573316477 |
| 6. | 19.05.2021 | సమస్యాత్మక భూములు - యాజమాన్యం | డా॥ ఇ. నర్సయ్య, సీనియర్ శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) & కోఆర్డినేటర్ ఏరువాక కేంద్రం, వరంగల్, 9989623814 |
| 7. | 20.05.2021 | పశుగ్రాస పంటల్లో కొత్త రకాలు - సాగు సూచనలు | డా॥ టి. శశికళ, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ అఖిల భారత సమన్వయ పశుగ్రాస పంటల మరియు వినియోగ పరిశోధన విభాగం రాజేంద్రనగర్, హైదరాబాద్ 9849152482 |
| 8. | 24.05.2021 | నేల మరియు నీటి నమూనా సేకరణ, పరీక్ష పద్ధతులు మరియు ఆవశ్యకత | డా॥ యమ్. ఉమాదేవి, సీనియర్ ప్రొఫెసర్ & హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సాయిల్ సైన్స్, వ్యవసాయ కళాశాల, జగిత్యాల, 9440494019 |
| 9. | 25.05.2021 | అపరాలలో విత్తన ఎంపిక, లభ్యత, రైతులకు సూచనలు | డా॥ కె. రుక్మిణి దేవి, సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) & హెడ్ వ్యవసాయ పరిశోధనా స్థానం, మధిర 7675050041 |
| 10. | 27.05.2021 | వానాకాలం పంటల్లో ఎరువుల సమర్థ వినియోగం - తీసుకోవలసిన జాగ్రత్తలు | డా॥ వై. ప్రవీణ్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్, 9989623829 |
| 11. | 28.05.2021 | సోయాచిక్కుడులో విత్తన ఎంపిక మరియు మేలైన యాజమాన్య పద్ధతులు | డా॥ యమ్. రాజేందర్ రెడ్డి, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, 9704134304 |
| 12. | 31.05.2021 | పంట అవశేషాల యాజమాన్య సూచనలు | డా॥ పి. రాజయ్య, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్, వ్యవసాయ పనిముట్లు మరియు యంత్రాల విభాగం, రాజేంద్రనగం, 7288028996 |

II. టి-శాట్ (రైతు మిత్ర): సాయంత్రం 4.00-5.00

| | | | |
|---|---|---|---|
| 1. | 03.05.2021 | ముందస్తు వాతావరణ సూచనలు - వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యత | యన్. నవత, శాస్త్రవేత్త (అగ్రోనమి) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం,జగిత్యాల, 8074006521 |
| 2. | 10.05.2021 | వ్యవసాయంలో వివిధ అనువర్తనలు - వాటి వినియోగం | డా॥ పి. అర్చన, శాస్త్రవేత్త (విస్తరణ విభాగం) ఏరువాక కేంద్రం, పాలెం, 9666150842 |
| 3. | 17.05.2021 | పచ్చిరొట్ట ఎరువులు - ఉపయోగాలు | జె. విజయ్, శాస్త్రవేత్త (అగ్రోనమి), ఏరువాక కేంద్రం, తోర్నాల 9381515588 |
| 4. | 24.05.2021 | భూసార పెంపునకు మేలైన యాజమాన్య పద్ధతులు | డా॥ బి. శ్రీజయ, శాస్త్రవేత్త (యస్.యస్.ఎ.సి), ఎ.ఐ.సి.ఆర్.పి (యస్.టి.సి.ఆర్), రాజేంద్రనగర్, హైదరాబాద్, 7396193111 |
| 5. | 31.05.2021 | వానాకాలంలో వరి సాగుకు అనువైన మేలైన యాజమాన్య పద్ధతులు | జె. సుధారాణి, శాస్త్రవేత్త (అగ్రోనమి) ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, 9550526096 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ సిహెచ్. వేణుగోపాల రెడ్డి, డా॥ కె. వాణిశ్రీ మరియు డా॥ యం. విజయలక్ష్మి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. యాసంగి మరియు వేసవి పంట కోతల తర్వాత వేసవి దుక్కులు చేసుకోవటం వలన ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి?**

ఎ. భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది
బి. కలుపు మొక్కలు, వాటి అవశేషాలు, విత్తనాలు నశించబడతాయి
సి. భూమిలో దాగి, కోశస్థ దశలో ఉన్న వివిధ పురుగులు సూర్యరశ్మికి బహిర్గతమై చనిపోతాయి
డి. పైవన్నీ

**2. మంచి విత్తనోత్పత్తికి, విత్తన సేకరణ విషయంలో ఎలాంటి సూచనలు పాటించాలి?**

ఎ. విత్తనాన్ని ఆరోగ్యమైన పంట నుండి సేకరించాలి
బి. విత్తనం మంచి మొలకశాతం కలిగి ఉండాలి.
సి. విరిగిన గింజలు, తెగులు సోకిన గింజలు వాడకూడదు
డి. పైవన్నీ

**3. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?**

ఎ. లైసెన్సు పొందిన డీలర్లు, గుర్తింపు పొందిన సంస్థల నుండి మాత్రమే కొనుగోలు చేయాలి.
బి. ఎటువంటి లేబుల్ లేని విత్తనం కొనరాదు
సి. ప్రభుత్వం నుండి అనుమతి లేని ఎలాంటి విత్తనాలు కొనరాదు
డి. పైవన్నీ

**4. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి తగ్గించుటకు ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు ప్రయోజనకరం?**

ఎ. వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి
బి. ఆలస్యంగా మొక్కజొన్నను వేసుకోకూడదు
సి. అంతర పంటగా కందిని వేసుకోవాలి
డి. పైవన్నీ

**5. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి ఎన్ని కోట్లు కేటాయించింది?**

ఎ. 500 బి. 1000 సి. 1500 డి. 2000

**6. ఇటీవల తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో పంటల ధరలపై పరిశోధన, విశ్లేషణ చేసి రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు మార్కెటింగ్ శాఖలో ఏర్పాటు చేసేందుకు ప్రవేశపెట్టిన విభాగం?**

ఎ. సమీకృత వ్యవసాయ మార్కెట్ల విభాగం
బి. మార్కెటింగ్ విశ్లేషణ, పరిశోధనా విభాగం
సి. గ్రామీణాభివృద్ధి మరియు సంక్షేమ విభాగం
డి. ఏదీకాదు

**7. ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్‌లో ఎంతశాతం భాస్వరం ఉంటుంది?**

ఎ. 16% బి. 24%
సి. 48% డి. 20%

**8. మెడోపద్ధతిలో జామ తోటల సాగు ద్వారా రైతులు ఒక ఎకరాకు దాదాపు ఎన్ని మొక్కలు పెంచుకోవచ్చును?**

ఎ. 444 బి. 2000
సి. 5000 డి. 4000

**9. చెఱకులో చెత్తను పరచటం ద్వారా ఏ పురుగుల ఉధృతిని కొంత వరకు తగ్గించవచ్చును?**

ఎ. వేరు లద్దె పురుగు బి. పీక పురుగు
సి. తెల్లదోమ డి. చెదలు

**10. ఐసిఏఆర్ ఆధ్వర్యంలోని జాతీయ ఆయిల్ పామ్ పరిశోధన స్థానం (ఐఐఓసిఆర్) ఎక్కడ ఉంది?**

ఎ. రాజమండ్రి బి. హైదరాబాద్
సి. పెదవేగి డి. మైసూర్

పై ప్రశ్నలకు సమాధానాలు 50 వ పేజీలో చూడవచ్చు

## డా॥ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

డా॥ బాబు జగ్జీవన్ రామ్ 114వ జయంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 5న ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు, బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించారు.

## దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం

దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం ఏప్రిల్ 7 మరియు 8న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అడిషనల్ కలెక్టర్ శ్రీ. శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతులకు మేలు చేసే వంగడాలను అభివృద్ధి చేయాలని మరియు శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలు పాటిస్తే రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. పరిశోధన సంచాలకులు డా॥ ఆర్. జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రస్తుతం మూస పద్ధతిలో చేసే వ్యవసాయానికి స్వస్తి పలికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మరియు రైతులు యాంత్రీకరణను అధికంగా అవలంభించి సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రధాన శాస్త్రవేత్తలు వాతావరణాధారిత పంటల సాగు, వ్యవసాయ యాంత్రీకరణ, సమగ్ర సస్యరక్షణ నేరుగా వరి విత్తే పద్ధతులను రైతులకు వివరించారు. ఈ సమావేశంలో విస్తరణ సంచాలకులు డా॥ జి. శామ్యూల్, సహ పరిశోధన సంచాలకులు, డా॥ డి. దామోదర్ రాజు, శాస్త్రవేత్తలు, 11 జిల్లాల వ్యవసాయాధికారులు, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## వర్సిటీతో ప్రతిమ అగ్రి సర్వీసెస్ ఒప్పందం

రైతులకు ఆధునిక సాఫ్ట్‌వేర్ టెక్నాలజీని వినియోగించి మెరుగైన సాంకేతిక సలహాలు అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన ప్రతిమ అగ్రి సర్వీసెస్ ఏప్రిల్ 27న విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రానున్న రోజుల్లో ఈ-రైతు వెబ్‌సైట్ రూపొందించి దాని ద్వారా రైతులకు వ్యవసాయ సూచనలు అందించనున్నారు. అలాగే రాష్ట్రంలో 30 కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు వ్యవసాయ సాగు విధానాలు, యాజమాన్య పద్ధతులు, నేల పరీక్ష, నీటి పరీక్ష, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కస్టమ్ హైరింగ్ సేవలను అందించనున్నారు.

## నువ్వుల పంటలో డ్రోన్ ద్వారా సస్యరక్షణ మందులను పిచికారి చేయటంపై పరిశోధన ప్రాజెక్టు ప్రారంభం

"ఎవాల్యుయేషన్ అండ్ స్టాండర్డైజేషన్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్ సొల్యూషన్స్ ఇన్ మేజర్ ఫీల్డ్‌క్రాప్స్ యూజింగ్ డ్రోన్ టెక్నాలజీ నెట్‌వర్క్ ప్రాజెక్టులో భాగంగా జగిత్యాల జిల్లాలోని తక్కలపల్లి గ్రామంలో ఏప్రిల్ 8న రైతు క్షేత్రంలో డ్రోన్‌ను ఉపయోగించి తెగుళ్ళ మందును పిచికారి చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జెడ్.పి. చైర్‌పర్సన్, జగిత్యాల గౌ॥ శ్రీమతి దావా వసంత ముఖ్య అతిధిగా హాజరై డ్రోన్‌తో పిచికారి చేయడాన్ని రైతు క్షేత్రంలో లాంఛనంగా ప్రారంభించారు.

**వి. సుధాకర్ మరియు మార్ఫ్ర బాబు**


### వ్యవసాయ మాసపత్రిక

సంవత్సర చందా రూ. 200/-
జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/-
నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.
డి.డి అయితే
Principal Agricultural Information Officer,
AI&CC and PJTSAU Press
పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి.

### వివిధ పంటల నాశించు చీడపీడలు - వాటి నివారణ, రోగ నిర్ధారణ ప్రచురణలు - వాటి ధరలు

| | | |
|---|---|---|
| వరి | - | రూ. 50/- |
| మొక్కజొన్న | - | రూ. 50/- |
| వేరుశనగ | - | రూ. 40/- |
| ఆముదం | - | రూ. 40/- |
| సోయాచిక్కుడు | - | రూ. 40/- |
| ప్రత్తి | - | రూ. 50/- |

# వ్యాపారాత్మకంగా షేడ్‌నెట్‌లో నర్సరీ పెంపకం-
# సిరులు కురిపిస్తున్న ఆర్యప్రాజెక్టు విజయగాథ

డా॥ పి. ప్రశాంత్, యన్. కిశోర్ కుమార్, జె.యస్. సుధారాణి మరియు డా॥ యం. శ్రీనివాసులు
ఎలక్ట్రానిక్ వింగ్, ఏ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, హైదరాబాద్







ప్రస్తుత వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతిలో షేడ్‌నెట్ సాగుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాలలో భారత వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో ఆర్య ప్రాజెక్టును చేపట్టడం జరిగింది. ఈ ఆర్య ప్రాజెక్టు ద్వారా మహబూబాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణ, ప్రోత్సాహం ఇచ్చి వ్యవసాయం వైపు ఆకర్షిస్తూ, స్వయం ఉపాధి పొందడంలో సహకరిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల వారు ఆర్య ప్రాజెక్టు ద్వారా వ్యాపార సరళిలో షేడ్‌నెట్ల క్రింద పండ్లు మరియు కూరగాయల నారు పెంపకంపై మరియు వ్యవసాయానుబంధ రంగాలపై శిక్షణ, విజ్ఞాన యాత్రలను నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో యువరైతులకు ఆరోగ్యవంతమైన నారును పెంచుకోవడానికి కావలసిన సౌకర్యాలు, నైపుణ్యత మరియు యాజమాన్యంపై అవగాహన కల్పించడం జరిగింది.

మహబూబాబాద్ జిల్లాలో కూరగాయ పంటలైన మిరప, టమాట, వంగ మరియు చామంతి పంటకు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన నారు దొరకడం రైతులకి ప్రధాన సమస్యగా ఉందని రమేష్ నర్సరీ వారు గుర్తించడం జరిగింది. గతంలో రైతులు ఎవరికి కావలసిన నారును వారు ఎత్తైన మడి చేయకుండా నేలపై పెంచుకునేవారు. దీని వలన వేరుకుళ్ళు, ఎండుతెగులు బాగా ఆశించేవి. అంతేకాకుండా ఎవరికి వారుగా షేడ్‌నెట్ల క్రింద నారు పెంచుకోవడం వల్ల ఖర్చు కూడా పెరుగుతుంది.

కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల వారి శిక్షణ ద్వారా ప్రేరణ పొందిన గిరిజన యువకులు ఒక బృందంగా ఏర్పడి రమేష్ నర్సరీ అనే పేరుతో నర్సరీని స్థాపించారు. ఈ బృందం 256 చదరపు మీటర్ల స్థలంలో నర్సరీని జి.కె. తండా, తొర్రూరు మండలంలో ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ నర్సరీకి కావలసిన షేడ్‌నెట్, ప్రోట్రేలు / ప్లాస్టిక్ ట్రేలు, రోజ్ క్యాన్, కోకోపీట్ లకు కావలసిన ఆర్థిక సహాయాన్ని కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల వారు అందించారు.

వాణిజ్య సరళిలో రైతులకు నాణ్యమైన నారును తక్కువ ఖర్చుతో అందించాలనే సంకల్పంతో రమేష్ గ్రూపు నర్సరీ వారు అత్యంత నాణ్యమైన కూరగాయ, పూల నారును ఏడాదంతా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో షేడ్‌నెట్‌లో ఉత్పత్తి చేస్తున్నారు. జూన్ మాసంలో మిరపనారును పోసుకొని జూలై మధ్యలో నుండి అమ్ముకోవడం జరిగింది. గత సంవత్సరంలో 1,80,000 - 2,00,000 మొక్కలను ఇతర రైతులకు అమ్ముకోవడం జరిగింది.

అంతేకాకుండా పూల పెంపకంలో గల సువర్ణ అవకాశాలను గుర్తించి చామంతి అంటు మొక్కలను షేడ్‌నెట్

నర్సరీలో పెంచి చుట్టు ప్రక్కల పాలీహౌస్ రైతులకు అమ్ముతున్నారు. ఈ చుట్టు ప్రక్కల ప్రాంతంలో రైతులు కూరగాయలతో పాటు పూల మొక్కలను కూడా సాగు చేస్తారు. కొంతమంది రైతులు పూర్తిగా పాలీహౌస్‌లో సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాదంతా పూల సాగును చేపడుతున్నారు. దీనివల్ల ఇంతకు ముందు మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులు మహారాష్ట్ర నుండి ఒక చామంతి నారు మొక్కను రూ. 3/- చొప్పున కొనుగోలు చేసి పంటను పండించేవారు. ప్రస్తుతం రమేష్ నర్సరీ వారు నాణ్యమైన మిరప, టమాట, వంగ నారుతో పాటు చామంతి నారు మొక్కను ఒక రూపాయికి ఇతర రైతులకు అమ్మి విజయవంతం అయినారు. మొత్తంగా ఒక సంవత్సరంలో మిరపతో పాటు చామంతి నారును అమ్మి, తమ ఖర్చులు పోను 5 నుండి 6 లక్షల రూపాయల వరకు నిఖరాదాయాన్ని సంపాదిస్తున్నారు.

ఈ విధంగా రమేష్ నర్సరీ బృందం కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల వారి ఆర్యప్రాజెక్టు ద్వారా శిక్షణ, ఆర్థిక సహకారంతో స్వయం ఉపాధిని పొంది జిల్లాలోని రైతులకు నాణ్యమైన నారును అందిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఔత్సాహిక యువత రమేష్ నర్సరీ బృందాన్ని ఆదర్శంగా తీసుకొని వ్యవసాయ మరియు వ్యవసాయానుబంధ రంగాలలో స్వయం ఉపాధిని పొందుతూ ఇతరులకు ఉపాధిని కల్పించాలని ఆశిద్దాం.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9553153149**

## 41వ పేజీలోని వ్యవసాయ పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | 2 వి | త్త | న | శు | ద్ధి |
| | | 2 తె | | | | | | | | |
| | | లం | | | | 4 కి | | 5 క | | |
| 1 తె | లం | గా | ణ | 3 వ్య | వ | సా | యం | ది | క్సూ | 6 చి |
| లం | | ణ | | వ | | న్ | | రి | | లా |
| గా | | కం | | సా | | రై | | -9 | | మి |
| ణ | | ది | | యం | | లు | | | | న్ |
| సో | | | | | | | | | | |
| న | | | 3 వ | ర్మి | కం | పో | స్ట్ | | | 7 ను |
| | | | | | | | | | | వ్వు |
| 4 చే | ను | క | బు | ర్లు | | 5 లో | తు | దు | క్కు | లు |

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు :** 1. డి 2. డి 3. డి 4. డి 5. సి 6. బి 7. సి 8. బి 9. బి 10. సి

# వేసవిలో చేపట్టవలసిన వ్యవసాయ పనులు

డా॥ ఎస్. మాలతి, బి. క్రాంతి కుమార్, డా॥ ఇ. రాంబాబు, డా॥ ఎన్. కిషోర్ కుమార్, ఎ. రాములమ్మ మరియు డి. ఉష శ్రీ
కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల, మహబూబాబాద్




1. పంటల అవశేషాలను భూమిలో కలియదున్నడం.
2. మట్టి నమూనా సేకరణ – పరీక్ష చేయించడం.
3. వేసవి లోతు దుక్కులు చేయడం.
4. మేకలు/గొర్రెలను సాగు భూమిలో మంద కట్టడం.
5. సేంద్రీయ ఎరువులు – పశువుల పెంట/ఎరల ఎరువు సేకరణ.
6. చెరువు మట్టిని పొలంలో తోలడం.
7. బావుల పూడికతీత మరియు నీటి పారుదల కాలువల మరమ్మతులు చేయడం.
8. సాగు చేయబోయే పంటల సమాచార సేకరణ మరియు నాణ్యమైన విత్తనాల సేకరణ.
9. ప్రధాన పంటకు ముందు పచ్చిరొట్ట ఎరువు పంటల సాగు

RNI No : TELTEL/2015/60296 May, 2021 Postal Regd.No:HSE/1013/2021-2023
Total No. of Pages : 52 Date of Publication : 06.05.2021
Date of Posting : 09.05.2021




## విశ్వవిద్యాలయ ఐదవ స్నాతకోత్సవంలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థిని మరియు విద్యార్థులు

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. Ch. Venu Gopala Reddy on behalf of Professor Jayashankar Telangana State Agricultural University,
Owned by Professor Jayashankar Telangana State Agricultural University,
Printed At : PJTSAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Published From : Professor Jayashankar Telangana State Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Editor : Dr. Ch. Venu Gopala Reddy, RNI File No. 1262077, Title-Code : TELTEL00152